# నేను
# గెరిల్లానెందుకయ్యానంటే?

## పీ.ఎల్.జీ.ఏ
## 20వ వార్షికోత్సవాల సందర్భంగా
## ప్రత్యేక సంకలనం

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# నేను
# గెరిల్లానెందుకయ్యానంటే?



ఆంధ్రా ఒడిశా స్పెషల్ జోనల్ కమిటీ

(తేది: మే 2021)

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# ముందుమాట

ఈ పుస్తకం (నేను గెరిల్లానెందుకయ్యానంటే?) ఆదివాసీ ప్రాంతాలలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను కళ్ళకు కట్టినట్టు చూపుతుంది. ఇందులో ఐదుగురు కామ్రేడ్స్ గెరిల్లాలుగా మారిన క్రమాలు ఉన్నాయి. వీరందరూ మహిళా కామ్రేడ్సే. వీరు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీష్‌ఘడ్ రాష్ట్రాలలోని విశాఖ, కొరాపుట్, మల్కనగిరి, బీజాపూర్ జిల్లాలకు చెందినవారు. వీళ్ళందరి జీవితాలలో కొన్ని సారూప్యతలూ, సామీప్యతలు ఉన్నాయి. సాధారణ అంశాలుగా చూసినప్పుడు వీరు ఆదివాసీ మహిళలు కావడంతోపాటు, వీరి బాల్యం ఉద్యమ ప్రాంతాలలోనే గడిచింది. వీరందరి కుటుంబాలు పేద రైతాంగానికి చెందినవే. ఈ కుటుంబాలు గ్రామాలలో మున్సబుల, పెద్దాల్‌ల ఆధిపత్యానికీ, అణచివేతకు బలైనాయి. వీరి కొద్దిపాటి భూములను ఆయా గ్రామాల మున్సబులు, పెద్దాల్‌లు బలవంతంగా గుంజుకొని దౌర్జన్యంగా వీరిని సొంత గ్రామాల నుంచి గెంటేసారు. ఈ పరిణామాలు ఆదివాసీ సమాజంలో కూడా వర్గాలు ఏర్పడ్డాయనే వాస్తవాన్ని చాలా స్పష్టంగా ధృవీకరిస్తున్నాయి. ఇలా గెంటివేయబడ్డ కుటుంబాలకు భూమే సర్వస్వం. అది లేకపోతే జీవితమే లేదు. అందుకే భూమి కోసం, తమ జీవిక కోసం వలసబాట పట్టారు. భూమి కోసం జరిగిన ఈ వెతుకులాటలో నిద్రలేమి రాత్రులు, పస్తులు, అవమానాలు వీరిని వెన్నంటే ఉన్నాయి. ఈ సమయానికి ఈ ఐదుగురు కామ్రేడ్స్ చిన్నవారే అయినప్పటికీ, ఈ చేదు జ్ఞాపకాలన్నీ వాళ్ళ చిన్న బుర్రలో నిక్షిప్తమైపోయి ఉన్నాయి. కొన్ని విషయాలను ఇంట్లో పెద్దవాళ్ళు చెబుతుంటే కూడా జ్ఞాపకం పెట్టుకున్నారు. ఈ భూమి వాళ్ళ జీవితంలో ఎంత కీలకమైన అంశమంటే, అది ఉంటేనే ఎంతో కొంత సంతోషం. లేకుంటే అంతా దుఃఖమే, అన్ని సమస్యలే. భూమిని కోల్పోయిన ఈ కుటుంబాలన్నీ తీవ్రమైన ఆకలిని ఎదుర్కొన్నాయి. అనేక రోజులు పస్తులతో గడిపాయి. వీరి జీవితాలలో విషజ్వరాలు, అసహజ మరణాలు సర్వసాధారణం. వీరికి చెట్ల మందులు తప్పితే, ఇంగ్లీషు మందులు (అలోపతి) దొరకటం అసాధ్యం. ఇటువంటి పరిస్థితులలో ఈ కామ్రేడ్స్ మెజారిటీగా తమ తల్లినో, తండ్రినో కోల్పోయారు. ఇక చదువనేది వారికి అందని ద్రాక్షే. ప్రభుత్వ బడులు అక్కడక్కడ ఉన్నా, గురుజీలు బడులకు రావడంకానీ, పిల్లలకు చదువులు చెప్పడం కాని ఉండదు. ఈ సమస్యలకు తోడు వెనకబడిన ఆదివాసీ రీతీరివాజులు వీరికి పీడగానే దాపురించాయి. ముఖ్యంగా ఈ కామ్రేడ్స్ అంతా మహిళలు కావడంతో ఆదివాసీ సమాజంలో పితృస్వామ్యాన్ని తీవ్రంగానే ఎదుర్కొన్నారు. కొద్దిమంది బలవంతపు పెళ్ళిళ్ళ సమస్యను ఎదుర్కొన్నారు. వారు

ఎదుర్కొన్న ఈ సమస్యల్నీ, కష్టాల్ని లోతుగా అర్థం చేసుకోవాలంటే ఈ పుస్తకంలో పొందుపరిచిన వారి మాటలను చదవాల్సిందే.

అయితే వారి చీకటి జీవితాల్లో విప్లవం కొత్త వెలుగును ప్రసరింపజేసింది. నిర్లిప్తమైన, నిస్తేజమైన జీవితాల్లో విప్లవం నూతన ఉత్సాహాన్ని నింపింది, కొత్త శక్తిని ఇచ్చింది. విప్లవం వాళ్లకు భూమిని ఇచ్చింది. అధికారా(ప్రజాస్వామ్యం)న్ని ఇచ్చింది. ఇంకా విద్యా, వైద్యం, సాగునీరు, తాగునీరు, రహదారులు వంటి సౌకర్యాలను విప్లవ సంస్కరణల రూపంలో సమకూర్చింది. ఇలా ఎన్నో అవసరాలను తీర్చింది. ఇక్కడ విప్లవం అంటే ఎవరో చేసిపెట్టింది కాదు. పార్టీ అందించిన రాజకీయాలతో ప్రజలు నిర్వహించిన మహత్తర ప్రక్రియనే విప్లవం. విప్లవ ప్రక్రియ అంటేనే సాయుధవర్గ పోరాటం. నిర్దిష్టంగా చెప్పాలంటే గెరిల్లాయుద్ధ రూపంలో జరుగుతున్న ప్రజాయుద్ధమే. ఈ పోరాటం, యుద్ధం గ్రామస్థాయి వర్గశతృవుల నుంచి వారికి అండగా వచ్చే రాజ్యానికి వ్యతిరేకంగా జరిగింది, జరుగుతున్నది కూడా. రాజ్య ప్రయోజిత జల్వాజుడుం, శాంతి సంఘాలను ఈ ప్రజాయుద్ధం ఢీకొన్నది. ఇలా విప్లవ ప్రజానీకం పార్టీ నేతృత్వంలో ఒక బలమైన శతృవుతో భీకరమైన పోరాటం చేస్తూ, రక్తతర్పణ చేస్తూ భూమినీ, అధికారాన్ని సాధించుకుంటున్నారు. కొన్ని విజయాలను సాధించుకొన్నారు. నేడు ఈ అనుభవాల పునాదిపైనే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే కృషి కొనసాగుతున్నది.

ఇటువంటి వాతావరణంలో ఈ కామ్రేడ్స్ అంతా బాలలసంఘం నుంచి మొదలుకొని సాంస్కృతిక సంఘం, మిలీషియా... ఇలా అనేక నిర్మాణాలలో చురుగ్గా పని చేసారు. చిన్న వయస్సులోనే నూతన భావాలతో కొత్త చైతన్యాన్ని సంతరించుకొని విప్లవోద్యమంలో ఎదురయ్యే ఆటుపోటులన్నింటినీ ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత వ్యవస్థలో పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని ఆధిపత్యాలనూ, బంధనాలను ధ్వంసం చేయాలంటే సాయుధవర్గ పోరాటం తప్ప, మరోమార్గంలేదనే చారిత్రక వాస్తవాన్ని అర్థం చేసుకొని సాయుధులయ్యారు, గెరిల్లాలయ్యారు. ఈ విషయాలన్నింటినీ ఈ పుస్తకంలో వారు నేరుగా వ్యక్తపరిచిన అభిప్రాయాలను చదవడం ద్వారా తెలుసుకోవడం గొప్పస్ఫూర్తిని కల్పిస్తుంది. ఈ క్రమం ఈ ఐదుగురికి సంబంధించిందే కాదు, ఈ దేశంలో 90%గా ఉన్న పీడిత ప్రజానీకానికి కూడా ఒక అనివార్య క్రమమే.

# వాళ్ళిప్పుడు హుందాగా తమ తలలు పైకెత్తి నిటారుగా నిల్చున్నారు

# వాళ్ళే ప్రజా గెరిల్లాలు

*వాళ్ళ జీవితం భూమితో ముడి పడి ఉంది. పాత సామాజిక వ్యవస్థపై సాయుధంగా తిరగబడకుండా భూమి దక్కదనే విషయాన్ని వారికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధ రాజకీయాలు నేర్పాయి. అంతేకాదు, భూమికోసం పోరాటం ప్రజాస్వామ్యసారంగా వుంటుందనే విషయాన్నీ, ప్రజల రాజ్యాధికారంతో ముడిపడి ఉంటుందనే విషయాన్ని కూడా వాళ్ళకు అవగతం చేసాయి. అందుకే వాళ్ళు ప్రజల విముక్తి కోసం, ప్రజల పక్షాన, ప్రజా విముక్తి గెరిల్లాలుగా మారారు.*

## 1

నాపేరు సోమ్డి (వయస్సు 22) మా అమ్మ పొడియమి సుక్కుడి, నాన్న పేరు జోగాల్. మా సొంత ఊరు దండకారణ్యంలోని కుమ్మఫిర బోదమ్ దగ్గర ఉన్న పడలే బాక్రసోల్. ఆ ఊరిలో మేము మా తాత నుండి సంక్రమించిన భూమిలో వ్యవసాయం చేసుకొని బతుకుతూఉండేవాళ్ళం. ఎండాకాలమైనా, వర్షాకాలమైన నిత్యం గల గల పారుతూ ఉండే సెలయేటి నీళ్ళు మా పొలానికి అందుతూ ఉండేవి. అందువల్ల సంవత్సరానికి రెండు పంటలు పండిస్తూ, సంతోషంగా

బతికేవాళ్ళం. కాని రోజులు బాగాలేవు. ఆ ఊరి పెద్దాల్ (పెత్తందారు) కన్ను మా భూమిపై పడింది. ఆ భూమిని ఆక్రమించుకోవడానికి వాళ్ళు చేయని ప్రయత్నమంటూ లేదు. భూమిని విడిచి పెట్టాలని బెదిరించారు. చంపాలని ప్రయత్నాలు చేసారు. వాటన్నింటికి మా నాన్న భయపడలేదు. అంతే కాదు, "నా ప్రాణాలైనా ఇస్తాను గానీ నా భూమిని వదలను. లేలేత రెమ్మలాంటి ముగ్గురు పిల్లలు నాకు ఉన్నారు. ఈ భూమిని నమ్ముకునే వారిని పోషించుకుంటున్నాను. నా భూమి మీకిస్తే వాళ్ళనెలా పెంచుకుంటాను? మీరు ఏం చేసుకుంటారో చేసుకొండి, భూమైతే వదిలేది లేదు" అని తెగేసి చెప్పాడు. మా తాతకు మా నాన్న ఒక్కడే, అన్నదమ్ములు లేరు, ఒక అక్క ఉంది. ఈ గొడవలను చూసిన మా అత్త తమ్ముణ్ని చంపేస్తారని చాలా భయపడింది. దాంతో ఆ రోజు సాయంత్రం  మా ఇంటికి వచ్చింది. ఎక్కడైనా వెళ్ళి భూమి వెతుక్కొని బతకమనీ, అడవిపై ఆధారపమని చెప్పి కన్నీరు మున్నీరైంది. దాంతో మా నాన్న ఆలోచన మారింది. భూమి కోసం వెతుకులాట ప్రారంభించాడు మా నాన్న. జగదల్‌పూర్, రాయ్‌పూర్, కిరండుల్ వంటి పట్టణాలు, జేగురుగొండ, పిడియా, బిడియటుంగల్ వంటి గ్రామీణ ప్రాంతాలు అన్నీ తిరిగాడు. చివరకు బీజాపూర్ జిల్లా, గంగులూర్ ఏరియా, కద్దేరు పంచాయితీలోని దుర్ద ఊరిలో కొంచెం భూమి దొరికింది. దానితో మా నాన్న మా కుటుంబాన్ని తీసుకొని కట్టుబట్టలతో సొంత ఊరునూ, తన వాళ్ళనూ వదిలి బయలుదేరాడు. ఆ రోజు ఉదయం కుమ్మఫిర బోదమ్ వద్ద బస్సు ఎక్కి సాయంత్రం 5గంటలకు కిల్లెపాల్ వద్ద దిగాం. అయితే అప్పటికే చీకట్లు కమ్ముకోనారంభించాయి. నన్ను మా నాన్న తన భూజాలకెత్తుకున్నాడు. వడివడిగా నడక ప్రారంభించాం. కొత్త ప్రాంతానికి తోడు దట్టమైన అడవి మా భయాన్ని రెట్టింపు చేసింది. దారిలో జంతువుల వల్ల ఏ ఆపద రాకుడదని మా అమ్మ దేవుడ్ని మొక్కుకోసాగింది. చివరకు దుర్ద ఊరు చేరుకున్నాం. అయితే అప్పటికీ రాత్రి ఎంత సమయం అయ్యిందో  తెలియదు.

2001 మధ్య కాలం నుండి మేం ఆ ఊరిలో కొత్త భూమిని సాగు చేయడం ప్రారంభించాం. ఆ భూమిని సాగులోకి తేవడానికి మా కుటుంబం చాలా కష్టపడింది. కాని దక్కిన ఫలితం మాత్రం చాలా స్వల్పం. ఎందుకంటే ఆ భూమికి నీటి సదుపాయం తక్కువ. అందువల్ల దాంట్లో నుండి వచ్చే పంట కూడా తక్కువే. మా అమ్మ, నాన్న, ఇద్దరన్నయ్యలు పొద్దుపొడిచిన దగ్గర నుండి పొద్దుగూకే వరకు ఆ భూమిలో పని చేస్తూనే ఉండేవారు. అయినా ఏ పూట మేం కడుపు నిండా తిన్నది లేదు. ఆకలికి తట్టుకోలేక మా అన్నయ్యలు అడవికి వెళ్ళి దుంపలు

తెస్తే, మా అమ్మ వాటిని ఉడికించి మాకు పంచి పెట్టేది. ఆ చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల జబ్బులకు మా నాన్న తనకు తెలిసిన మూలికా వైద్యం చేస్తుండేవాడు. దానికి వాళ్ళు తమకు తోచినంత సహాయం (బియ్యం) చేసేవాళ్ళు. అది కూడా సరిపోక మా నాన్న కూలీకి ఉదయాన్నే పోయి సాయంత్రానికి తిరిగి వచ్చేవాడు. 2001 నుండి 2004 వరకు మా కుటుంబం ఎంత కష్టపడినా మా ఆకలి పెరిగిందే తప్ప తగ్గింది లేదు. మమ్మల్ని ఎలా పెంచాలనే బెంగతోనే మా నాన్న ఎప్పుడూ బాధడేవాడు. చివరకు ఆ బెంగతోనే 2004 చివరలో జబ్బు చేసి చనిపోయాడు. దాంతో మా అమ్మ మేం దిక్కులేనివాళ్ళం అయిపోయాం. చనిపోయిన మా నాన్న శవాన్ని కప్పే బట్టలు కొనడానికి మా అమ్మ ఆ ఊరిలో 1000 రూ॥ల అప్పు తెచ్చింది. ఆ డబ్బుతోనే మా నాన్న దినకర్మ చేసాం. అయితే ఆ అప్పు తీర్చడం కోసం మా అమ్మ రాత్రి పగలు కష్టపడి పని చేసేది. నాన్న లేడనే బెంగ, మా ఆకలిని ఎలా తీర్చాలనే ఆలోచన, అప్పు ఇచ్చినవాళ్ళు అడగడం... ఇవన్నీ ఆమె ఆరోగ్యాన్ని దెబ్బతీసాయి. జబ్బు పడిన తర్వాత ఆమె మరింత కృంగిపోయింది. ఒకరోజు ముఖ్య విషయం చెప్పడానికన్నట్లు మా అన్నయ్యలిద్దర్ని పిలిచింది. నేను మా అమ్మ వీపుకు చేరపడి మెడచుట్టు చేతులు వేసి వినసాగాను. "మీరు తొందరగా పెరిగి పెద్దవాళ్ళయి ఆ అప్పు ఎలాగైనా తీర్చాలని" చెప్పింది. అమ్మ బాధపడుతున్నదని అర్థమైంది. కానీ, ఆ మాటల వెనుక ఉన్న లోతు, దుఃఖం నాకు అర్థం కాలేదు. ఎందుకంటే అంత కరువులో కూడా వాళ్ళు ముందు నా పొట్ట నింపి, తరువాతే వాళ్ళు తినేవారు. చివరికి నాన్న పోయిన ఏడాదికి అంటే, 2005 లో అమ్మ చనిపోయింది. దీంతో తల్లిలేని కోడిపిల్లల మాదిరి అయ్యింది మా పరిస్థితి. సొంత ఊరునూ, అయిన వాళ్ళను వదులుకొని వచ్చిన మేం ఒంటరి వాళ్ళమయ్యాం. ఒక విధంగా చెప్పాలంటే అనాధలమయ్యాం. అప్పటి వరకు ఉన్న ఆకలి సమస్యతో పాటు, అనేక సమస్యలు ఎదుర్కోవలసి వచ్చింది. అమ్మ ఉన్నప్పుడు ప్రతి పని ఎలా చేయాలో దగ్గర ఉండి మాకు నేర్పించేది. కానీ ఇప్పుడెలా? అన్నం వండాలంటే వడ్లు దంచాలి, నాకు దంచడం రాదు. అయినా ప్రయత్నించాను. దీన్ని చూసిన మా అన్నయ్యలు నా చేతిలో రోకలి తీసుకుని "నీవు వెళ్ళిపో" అంటూ నన్ను పంపించి వాళ్లు దంచడం మొదలు పెట్టారు. అయితే దంచిన ధాన్యం చెరగడం వారికి రాదు నాకు వచ్చు. దాంతో మళ్ళీ నన్ను పిలిచేవారు. ఇలా ఏ పని చేయాలన్నా ముగ్గురం కలిసి చేయాల్సి వచ్చేది. ఒక రోజు అన్నయ్యలిద్దరు ఉదయాన్నే పొలానికి పోవడంతో, నేను అన్నం వండాల్సి వచ్చింది. బియ్యం పోసేముందు నీళ్ళు వేడెక్కాయో లేదో తెలుసుకోవడానకి గంటెతో నీళ్ళు

తీసి చేతిలో పోసుకున్నాను. చెయ్యి కాలిపోయింది. ఇంకొకరోజు నీళ్ళు మరగకుండానే బియ్యం పోసాను. అన్నం సరిగ్గా ఉడకలేదు. అన్నం మంచిగా వండటానికి సరిగ్గా 4 నెలలు పట్టింది. ఈ బాధలు భరించలేక నాకు చావలేక బతుకుతున్నామని అన్పించింది. ఇప్పటికీ నాకు అమ్మా, నాన్నలు లేని పిల్లలను చూస్తే నా చిన్నతనమే గుర్తుకొస్తుంది. పూటకు తిండే దొరకని ఈ సమాజంలో తల్లి దండ్రులు లేని పిల్లల సంరక్షణ ఎవరు చూస్తారు? వారికి మంచి తిండి, శుభ్రమైన బట్టలు ఎవరు ఇస్తారు? వారిని ఎవరు గారాబం చేస్తారు? ఇలా ఎన్నో ప్రశ్నలు నా మదిని తొలిచేవి. మా కంటూ ఎవరూ లేరు. రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమించినా తిండి దొరకని పరిస్థితి. మాకు ఈ బాధలకు తోడు ప్రభుత్వం మా మీద కక్ష కట్టి 2005లో సల్వాజుడుంను ప్రారంభించింది. దానితో మా బతుకులు మరింత దుర్భరమయ్యాయి. హత్యలు, అత్యాచారాలతో ఒక భయానక వాతావరణం ఏర్పడింది. అప్పటి వరకు నిశ్శబ్దంగా ఉన్న పల్లెల్లో చిచ్చు రేగింది. సొంత మనుషులే శతృవులయ్యారు. ఊర్లు వల్లకాడులయ్యాయి. పంటలు నాశనమయ్యాయి. గొడ్లు, మేకలు, కోళ్ళు ఒకటేమిటి విలువైన ప్రతీది ప్రజల నుండి దొంగించారు. అంతా నాశనం అయ్యింది. ఎక్కడ చూసినా విధ్వంసం చెలరేగుతున్నది. ఇలాంటి తరుణంలో ఒక రోజు మా పెద్దన్నయ్య అడమాల్ మా ఇద్దరిని పిలిచి తన దగ్గరనే కూర్చోపెట్టుకొని నెమ్మదిగా మాట్లాడటం మొదలు పెట్టాడు. "అమ్మ, నాన్నలు పోయిన దగ్గర నుండి మన కష్టాలు ఎక్కువయ్యాయి. మనకు భూమి లేదు, గొడ్లు లేవు, కూలీ చేసుకుందామంటే కూలీ పని లేదు. కనీసం అడవిలో దుంపలు తినైనా బ్రతుకుదామంటే అవి కూడా తినలేని పరిస్థితిని 'సల్వాజుడుం అభియాన్' తీసుకువచ్చింది. ఈ పరిస్థితి మన ఒక్కరికే కాదు, ఈ ప్రాంత ప్రజలందరి స్థితి ఇలాగే వుంది. ఎన్ని రోజులు ఈ బాధలు భరిస్తాం. అందుకనే నేను ఒక నిర్ణయానికి వచ్చాను" అంటూ ఊపిరిపీల్చుకునేందుకు ఒక్క నిమిషం ఆగి, మరల చెప్పడం ప్రారంభించాడు. "ఈ సమస్యలన్ని పరిష్కారం కావాలంటే మనం సాయుధంగా పోరాడాలి. అందుకే నేను దళంలోకి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను" అని చెప్పడం ముగించాడు. తను చెప్పడం ముగించిన మరుక్షణమే మేం ఇద్దరం తన కాళ్ళు చుట్టుకున్నాం. "అడమాల్ నీవే ఇంటికి పెద్దవాడివిరా అమ్మ, నాన్న చనిపోయినా నీపై ఆధారపడి బ్రతుకుతున్నాం. నీవు వెళ్ళిపోతే మమ్మల్ని ఎవరు చూస్తారు? నీవు వెళ్ళడానికి వీల్లేదు మేం ఒప్పుకోం" అని ఏడ్చాం, బతిమాలాం, కోపడ్డాం. అయినా మా అన్నయ్య వినలేదు. సాయంత్రం 6గం॥లకు అన్నం తిని మాకు జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు.

అన్నయ్య మాకు దూరమవడం అనేది ఒక సమస్యైతే, ఊరి వాళ్ళకు ఏం చెప్పాలి? అనేది మరొక సమస్య. దళం బలవంతంగా తీసుకుపోయిందని అబద్దం చెబుదామని అనుకుని ఏడుస్తూనే పడుకున్నాం. మేం ఇంకా నిద్రలేవకముందే తెల్లవారుజామున 4గం॥లకు డోలు కొట్టిన శబ్దం వినబడింది. ఆ శబ్దం విన్న నేను, మా చిన్నన్నయ్యతో 'అన్నయ్య ఆ డోలు ఎందుకు కొడ్తున్నారు' అని అడిగాను. దానికి బదులుగా 'మన అన్నయ్య దళానికి వెళ్ళిన విషయం తెలిసిందేమో' అన్నాడు. మన అన్నయ్య దళానికి వెళ్తే వాళ్ళకేంటి అన్నాను. "మన ఊరంతా ప్రభుత్వ నిర్బంధంలో వారి ఆధీనంలో ఉంది. మన ఊరి నుండి 8 మందిని తీసుకుపోయి, పోలీసు క్యాంపుల పక్కన ఉన్న నిర్బంధ శిబిరాల్లో పెట్టారు. ఊరిపై అనేక ఆంక్షలు పెట్టారు. అంతేకాదు, మన ఊరిలోని పెద్దాల్‌లు సల్వాజుడుంతో చేతులు కలిసి, పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారు. అందుకే మన కష్టాలు ఇప్పటినుండి మరింత పెరుగుతాయి" అన్నాడు. అయినా నీవు ఆ డోలు గురించి ఎక్కువ ఆలోచించకు అని చెప్పాడు. తర్వాత కొద్దిసేపటికీ అందరు జమయ్యి మమ్మల్ని పిలిచారు. మేం వెళ్ళీ వెళ్లగానే "మీరు దళానికి ఆశ్రయమిస్తూ ఆదరిస్తున్నారు. మీ అన్నయ్య మాపై పగ తీర్చుకోవడానికే దళానికి వెళ్ళాడు. మీరు ఇక్కడ ఉండి మా సమాచారం పార్టీకి అందజేస్తున్నారు" అంటూ తిట్టడం ప్రారంభించారు. కొద్దిసేపటికి మేం గొంతు పెగల్చుకుని నెమ్మదిగా మా అన్నయ్యను దళం బలవంతంగా తీసుకుపోయింది, మాకేం సంబంధం లేదు అని మాత్రం చెప్పగలిగాం. అయినా వారు మా మాటల్ని నమ్మలేదు. ఆ రోజు ఓ గండంగా గడిచిపోయింది. రోజులు గడుస్తున్నాయి. నిరంతరం గుంపులు గుంపులుగా చేరి మా గురించి మాట్లాడుకునేవారు. "మీరు బ్రతకాలంటే మీ అన్నయ్యను వెనక్కి తీసుకురండి, లేదంటే మీ ఇద్దరి కాళ్ళు కట్టి మంటలో వేసేస్తాం" అని బెదిరించారు. ఒక రోజు నీళ్ళు తీసుకురావడానికని బోరింగ్ దగ్గరకు వెళ్ళిన నాతో అక్కడ మహిళలు "ఈ బోరింగ్ నక్సలైట్లు ఇచ్చింది కాదు, ప్రభుత్వం ఇచ్చింది. నీవు నీళ్ళు తీసుకుపోవడానికి వీల్లేదు" అంటూ తిట్టడం మొదలు పెట్టారు. నేను వారికి జవాబు చెప్పలేక మౌనంగా నీళ్ళు పట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తూ ఇంటికి చేరుకున్నాను. సల్వాజుడుం వాళ్ళు పెట్టిన మీటింగ్‌కు వెళ్ళిన అన్నయ్య ఇంకా రాలేదు. ఏం జరుగుతుందోననే బెంగతో నేను వాకిలి వైపే ఎదురుచూడసాగాను. దిగాలు పడిన ముఖంతో ఇంటికి చేరుకున్న అన్నయ్యను చూసి నా మనస్సు కుదుటపడింది. ఒక రోజు ఇద్దరం కలిసి నయమేల్ సంతకు వెళ్ళాం. సంతలో ఆరుగురు సల్వాజుడుం గుండాలు వచ్చి మమ్మల్ని చుట్టుముట్టారు. నేను భయంతో

బిగుసుకుపోయాను. "మీ నక్సలైట్లు గెలుస్తారని మీరు అనుకుంటున్నారా? ఎప్పటికి గెలవరు. సల్వాజుడుం జిందాబాద్, నక్సల్‌వాది ముర్దాబాద్" అంటూ నినాదాలు ఇచ్చి వెళ్ళిపోయారు. వారు వెళ్ళగానే గుండెలు అరచేతిలో పెట్టుకొని ఇంటికి చేరుకున్నాం. ఒకరోజు అన్నయ్య, నేను కలిసి వరి కోతకు పొలానికి వెళ్ళాం. పక్కపొలంలోని పెద్దాల్ కుటుంబంవాళ్ళు "అన్నాచెల్లెలిద్దరిని గొడ్డలితో నరికిపారేస్తే సరి" అని మాట్లాడుకుంటున్న మాటలు మా చెవిన పడ్డాయి. దాంతో మా అన్నయ్య "మనం కష్టపడి పంట కోసినా దీన్ని తిననిచ్చేలాలేరు. పద ఇంటికి పోదాం" అని నన్ను తీసుకుపోయాడు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనే ఆందోళనతో ఎన్నో నిద్రలేని రాత్రుళ్ళు గడిపాం. చివరకు నేను చనిపోతే మంచిదనే ఆలోచనకు వచ్చాను. బలంగా, పొడుగ్గా ఉన్న తాడును తయారు చేసుకున్నాను. ఇద్దరం అన్నం తింటుండగా చిన్నగా చెప్పాను. అన్నయ్య ఊరి వాళ్ళు మనల్ని మంటలోవేసి చంపుతామని అంటున్నారు కదా! దానికన్న మనమే అడ్డాకు చెట్లు ఎక్కి ఉరి వేసుకుని చనిపోతే మంచిదని నాకు అనిపిస్తుంది అని అన్నాను. దీనికి మా అన్నయ్య కోపంగా "ఏ మాట్లాడుతున్నావు, అమ్మ, నాన్న మనల్ని ఎంత ప్రేమగా చూసుకున్నారో, ఎంత కష్టపడ్డారో మరచిపోయావా? ఏం తప్పు చేసామని మనం ఆత్మహత్య చేసుకోవాలి? అలా అలోచించకు. నేనయితే సల్వాజుడుం గుండాలను ఒకరిద్దరినైనా చంపే చనిపోతాను" అని అన్నాడు. అన్నయ్య మాటలు నన్ను కొంత ప్రభావితం చేసినా, నేను చనిపోతే తను ఒంటరివాడవుతాడనే అందోళన ప్రధానంగా నన్ను ఆ ప్రయత్నం నుంచి విరమించుకునేలా చేసింది. రోజులు భారంగా దొర్లుతున్నాయి. ఇంతలో చెవి వినబడని కారణంగా దళం నుండి మా పెద్దన్నయ్య అడమాల్ 2006, ఫిబ్రవరిలో ఒక రోజు రాత్రి ఇంటికి వచ్చేసాడు. అప్పటికీ, మా ఊరు సల్వాజుడుం ప్రభావంలోనే ఉంది. హఠాత్తుగా వచ్చిన మా అన్నయ్యను చూసి మేం కోప్పడ్డాం. నీవు ఎందుకు వచ్చావు. నీవు వెళ్ళిన దగ్గర నుండి ఊరివాళ్ళు, సల్వాజుడుం గుండాలు ఎన్ని బాధలు పెట్టారో నీకు తెలుసా? ఇంత నిర్బంధంలో నిన్ను ఎక్కడ దాచి పెట్టాలి అని అన్నాం. కానీ తన అనారోగ్యం కారణంగా తనని మాతోనే ఉంచుకోవాలని అనుకున్నాం. ఎవరికి అర్థం కాకుండా అడవిలో 6 నెలల పాటు దాచిపెట్టాం. ఈ లోగా ఒక రోజు రాత్రి 7గురితో కూడిన జన మిలీషియా దళం మా ఇంటికి వచ్చింది. వాళ్ళు రావడం మాకు చాలా సంతోషం కలిగించింది. ఊరివాళ్ళకు తెలియకుండా సమీప అడవిలో వారిని ఉంచి వారికి తిండి, నీరు ఏర్పాటు చేసాం. 5 రోజుల పాటు ఉండి వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళు వచ్చి వెళ్ళిన కొద్ది రోజులకే మా చిన్నన్నయ్య (బుదరామ్)

దళంలోకి వెళ్ళాడు. అతను వెళ్తున్నప్పుడు నాకు అడ్డు చెప్పాలని అన్పించలేదు. అప్పటికి సల్వాజుడుంపై ప్రజల, పి.ఎల్.జి.ఎల ఎదురుదాడి మొదలవడంతో గ్రామస్తులు ఇంతకు ముందులా మమ్మల్ని తీవ్రంగా వేధించడం లేదు. అయితే సూటిపోటి మాటలతో మమ్మల్ని బాధపెట్టేవారు. 2008 నుండి పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వెళ్ళాలని ఆలోచన నాలో బలపడుతూ వచ్చింది. అయితే నా ప్రవర్తనలో వచ్చిన మార్పును గమనించిన గ్రామస్తులు "మీ అమ్మ, నాన్న దళంలో పుట్టారా? మీ అన్నయ్య దళంలో చనిపోతే అతని శవాన్ని కుక్కలు, నక్కలు పీక్కుతింటాయి. ఊరిలో చనిపోతే గౌరవంగా దినకర్మ చేస్తాం. అక్కడ ఎవరు చేస్తారు? అందుకే నీవు దళానికి వెళ్ళాలనే ఆలోచన వదిలిపెట్టి హాయిగా పెళ్ళి చేసుకుని ఇక్కడే ఉండు" అని చెప్ప సాగారు. వారు ఎన్ని రకాలుగా చెప్పినా ఆ మాటాలు నాకు రుచించలేదు. ఈ కష్టాలకు, బాధలకు కారణాలు అర్థమయ్యాయి. తుపాకికి తుపాకితోనే సమాధానం చెప్పాలనే నిర్ణయానికి వచ్చాను.

2009 డిసెంబర్‌లో దళంలోకి వెళ్ళాను. రెండు నెలల ట్రైనింగ్ అనంతరం గంగులూరు ఏరియాలో పని చేసాను. పార్టీ అవసరాల రీత్యా 2010, మార్చి నెలలో ఎ.ఒ.బికి బదిలీ చేయబడ్డాను. నేను దళంలోకి వచ్చిన రోజున నా వంటి మీద ఒక్క లుంగీ మాత్రమే ఉంది. అర్థాకలితో వచ్చాను. పార్టీలోకి వచ్చిన తరువాతే నాకు కడుపు నిండా మంచి తిండి దొరికింది. శుభ్రమైన బట్టలు కట్టుకుంటున్నాను. అన్నిటికన్నా ఎలాంటి అవమానాలు, దుఃఖం లేని జీవితం గడుపుతున్నాను. ఆత్మగౌరవంతో, సంతోషంగా బ్రతుకుతున్నాను. ప్రజల మౌలిక సమస్యలైన భూమి, అధికారం, ఆత్మగౌరవం వంటివి పరిష్కారం కావాలంటే కొద్ది మంది పోరాడితే సరిపోదని అర్థమయ్యింది. అందుకు లక్షలాది మంది ప్రజలను సాయుధం చేయాలని నిర్ణయించుకున్న. అయితే ఎ.ఒ.బిలో నేను ముందుగా ఎదుర్కొంటున్న సమస్య భాష సమస్య. దాంతో పాటు ఉండే పెద్ద పెద్ద కొండలు కూడా. ఒక రోజు కొరాపుట్‌లోని దేవ్‌మాలి పర్వతం ఎక్కుతున్నప్పుడు ఎక్కలేక నా కళ్ళనుండి నీళ్ళు తిరిగాయి. ఇంత పెద్ద కొండలు ఎక్కడం నా వల్ల కాదనిపించింది. అయితే కొండపైకి చేరుకున్నాక అలసట తీర్చుకోవడానికి కూర్చున్న నాకు మొట్టమొదట నేను పని చేసిన ఏరియాలో అక్కడి కమాండర్‌తో ఎంత కష్టమైనా, ఎంత దూరమైనా వెళ్ళి పని చేస్తానని అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. అంతే కాదు, ఇల్లు కూడా గుర్తుకు వచ్చింది. అక్కడి కష్టాల కన్నా, ఇవి ఎక్కువ కాదని అనిపించింది. అంతే ఆ రోజు నుండి నాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది, భాష నేర్చుకున్నాను. పెద్ద పెద్ద కొండలు

ఎక్కుతున్నాను. పార్టీ సిద్ధాంత, రాజకీయాలను అర్థం చేసుకుంటున్నాను. శత్రువుతో జరిగిన అనేక ఎదురు కాల్పులలో పాల్గొన్నాను. ఈ ప్రజాయుద్ధంలో మంచి కార్యకర్తగా, సైనికురాలిగా నా కర్తవ్యాన్ని నిర్వహించాలని అనుకుంటున్నాను. అలా చేయడం ద్వారా మాత్రమే ఈ దేశంలోని కోట్లాది మంది ప్రజల విముక్తి సాధ్యమవుతుంది. అంతే కాదు, తల్లి, తండ్రి లేని నాలాంటి వారెందరో స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో బతుకగలుగుతారు. ఎటువంటి బాధలు, కష్టాలు లేని సమసమాజాన్ని నిర్మించగల్గుతారు. ✲



డీ.ఎ.కే.ఎమ్.ఎస్ (దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘ్ )ఇచ్చిన భూమిని సాగు చేసుకుంటున్న ఆదివాసీ మహిళా రైతు

# 2.

నాపేరు ఉంగి, వయస్సు 18. చత్తీస్‌గఢ్ రాష్ట్రం, దంతెవాడ జిల్లా, గీదం టౌన్‌కి దగ్గరలో ఉన్న గ్రామంలో ఉండేది మా కుటుంబం. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు మావి. ఒక్కో రోజు పని దొరకకపోతే పస్తులుండేవాళ్ళం. వయస్సు పెరిగినా దాన్ని లెక్క చేయకుండా తాతయ్య (నాన్న తండ్రి)కూడా కూలీకి పోయేవాడు. మా అమ్మ దగ్గర పాలు లేక నేనెప్పుడూ ఏడ్చేదాన్ని. అలాంటి సమయంలో కూడా నన్ను అంగన్‌వాడీ దగ్గర వదిలేసి, కూలీ పనికి పోయేది అమ్మ. అప్పటికే అమ్మ రక్తహీనతతో బాధపడుతుండేది. దానికి కారణం తిండి సరిగా లేకపోవడం, నిరంతరం పని చేయడం. ఎప్పుడు ఏడ్చే నన్ను చూసి చనిపోతుందేమోనని బయపడేవారట మా కుటుంబ సభ్యులు. "భూమి ఉంటే కష్టపడి పంట పండించుకునేవాళ్ళం. భూమి లేకపోవడంతో ఎన్నాళ్ళు ఇలా కూలీ చేసి బతకడం? వేరే ఊరికి వెళ్ళి పోదామని" అమ్మ, నాన్న నిర్ణయించుకున్నారు. వారి నిర్ణయానికనుగుణంగానే బీజాపూర్ జిల్లా (భైరన్‌గడ్ ఏరియా) సురకడకు మారింది మా కుటుంబం. అక్కడ పెద్దాల్ (గ్రామ పెద్దలు) వాళ్ళను కలిసాడు మా నాన్న, కానీ లాభం లేకపోయింది. భూమి ఇవ్వాలంటే ఆ ఊరి పెద్దాల్ వాళ్ళకు మేకలు, కోళ్ళు, కల్లు ఇవ్వాలనే షరతు. కాబట్టి, మాకు అలాంటివి లేకపోవడంతో భూమి ఇవ్వలేదు ఆ ఊరిపెద్దలు. అక్కడున్నన్ని రోజులు (ఒక సంవత్సరం)కూలీ పనికే పరిమితమయ్యాం. అక్కడ కూడా బతకడం కష్టమవ్వడంతో అదే ఏరియాలోని కేశూర్‌కి బదిలి అయ్యాం. అప్పుడు నాకు మూడు సంవత్సరాలు. నాకు ఏమి గుర్తు లేదు. అమ్మ నాన్నల సమస్య మాత్రం తీరలేదు. అప్పటికే పార్టీ ప్రభావం వున్న గ్రామం కేశూర్. కొత్తగా వచ్చాం కాబట్టి, సంఘ నాయకులు మా గురించి తెలుసుకొని ఆ ఊరిలో ఆశ్రయమిచ్చారు. రోజులు గడిచిపోతున్నాయి. అప్పుడే 3 సంవత్సరాలు అయ్యింది ఆ ఊరొచ్చి. మా ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకున్న సంఘంవాళ్ళు పార్టీతో చర్చించి, మా బతుకుదెరువు కోసం ఐదు ఎకరాల భూమిని ఇచ్చారు. వ్యవసాయానికి అవసరమైన ఎడ్లు, నాగళ్ళు లేకపోవడంతో నాన్న ఎప్పటిలాగే కూలీ పనులు చేస్తున్నాడు. నాన్న సంపాదించే కూలీ డబ్బులు తిండికి తప్ప మరో దానికి చాలేవి కావు. ఆ క్రమంలో అమ్మ ఆరోగ్యం నయం చేయడానికి నాన్న అవసరమైన డబ్బు కూడగట్టలేకపోయాడు. నా

తర్వాత చెల్లికి రెండు సంవత్సరాలు. తమ్ముడు పుట్టి ఆరు నెలలు గడిచింది. అమ్మ నుండి పాలు మాత్రం అంతంత మాత్రమే. వాడి ఏడుపుకు అంతే లేదు. సరిగ్గా నాకు ఆరు సంవత్సరాలు ఉంటాయనుకుంటా. తెలివి తేటలు వస్తున్న సమయం. పై విషయాలన్ని నేను పెద్దాయ్యాక నాన్న, నాన్నమ్మ మాటల ద్వారా అర్థమయ్యేవి.

అమ్మకు అనారోగ్యం తగ్గాలని పూజలు చేసేవాళ్ళం. గ్రామ పూజారి దగ్గరకు కూడా తీసుకెళ్ళేవాడు నాన్న. అమ్మకు అనారోగ్యం తగ్గి తమ్ముడు ఏడుపు మానితే పూజారికి మరింత ఎక్కువ కల్లు, దానితో పాటు కోళ్ళు ఇస్తానని మొక్కుకునేవాడు. పూజారి కూడా అమ్మ బతుకుతుందనీ, రోగం తగ్గుతుందని చెప్పేవాడు. కళ్ళ ముందు అమ్మ నిరంతరం అనారోగ్యంతో బాధపడుతుండేది. అమ్మను చూస్తూ నేను ఏడ్చేదాన్ని. ఏడవడం తప్ప ఇంకేమి తెలియని వయసు నాది. అప్పటికే నాన్న పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజాసంఘాలలో పని చేయడం ప్రారంభించాడు. నాన్న ఉదయాన్నే వంట పని చేసి కూలీకి పోయేవాడు. అయినప్పటికీ, మిగతా ఇంటి పనులు నాపై పడ్డాయి. ఇంటి పని చేస్తునే తమ్ముడిని సముదాయించేదాన్ని. ఇలా రోజులు గడుస్తున్న కొద్ది అమ్మ అనారోగ్యం బాగా విషమించింది. వారం రోజుల పాటు శ్వాస సరిగా ఆడక ఇబ్బంది పడింది. మరోసారి పూజారికి చూపించాడు నాన్న. తగ్గకపోగ బాధపడుతూనే ఒక రోజు కన్ను మూసింది. అమ్మ చనిపోయిన 15 రోజుల తర్వాత దినకర్మ ముగిసాక తమ్ముడిని నేను సరిగా చూసుకోలేనని మా నాన్నమ్మ (చిన్నాన్న దగ్గర వుండేది) తీసుకెళ్ళింది. అప్పటికే వాడు పాలు లేక ఏడుస్తూ అనారోగ్యంగా వుండేవాడు. దాంతో నాన్నమ్మతో వుంటున్న క్రమంలో మలేరియా బారిన పడటం, అమ్మ చనిపోయి సంవత్సరం తిరగక ముందే తమ్ముడు చనిపోయాడనే వార్త మమ్మల్ని చేరింది. నాన్న, నేను, చెల్లి మా సొంతూరుకు వెళ్ళాం. తమ్ముడు అంత్యక్రియలు ముగిసాక బంధువులు, ఊరివాళ్ళు నాన్నమ్మని మా వెంట తీసుకెళ్ళమని చెప్పారు. కానీ అందుకు నాన్నమ్మ ఒప్పుకోలేదు. అప్పటికే మేమున్న కేశూర్‌కి పార్టీనీ, పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంఘాలను దెబ్బతీయడం కోసం పోలీసుల కూంబింగ్‌లు కొనసాగుతుండేవి. తను మా వెంట రావడానికి ఒప్పుకోలేదు. "తల్లిలేని పిల్లలకు తోడుగా వుంటావు వెళ్ళు" అని చాలా మంది చెప్పారు నాన్నమ్మకి. "మీతో వుంటే నేను చనిపోతా. ఎప్పుడు పోలీసుల బూట్ల చప్పుడు, నిత్యం ఎవరినో ఒకరిని చంపడం. ఇవన్నీ చూడటం నావల్ల కాదు. మీరే ఇక్కడుండండి" అంది. అందుకు నాన్న ఒప్పుకోలేదు. తిరిగి కేశూర్‌కి వెళ్ళిపోయాం.

అమ్మ మరణం తర్వాత నాపై పనుల బారం మరింత పెరిగింది. వడ్లను దంచి అన్నం వండాలి. ఆ విధంగా చేయడం అసలే రాదు నాకు. అమ్మ ఉన్నప్పుడు నాకు దంచడం రాదని నాన్నతో మిల్లు పట్టించుకు రమ్మనేది. కాలినడకనే వెళ్ళి నాన్న నెలకోసారి పట్టించుకొచ్చేవాడు. ఆ విధంగా మిల్లుకు పట్టించినవి వండటం ఎలాగోలా కష్టపడతా. కానీ వడ్లను దంచి వండటం ఎలా? ఈ విషయాన్ని నాన్నతో ఎలా చెప్పాలన్న ప్రశ్న? చివరకు పక్కవాళ్ళనడిగా. ఇలా ఒక వారం రోజులు పక్కవాళ్ళ సహకారంతో గడిచిపోయింది. తరువాత రోజు నాకు చెల్లికి దంచడం తప్పలేదు. తను రోకలిని పైన, నేను కింద పట్టుకొని దంచడం ప్రారంభించాం. ఎంత దంచిన వడ్లు పొట్టు వదలడం లేదు. చుట్టుపక్కల ఇళ్ళలో అమ్మ వయస్సు గల వాళ్ళందరూ దంచుతున్నారు. వాళ్ళను చూస్తే అమ్మ గుర్తొచ్చేది. అమ్మ ఉంటే మాకు ఈ పని తప్పేది. పనులన్నీ అమ్మే చేసిపెట్టేది. ఎందుకు చనిపోయిందో అని ఏడుస్తూ కూర్చుండిపోయాం. అప్పటికే చీకటి పడింది. సంఘం పనులు ముగించుకొని ఇంటికొచ్చిన నాన్న ఏడుస్తున్న మమ్మల్ని ఓదార్చి "ఈ పనులు మిమ్మల్ని ఎవరు చేయమన్నారు? నేను వచ్చాక చేసిపెడతాగా. ఇంకెప్పుడు ఇలాంటి పనులు చేయకండి. పెద్ద పెద్ద పనులకు మీ శక్తి సరిపోదు" అని మాకు ధైర్యం చెప్పి వడ్లను దంచి, అన్నం వండి పడుకున్న మమ్మల్ని లేపి తినిపించాడు. నాకప్పుడు అనిపించింది, నాన్న ఎప్పుడూ ఇంటిదగ్గరే వుంటే బాగుండేదని.

ఊరివాళ్ళందరూ మాములుగానే మమ్మల్ని చూసి బాధపడేవారు. ఎవరు ఇంటికొచ్చినా నాన్నను మళ్ళీ పెళ్ళి చేసుకోమని సలహాలిచ్చేవారు. నాన్న పట్టించుకునేవాడు కాదు. ఒక రోజు ఏకంగా 7, 8 మంది వచ్చారు. "నీవు ఎప్పుడూ ఇంటి పట్టున ఉండవు కదా! ఇలా అయితే ఉన్న ఈ ఇద్దరి పిల్లలు కూడా సచ్చిపోతరు. మా మాట విను, మేము మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేస్తాం. నీకు తోడుగా, ఈ పిల్లలకు తల్లిగా వుంటూ, ఇంటి పని చేసుకుంటూ ఉ ంటుంది" అని బలవంతంగా నాన్నను పెళ్ళికి ఒప్పించారు. మా ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం అమ్మాయి వాళ్ళు కల్లు తెచ్చారు. నాన్న తరపున కల్లు పుచ్చుకున్నారు పెద్దమనుషులు. అప్పటి నుండి నాన్న ఏదో ఆలోచనా ధోరణిలో వున్నాడు. పార్టీ వాళ్ళు ఏం చెప్పారో నాన్న ఏం ఆలోచించాడో తెలియదు. కానీ కొద్ది రోజుల్లోనే "నేను పెళ్ళి చేసుకోను" అని చెప్పేసాడు పెద్దమనుషులకి. "నీకేమైనా పిచ్చా, మేము మాటిచ్చాం. కల్లు కూడా తాగం. ఇప్పుడెందుకు ఇలా మాట్లాడుతున్నావ్? అయినా నీ కుటుంబం బాగు కోరేకదా మేము నీ పెళ్ళి గురించి ఆలోచించి కుదిర్చాం" అన్నారు. "వచ్చిన భార్య నా పిల్లల్ని బాగా చూసుకుంటుందన్న హామి

ఏమిటి? నాకు ఆ నమ్మకం లేదు.  నా పిల్లల్ని అన్ని నేనే అయి చూసుకుంటా. నాకు మరో పెళ్ళి అవసరం లేదు" అని గట్టిగానే చెప్పాడు వారికి. "నీ ఇష్టం నాయనా నీకు చెప్పడం మా వల్ల కాదంటూ" కోపంతో వెళ్లిపోయారు పెద్దలు.

అప్పటికీ మాకు 6 గొడ్లు, 15 మేకలు వుండేవి. వాటిని మేపడానికి వెళ్ళేదాన్ని నేను. పొలం దగ్గర నాన్న వడ్లు పండించేవాడు. వర్షాకాలం మాత్రమే పొలం పని. కాబట్టి పని వున్నప్పుడు నేను పొలం పనుల్లో నాన్నతో పాటు పని చేసేదాన్ని. పార్టీ ప్రభావిత గ్రామం కావడంతో అన్ని సంఘాలు చురుగ్గా పని చేసేవి. ఈ క్రమంలో మిలీషియాలో నాన్న చురుగ్గా పని చేయడం పెరిగింది. అలా పని చేస్తూనే, కమాండర్ స్థాయికి ఎదిగాడు నాన్న. నాన్న వెనకాల చాలా మంది మిలీషియా కామ్రేడ్స్ వచ్చేవాళ్ళు. నేను పని చేస్తుంటే వాళ్ళు నన్ను పక్కకు నెట్టి ఆ పనిని చేసేవాళ్ళు. వాళ్ళు మా ఇంటికి రావడంతో మా ఇంట్లో పండుగ వాతావరణం నెలకొనేది. నన్ను చెల్లిని బాగా చూసుకునేవాళ్ళు. ఏ సమయంలో ఇంటికొచ్చినా ఇంటి పనులు చేయడంతో పాటు, నాకు చెల్లికి స్నానం చేయించి బట్టలుతికేవాళ్ళు. వాళ్ళొస్తే చాలు నాకు ఎంతో ధైర్యం. చెప్పలేని సంతోషం. నాన్న కమాండర్ కాబట్టి, ఇంటి పనుల్లో పాల్గొనడం చాలా తగ్గిపోయింది. కాని నాన్నతో పని చేసే సహచర కామ్రేడ్స్ మాత్రం రోజు తప్పి రోజు ఇంటికొచ్చి మా బాగోగులు చూసేవాళ్ళు. వీరు నిత్యం ఇంటికొచ్చి మా బాగోగులు చూడటం, ఇంటి పనులు చేసి పెట్టడం వంటివి నాకు మేం ఒంటరివాళ్ళం అనే ఆలోచనను దూరం చేసాయి.

మా ఊరిలో ప్రతి నెలకు దళం మీటింగ్ జరిగేది. ఆ మీటింగ్‌కి కావాల్సిన ఏర్పాట్లన్ని నాన్నే చూసేవాడు. ఆరోజు ఏ రాత్రికో ఇంటికొస్తాడు నాన్న. మీటింగ్ సమయంలో సి.ఎన్.ఎమ్. (చేతన్ నాట్య మంచ్)వాళ్ళు పాటలు పాడటం విని నేను ఉత్సాహంతో పరుగెత్తుకొని వెళ్ళేదాన్ని. దళ కామ్రేడ్స్ నన్ను చూసి "నీవు బాలల సంఘంలో పని చేయొచ్చు కదా" అని అనేవాళ్ళు. మా నాన్న పూర్తిగా మిలీషియాలో పని చేస్తాడు. మరీ నేను కూడా బాలల సంఘంలో పని చేస్తే ఇల్లు, పొలం, గొడ్లు, మేకలు ఎవరు చూసుకుంటారు? అని నేనన్న మాటాలకు "అబ్బో ఇంటి పనులపై ఎంత బాధ్యతుందో" అని నవ్వుతూ తలనిమిరేవాళ్ళు. ఆ తర్వాత ఇంటికెళ్ళి ఆలోచించేదాన్ని. నాతోటి వయస్సుగల మిత్రులందరూ బాలల సంఘంలో పని చేస్తున్నారు. నేను కూడా దళం వాళ్ళన్నట్లుగా బాలల సంఘంలో పని చేస్తే బాగుండేది అని ఆలోచించేదాన్ని. కానీ మరీ 15 మేకల పరిస్థితి ఏంటి? గొడ్లు ఏమై పోవాలి? వాటిని రోజు మేపేది నేనేకదా!

అని వాటి గురించి ఆలోచించేదాన్ని. నాన్న పూర్తిగా చేస్తున్నాడు కదా సరిపోతుందిలే అని నాకు నేనే సమాధానం చెప్పుకునేదాన్ని. కానీ మళ్ళీ వాళ్ళొచ్చి(దళం వాళ్ళు) మీటింగ్ చేస్తుంటే, సి.ఎన్.ఎమ్ పాటలు వింటుంటే వెళ్ళి చూడటమే కాక చాలా సంతోషంగా వారి పాటలను ఆస్వాదించేదాన్ని. వారి పాటలు వింటుంటే నాక్కూడా వాళ్ళలా సి.ఎన్.ఎమ్. డ్రస్ వేసుకుని పాటలు పాడాలనిపించేది. దళ కామ్రేడ్స్ కనబడగానే నేను కూడా ఆ డ్రస్సు వేసుకోవాలనే ఆశలు రేకెత్తేవి. మీటింగ్ ముగిసాక ఇంటికెల్లగానే నాకు ముందుగా ఎదురొచ్చే మేకలు, గొడ్లు చూసి నేను దళంకి వెళ్తే ఇవి ఏమై పోవాలి? అని నా ప్రేమంతా ఒక్కసారిగా వాటివైపు మళ్ళేది.

2005 సల్వాజుడుం ప్రారంభదశ. బీజాపూర్, సుక్మా, దంతెవాడ జిల్లాల్లో ప్రజలను రమణసింగ్ సర్కార్ సల్వాజుడుం పేరుతో అన్ని విధాలా నష్టపరుస్తున్న రోజులవి. కోళ్ళు, మేకలు, గొడ్లు, పందులు, కుక్కలు, ప్రజలు ఎండబెట్టుకున్న మంసాహార ముక్కలను సైతం వదలకుండా ఇండ్లలోకి చొరబడి తినే వస్తువులన్నింటిని తిన్నంత తిని, దోచుకుని, ఎన్నో ఇండ్లను ధ్వంసం చేసారు పోలీసులు. నిత్యం మా గ్రామమే కాకుండా చుట్టుపక్కల గ్రామాలన్నీ కూడా పోలీసు పహరాలో కాలం గడిపాయి. వారి చేతికి దొరికిన వారిని పట్టుకొని ఒక్కొక్కరిని ఒక్కో విధంగా హింసించి చంపడం అనేది వారికి సాధారణమైపోయింది. కన్న తల్లిదండ్రుల ముందే కూతురిని అత్యాచారం చేయడం, భార్యా పిల్లల ముందే భర్తను కళ్ళు పీకేసి తుపాకీ బట్టులతో కొట్టడం, మరి కొందరిని ముక్కు, చెవులు కోసి కారం చల్లి చిత్రహింసలకు గురిచేసి చంపడం మొదలైన రూపాల్లో మా అమాయక ఆదివాసీ ప్రజల ప్రాణాలను బలిగొన్నారు. మహిళల వయస్సుతో సంబంధం లేకుండా అత్యాచారం చేసి వారిని చంపేసేవారు. పోలీసులు ఊర్లోకి ప్రవేశిస్తున్నరనగానే సంఘం, మిలీషియా వాళ్ళు కాషన్ ఇచ్చేవాళ్ళు. ఆ కాషన్‌తో ఊర్లో ఉన్న వాళ్ళందరం ఆ సమయానికి చేతికి దొరికిన వస్తువులను చేతనైనన్ని పట్టుకొని అడవికి పోరిపోయేవాళ్ళం. చేతగాని ముసలివాళ్ళు, చిన్న పిల్లలు ఊర్లోనే ఉండేవాళ్ళు. వాళ్ళను కూడా వదిలేవారు కాదు ఆ నరహంతకులు. ఒక రోజు సంతకెళ్ళి సాయంత్రం నాతోటి మిత్రులతో ఊరొచ్చేసా. కొద్ది సేపటికే మా వెనకాల వచ్చే మరో గుంపులోని మహిళలను దారిలో వున్న పోలీసులు అత్యాచారం చేసి, వారితో వున్న పురుషులను బట్టలు విప్పేసి కొట్టారు. ఈ వార్త నేను ఇంట్లో కాలు మోపానో లేదో ఆయా కుటుంబాల వాళ్ళు చెబుతూ ఏడుస్తున్నారు. ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నాం, మేం క్షణాల్లో తప్పించుకున్నామని. కానీ

జరిగిన అన్యాయం ఎవరికైతేనేమి! చాలా బాధపడ్డాను, ఏడ్చాను. ఇలాంటి విషయాలు ఇంకా ఎన్ని వినాల్సివస్తుందో ననిపించింది. అప్పటినుండి సంతకెల్లాలంటే భయం వెంటాడేది. వెళ్ళక తప్పేది కాదు. నాన్నేమో ఆ సమయంలో అసలు ఇంటికొచ్చేవాడే కాదు. అంబుష్‌లు వుండటం, పోలీసుల కదలికలు పసిగట్టి వారిపైకి ఎదురుదాడి చేయడం, పోలీసుల దాడులకు బయపడుతున్న ప్రజలకు మీటింగ్‌లు చేసి, ధైర్యం చెప్పడం వంటి వాటిపైనే నాన్న, తన సహచర కామ్రేడ్స్ ద్యాసంతా. కానీ వారి (పోలీసు)బలం ముందు వీరి బలం సరిపోయేది కాదు. ఇక అన్ని ఊర్లల్లో పార్టీ సంఘం, మిలీషియా నాయకులను అరెస్టులు, సరెండర్లు చేయించుకుంటున్నారు. అలా లొంగని వారిని ప్రజలందరూ చూస్తుండగానే కళ్ళు పీకేయడం, కాళ్ళు, చేతులు నరికేయడం, వారిపై కాల్పులు జరపడం వంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఊరి పెద్దాల్‌లు పూర్తిగా వారి కనుసన్నల్లోనే ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, ఎంతో మంది అమాయక జనాన్ని వారివైపు తిప్పుకున్నారు. అప్పటి వరకు కలిసి మెలసి వున్న ఇరుగు పొరుగు వాళ్ళే శతృవులయ్యారు. ఇవన్నీ చూస్తుంటే నాన్నకేమవుతుందోనని భయమేసింది. అమ్మను పోగొట్టుకొని ఎన్నో బాధలు పడ్డాం. ఇప్పుడు నాన్నకేమైనా జరిగితే నేను చెల్లి మా పరిస్థితి ఏమిటి? ఈ ఆలోచనల్లోంచి దుఃఖం తన్నుకొచ్చింది. జరిగే విధ్వంసాలను చూడటం తప్ప ఏమి చేయలేని పరిస్థితి. నాన్నని పోలీసులు ఏం చేస్తారో అనే దిగులు ఒకవైతే, మరోవైపు చెల్లి గురించి ఆలోచన. తను నాలా పరుగెత్తడం కష్టం. చాలాసార్లు పోలీసులు వస్తున్నారన్న కాషన్ రాగానే ముందుగానే చెల్లిని కొండపై దింపేసి వచ్చి నేను బియ్యం, చింతపండు తీసుకెళ్ళేదాన్ని. వాటిని పక్కవాళ్ళు వండేటప్పుడు మావి కూడా కలిపి వండిచ్చేవాళ్ళు. నాన్న గురించి నేనూహించినట్లుగానే ఒక రోజు నేను అన్నం వండుతున్న సమయానికి నాన్న (ఉదయం) ఇంటికొచ్చాడు. అంతలోనే పోలీసులు ఎప్పుడొచ్చారో మేం పసిగట్టలేకపోయాం. ఇంట్లోకి దూసుకొని పోయి నాన్నని ఎంతగా కొట్టారో మాటల్లో చెప్పలేను. ఒక మూలన కూర్చొండిపోయా. 50 మందికి ఎక్కువగానే ఉంటారేమో. కొందరు ఇంట్లోకి దూసుకెళ్ళగా మరికొందరు ఇంటి చుట్టుపక్కల ఉన్నారు. వాళ్ళు తిడుతున్న తిట్లు అర్థం కాలేదు. కానీ ఒక విషయం మాత్రం అర్థమైంది. నాన్నని పార్టీలో పని చేయడం మానుకోవాలనీ, సరెండర్ అవ్వమని అంటున్నారనీ. అందుకు నాన్న ఒప్పుకోలేదు. మరింత చితగొట్టారు, చంపేస్తారేమనుకున్నా. ఏడుపు శబ్ధాన్ని బయటకు రానియ్యకుండా నోటిని చేత్తో గట్టిగా మూసుకున్నా. కసిదీరా నాన్నని కొట్టి వెళ్ళిపోయారు. వెంటనే నాన్న దగ్గరకు పరుగెత్తా. పట్టుకొని బాగా ఏడ్చా. "ఏడవద్దు, ఏడుపు పిరికితనం"

అన్నాడు. “నాకేం కాదు పార్టీ వుండగా, పార్టీ మనకోసం ప్రజలకోసం పని చేస్తుంది. అవసరమైతే ప్రాణమిద్దాం” అంటూ గోడకు వేలాడుతున్న విల్లును తీసుకుని వెళ్ళిపోయాడు. నాకేం అర్థం కాలేదు. కానీ అంత దెబ్బలతో కూడా నాతో గట్టిగా మాట్లాడి విల్లు తీసుకుని పోవడం మాత్రం ధైర్యానిచ్చింది.

పై సమస్యలన్నీ రెండు సంవత్సరాల పాటు నిత్యకృత్య మయ్యాయి. అప్పటికీ ఎంతో మంది సంఘ నాయకత్వం సరెండర్లు అయ్యారు. వారిచ్చిన సమాచారంతోనే 2006 చివరలో నాన్నని పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్ళారు. బందీగా పెట్టిన ఆ క్యాంపులో దొడ్డికి తీసుకెళ్ళేటప్పుడు, తినడానికి వెళ్ళేటప్పుడు ప్రతిసారి కొట్టాకే తీసుకెళ్ళేవారట. నాన్న అరెస్ట్ నన్ను చెల్లిని మరింత వేదనకు గురి చేసింది. ఆ సమయంలో నాన్నకి సన్నిహితంగా వుండే ఒక కుటుంబం మమ్మల్ని చేరదీసింది. వాళ్ళతోనే ఉండేవాళ్ళం. నాన్నను చూడటానికి ఊరివాళ్ళతో నేను చెల్లి వెళ్ళేవాళ్ళం. నాన్నను చూడగానే నేను చెల్లి ఏడ్చేవాళ్ళం. మాకు ధైర్యం చెబుతూనే మా బాగోగులడిగి కన్నీరు పెట్టుకునేవాడు నాన్న. ఆ చుట్టుపక్కల మొత్తం పోలీసులే. వీళ్ళందరూ నాన్నని రోజు కొడతారేమో అని మనసులో అనుకుంటూనే ఇంత మంది పోలీసుల మధ్య ఎలా ఉన్నావ్ నాన్న! అని అడిగేదాన్ని. నా ప్రశ్నలకి నాన్న చిన్నగా నవ్వేవాడు.

5 నెలల తర్వాత నాన్న జైలు నుండి పారిపోయి వచ్చాడు. ఆ వెంటనే ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో మళ్ళీ అరెస్ట్ చేశారు. ఈసారి 2 సంవత్సరాలు జైలులోనే వున్నాడు. మేము సంతకెళ్ళే ఊరిలోనే క్యాంపు వుండేది. ఆ క్యాంపులోనే నాన్నని బంధించింది. సంతకెళ్ళే ప్రతిసారి నాన్నని కలిసేవాళ్ళం. కలిసినప్పుడల్లా ఏడ్చేవాళ్ళం. నాకన్నా చెల్లి ఏడుపు ఎక్కువైంది. అమ్మ గుర్తొచ్చేది. అమ్మేమో మాకు పూర్తిగా దూరమైంది. వున్న నాన్నను పోలీసులు దూరం చేసారు. మేమెందుకు బతకడం అనిపించేది. యధావిధిగా గొడ్ల కాపుకెళ్ళేదాన్ని. నాన్నలేని పొలాన్ని చూస్తే దుఃఖమొచ్చేది. 24 నెలలు నాన్న పోలీసు క్యాంపులో, మేము తెలిసిన వాళ్ళ ఇంట్లో. ఆ రోజులన్నీ దిన దిన గండంగా గడిచిపోయాయి.

2009లో నాన్న విడుదలై ఇంటికొచ్చాడు. శత్రు నిర్బంధాన్ని చవి చూసినప్పటికీ, నాన్నలో పార్టీపై, ప్రజలపై ప్రేమ ఏ మాత్రం తగ్గలేదు. సంఘంలో, శత్రువుపై కసితో మరింత చురుగ్గా పని చేయసాగాడు. అనుకోకుండా ఒక రోజు ఊరి పెద్దాల్‌లను వెంటపెట్టుకొని కొందరు పోలీసులు మా ఇంటికొచ్చారు. నాన్నని అరెస్టు చేస్తారేమోనని భయం వేసింది. కానీ వాళ్ళు మాతో చాలా సామరస్యంగా మాట్లాడటం ప్రారంభించారు. “మీ పొలం మేము తీసుకుంటున్నాం.

క్యాంపు అవసరాల రీత్యా అవసరం వుంది” అని పెద్దాల్‌లతో మాట్లాడించారు. ఒక్కసారిగా ఆ మాటలు విన్న నేను, మా నాన్న కుప్పకూలిపోయాం. గుండెలవిసేలా ఏడ్చాం. పొట్టగడవక ఈ ఊరొచ్చినప్పుడు పుట్టెడు కష్టాల్లో వున్న మాకు పార్టీ ఆ 5 ఎకరాల భూమి ఇచ్చి మమ్మల్ని ఆదుకుంది. భూమి ఇచ్చాక మేము బియ్యం కొన్నది లేదు. దాంట్లో పండిన (వడ్లు) పంటనే మా తిండి, ఆ ధాన్యానికి(అన్నం)తోడు అడవి నుండి లభించే ఆకుకూరలు, దుంపలు అన్నానికి తోడుగా వండుకుంటాం. అలా పూర్తిగా గతం గుర్తొచ్చింది. కాని ఏంచేస్తాం. వాళ్ళను బెదిరించే ధైర్యం మాకు లేదు. దోపిడీ సర్కారుపై, అది మేపే కాపలా కుక్కలపై మరింత కసి పెరిగింది నాకు నాన్నకు. మా పొలంలో ఏదో నిర్మాణం జరుగుతుందని ఊరివాళ్ళు చూసి మాతో అన్నారు. నాన్న నేను కలిసి మా పొలానికి వెళ్ళాం. అప్పటికే మా ఊర్లో పోలీసుక్యాంపు నిర్మాణం పూర్తి చేశారు. క్యాంపుకు దగ్గరలో వున్న మా పొలంలో ఆశ్రమ పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభించారు. అది పూర్తికాగా మా భూమి ఇంకా మిగిలి ఉంది. చేసేదేంలేక మిగిలిన భూమిని చదును చేసుకుని పండించుకోవడం ప్రారంభించాం. యధావిధిగా పొలం పనులు నేను నాన్న కలిసి చేసుకోనారంభించాం. ఈ క్రమంలో ఓ రోజు చిన్నాన్న (తను కొంత చదువున్న వ్యక్తి. ఊరిలో స్కూల్ చెబుతుంటాడు) వచ్చాడు. “చిన్నమ్మాయిని నా వెంట తీసుకెళ్ళి చదివిస్తా, లోకజ్ఞానం తెలుసుకుంటుంది. పెద్దయాక తన కాళ్ళ మీద తను నిలబడుతుంది” అన్నాడు. నాకు నాన్నకు సరైందేననిపించింది. చదువుకొని ప్రయోజకురాలైతే మాలాంటి ప్రజలకు సహాయపడుతుందని. అందుకు నేను నాన్న సరేనన్నాము. కాని చెల్లి వెళ్ళాక మరచిపోవడానికి కొంత సమయమే పట్టింది. పార్టీ పనులుంటే నాన్న 2,3 రోజుల వరకు ఇంటికే రాడు. వచ్చినా ఏ రాత్రికి వచ్చి ఎప్పుడెళతాడో తెలియదు. చెల్లి వుంటే ఇద్దరం కలిసుండేవాళ్ళం. పనుల్లో కూడా కొంత నాకు సహకరించేది. అలా తన జ్ఞాపకాలు వెంటాడేవి. చెల్లి వెళ్ళిపోవడం ఒకటైతే నాన్న గతం కన్నా ఎక్కువగా పార్టీ పనుల్లో లీనమయ్యాడు. తన సహచర కామ్రేడ్స్ మాత్రం వచ్చిపోతున్నారు. పార్టీలో పని చేస్తున్న నాన్నను చూస్తే నాక్కూడా పార్టీలో పని చేయాలనే ఆసక్తి పెరిగింది. నాన్న పని గురించి సహచర కామ్రేడ్స్ చెప్పడం నాకు మరింత ఉత్సాహానిచ్చేది. ఎలాగైనా నాన్నతో చెప్పాలనుకున్నా నా మనసులో మాట. పార్టీ పనులు ముగించుకొని ఇంటికొచ్చిన నాన్నను ధైర్యంగానే ‘నాన్న నేను కూడా పార్టీలో పని చేస్తా’ అని అడిగా. అందుకు నాన్న సంతోషంగా అంగీకరించాడు.

దాంతో 2014లో నేను మిలీషియాలో సభ్యురాలినయ్యాను. అప్పుడర్థమైంది నాకు నాన్న

ఆర్.పి.సి(రెవల్యూషనరీ పీపుల్స్ కమిటీ)అధ్యక్షుడని. మిలీషియాలో పని చేస్తునే ఇంటి పని, పొలంపని చేసేదాన్ని. దళం గ్రామానికి ప్రవేశించగానే వారికి కావాల్సిన అవసరాలు తీర్చడంలో భాగమయ్యేదాన్ని. సెంట్రీలు చేసేదాన్ని. పార్టీ నిర్వహించే కార్యక్రమాలన్నింటిలో నాన్నతో పాటు పాల్గొనేదాన్ని.

నాకు ఊహ తెలిసినప్పటి నుండి మేము భూమి సమస్య, వలస పోవడం, పెద్దాళ్ళ బెదిరింపులు, అనారోగ్య మరణాలు మొదలైన సమస్యలతో సతమతమవుతూ వచ్చాం. ఈ బతుకుల గురించి ఆలోచించే అమ్మ అనారోగ్యం పాలై మరణించింది. ఇవన్నీ ఒక ఎత్తైతే సల్వాజుడుం మరొక ఎత్తు. సల్వాజుడుం బాధలు ఒక రోజు కాదు, ఒక నెల కాదు. ఏకంగా రెండు సంవత్సరాలు. అనునిత్యం మృత్యువుతో బతుకులెల్లదీసాం. ఇంకెన్నాళ్ళు ఈ బతుకు? రాజ్యానికి భయపడుతూ బతకడం అని గతంలో నాన్న అన్న మాటలు గుర్తొచ్చాయి. తిరగబడాలి, పోరాడాలి అనే కసి నాలో క్రమ క్రమంగా రగులుకున్నది. మొదట్లో దళం చెప్పే లూటీ సర్కార్ గురించి అర్థమయ్యేది కాదు, కానీ క్రమంగా అర్థం అయింది. సమస్యలన్నింటికి కారణం లూటీ సర్కారే. మరి నేనేం చేయగలను? మిలీషియాలో పని చేస్తే సరిపోతుందా? చాలదు అంతకన్నా ఉన్నతమైనది పూర్తికాల కార్యకర్తగా అజ్ఞాతంలోకి వెళ్ళడం, తుపాకీ పట్టడమే. అయితే ఇది ఎలా సాధ్యం? నేను చేయగలనా లేదా? అని చాలా రోజులు ఆలోచించాను. ఒక రోజు ఈ విషయాన్ని నాన్నతో ఎలాగైనా చెప్పాలని నిర్ణయించుకున్నా. అప్పుడే మిలీషియాలో పని చేసి సంవత్సరం గడిచిపోయింది. రిక్రూట్ సన్నాహాలు మొదలయ్యాయి. 2, 3 నెలలుగా నా మనస్సులో ఏదైతే అనుకుంటున్నానో అదే విషయాన్ని మా మిలీషియా కమాండర్ నా ముందుంచాడు. సంతోషంగా ఒప్పుకున్న. రెండో మాట చెప్పలేదు. విషయాన్ని నాన్నతో చర్చించాడు మా కమాండర్, నాన్న బాధపడ్డాడు. “చిన్నప్పటినుండి నాకు ప్రతి పనిలో, నా సుఖంలో, దుఃఖంలో పాలుపంచుకుంటూ కొండత అండగా వుండే నా బిడ్డని ఎలా మరిచిపోవాలి? తల్లి లేకపోయినా అన్ని తనై నెట్టుకొచ్చింది. సంఘం పనుల్లో పడి నేను ఇల్లు మరిచిపోయినా, ఎంత రాత్రికొచ్చినా ఏనాడు నన్ను ప్రశ్నించేది కాదు. నా బిడ్డ నాకన్నా చిన్నదైనా ఇంటికి పెద్ద దిక్కైంది. నేను రెండు సంవత్సరాలు అరెస్టయి దూరంగా వున్నా ఇంటిని, గొడ్లను కంటికి రెప్పలా కాపాడింది” అంటూ బాధపడ్డాడు, ఏడ్చాడు. “అన్నా నీ బిడ్డ ఇప్పుడు పెరిగి పెద్దదైంది. రేపైనా ఓ ఇంటికి ఇచ్చేస్తావ్‌గా! అప్పుడు కూడా నీకు దూరం అవుతుంది. కదా! మరీ నీవు ఏమి తెలియని వాడివికాదు. నీవు కూడా ప్రజలకోసం పని చేస్తున్నావ్. ఇక్కడ

పార్టీలో పని చేసేవాళ్ళందరిది ఏ రాజ్యమో తెలియదు, ఏ ప్రాంతమో తెలియదు. మనలాంటి ఎంతో మంది పేద ప్రజల కోసం మన కళ్ళముందే మన దండకారణ్యంలో ప్రాణాలిస్తున్నారు. వాళ్ళందరు కూడా తల్లిదండ్రులను వదిలి వచ్చినోళ్ళేకదన్నా! నీకన్నా ఉన్నతమైన పని నీ బిడ్డ చేయాలనుకుంటున్నది. అందుకు సంతోషంగా పంపన్నా" అని కమిటీ వాళ్ళు నాన్నని ఓదార్చారు. నాన్న బాధపడటమే కాదు, నాక్కూడా బాధగానే ఉంది. నా చిన్నప్పుడు పని చేయటానికి శక్తి సరిపోనప్పుడు నాన్న పని చేయనిచ్చేవాడు కాదు, నేనున్నానుగా అనేవాడు. అమ్మ చనిపోయాక అమ్మ పనులు చేయడమే గాక, అమ్మ ప్రేమను కూడా పంచి మమ్మల్ని పెంచాడు. ఊరోళ్ళు మా చిన్నతనాన్ని చూసి, నాన్నకు పెళ్ళి చేస్తామన్నప్పుడు వచ్చే వ్యక్తి మమ్మల్ని సరిగా చూసుకుంటుందో లేదో అనే సంశయంతో మా కోసం ఆలోచించి పెళ్ళి విరమించుకున్నాడు. చెల్లి దూరంగా ఉంది. నేను కూడా దూరమయితే నాన్న ఒంటరవుతాడు. ఈ ఆలోచనలన్నీ నన్ను కూడా చుట్టుముట్టాయి. ఒక రోజు "15 రోజులు మిలటరీ ట్రైనింగ్ వుందని" మా కమాండర్ నుండి కబురు. ఇంకేం ఆలోచించలేదు. నాన్నకి విషయం చెబుతున్నప్పుడు తను పడుతున్న ఘర్షణ నాకు అర్థమైంది. అయినా వెళ్ళడానికే నిర్ణయించుకున్నా. విజయవంతంగా ట్రైనింగ్ ముగించుకొని తిరుగు ప్రయాణం అవుతున్నాం. కమాండర్ మా బ్యాచ్‌ని పిలిచి అందులో కొందరిని ఎంపిక చేసి "వచ్చే నెల మొదటి వారంలో మీరు ఎ.ఒ.బి (ఆంధ్ర ఓడిశా బార్డర్)కి వెళ్ళి అక్కడ పని చేయాల్సి వుంటుంది. ఇది పార్టీ నిర్ణయం" అంటూ అక్కడి ఉద్యమ పరిస్థితులు వివరించి మా నుండి సెలవు తీసుకున్నాడు. ఎంపిక చేసిన వాళ్ళలో నేనొకదాన్ని. అందరం చాలా సంతోషపడ్డాం. ఆ సంతోషంలో మా సాంప్రదాయ నృత్యం డాకా వేసాం. ఆ ఆనందంతో ఇంటికెళ్ళా.

చూస్తుండగానే రోజులు క్షణాల్లా గడిచిపోయాయి. సరిగ్గా 3 రోజుల్లో నా ప్రయాణం. గంటలు గడిచిపోతున్నా, నా మనసు కుదురుగా లేదు. ఈ క్రమంలో నేను వెళ్ళేరోజు రానే వచ్చింది. నాన్న ఏం ఆలోచించాడో తెలియదు, నవ్వుతూ నా ముందుకొచ్చాడు. పొద్దుపోయే సమయం, వాకిట్లో కూర్చున్నామిద్దరం. పిల్లమేకలు అరుస్తూ, చెంగుచెంగున గెంతుతూ మా మధ్యలో నుండి అటు ఇటు పరుగెడుతున్నాయి. కోళ్ళు గూళ్ళలోకి వెలుతుంటే కోడిపిల్లలు చిన్న గొంతుతో అరుస్తూ వాటి వెనకాలే నడుస్తున్నాయి. నాన్న మాట్లాడటం ప్రారంభించాడు. "పార్టీ మన లాంటి ఎంతో మంది పేదవాళ్ళకోసం పని చేస్తున్నది. అలాంటి పార్టీలో నీవు చాలా ధైర్యంగా, చురుగ్గా పని చేయాలి. మిలటరీ పరంగా బాగా ఎదగాలి. ఏ సయమంలోనైనా

శత్రువును ఎదుర్కోవడానికి సిద్ధంగా వుండాలి. ముఖ్య విషయమేమంటే ఎప్పుడు కూడా ఊగిసలాటకు గురి కావద్దు. సమస్యలు వచ్చినప్పుడు మరింత ధైర్యంగా వాటిని తట్టుకొని ముందుకెళ్ళాలి. ఇంటికెళ్ళాలనే ఆలోచన ఎట్టి పరిస్థితుల్లో రానియకూడదు. నీ ప్రాణం వున్నంత వరకు నిన్ను నమ్మిన ప్రజల కోసం పని చేయి. ఇక నేను ఒంటరినవుతానని బాధపడకు. ఎప్పుడు ప్రజల్లో వుండే నేను ఒంటరి కాను" అంటూ తల నిమిరాడు నాన్న. నాన్న మాట్లాడిన మాటాలకు నాకు కళ్ళు చెమర్చాయి. లేచి నిటారుగా నించున్నాను. తలెత్తి నాన్నను చూస్తే ఎంతో ఉన్నతంగా కన్పించాడు. చేతులు కలిపాను. చేతి సంచి భూజాన తగిలించుకుని నాలుగడుగులు ముందుకు వేసి వెనుదిరిగాను. మా ఇల్లు, నాన్న, కోళ్ళు, మేకలు, గొడ్లు అన్నీ నా కన్నీటిలో మసక మసకగా కన్పిస్తున్నాయి. కానీ మాలాంటి వేలాది గ్రామాల్లో విప్లవ రాజకీయాలను ప్రతిష్టించాలనే నా ఆశయం స్పష్టంగా దారి చూపిస్తుండగా వడివడిగా ముందుకు నడిచాను. ✯



**విప్లవ సంస్కరణలలో భాగంగా చెరువు తవ్వుతున్న**

**కోండ్రు, ఇంజరి, రాళ్ళగడ్డ గ్రామాల ఆదివాసీ రైతాంగం**

**[పెదబయలు ఏరియా-ఏ.ఓ.బి]**

# 3

ప్రతిరోజు ఉదయం నిద్రలేవగానే కళ్ళముందు బాక్సైట్ కొండలు, ఆ పక్కనే పారే పెద్ద నీటి కాలువ, నీటి కాలువకు అందుబాటులో పంటపొలాలు, వీటన్నింటి మధ్యలో మాది ఓ చిన్న గూడెం. దాని పేరే 'ఒంద్రె' అని పిలుస్తారు. విశాఖ జిల్లాలోని, నొర్మతి పంచాయితీలో అనేక గ్రామాలలో మాదొకటి. అమ్మనాన్నలిద్దరూ వ్యవసాయంతో పాటు, కూలీ పనులు చేస్తారు. ఇంచు, మించు మా పొలం 8 ఎకరాలు ఉంటుంది. అయితే ఇది గరువు కావడంతో పంటలు సరిగా పండేవి కావు. మా తాత కష్టపడి బండరాళ్ళను తొలగించి, బీడు బారిన భూమిని సాగులోకి తెచ్చాడని నాన్న అంటుంటాడు. ఆ ఎనిమిదెకరాల భూమినే నాన్న, తన అన్నలిద్దరు ఎవరికి చేతనైనంత భూమిని, వాళ్ళు చేసుకునేవాళ్ళు. ఈ ముగ్గురన్నలకు ఓ చెల్లి. వారు సంపాదించిన దాంట్లో ఎంతో కొంత చెల్లికి సహకరిస్తేనే వీరికి తృప్తి. నాన్నకి చిన్నతనంలోనే తల్లిదండ్రులు కన్ను మూయడంతో, వాళ్ళకు వాళ్ళుగానే పని చేసుకొని, దొరికిన దాంట్లో నలుగురు సర్దుకునేవారంట. వాళ్ళు పెరిగి పెద్దాయాక "ఊరి పెద్దమనుషుల సహకారంతో, పెళ్ళిళ్ళు చేసుకొని ఓ ఇంటివాళ్ళమయ్యాం" అని ఒకానొక సందర్భంలో నాన్న చెప్పిన విషయమే.

మా అమ్మానాన్నలకు మేము మొత్తం ఆరుగురం. మమల్ని సాకడమే కాకుండా 7 గొడ్లు, 5 మేకల పోషణ కూడా చుసుకునే వాళ్ళు. నేను పుట్టగానే మా కువ్వి ఆచారం ప్రకారం పండగ చేసారంట. పుట్టిన దినం ఎలాంటిదో చూసి, పెద్ద వయస్సు గల ముసలమ్మ 'సొన్నాయి' అని నాకు పేరు పెట్టిందంట. నా చిన్నప్పుడే అమ్మనాన్న పనికి పోతే, అక్కే నన్ను చూసుకునేదంట. నాకు కొద్ది వయస్సు రాగానే, అమ్మనాన్నలతో పనికి పోయేదాన్ని. అయితే మా జీవితాలు బాక్సైట్ కొండలంత అందంగా, పారే పెద్ద నీటి కాలువంత హాయిగా సాగలే. నిరంతరం జ్వరాలు, మునుసబుల బెదిరింపులు, పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వంటి సమస్యలు వెంటాడాయి. ఇంట్లో సంఖ్య పెరగడంతో, ఆదివాసీ ఇళ్ళలో సహజంగానే దరిచేరే ఆకలి సమస్య, మా కుటుంబాన్ని కూడా రుచి చూసింది. ఇంటిల్లిపాది ఎంత కష్టపడ్డప్పటికీ, వచ్చే పైసలు దేనికి చాలేవికాదు. పండిన పంటనంతా నాన్న షావుకార్లకు అమ్మి పైసలు తెచ్చేవాడు. ఆ పైసలు మా అవసరాలను తీర్చకపోగా, వాటిని పాత అప్పులు తీర్చేందుకు ఇచ్చేవాడు. "సోళ్ళు, గొచ్చకందులు, ధాన్యం ప్రతి ఏడు వాడికే అమ్ముతున్నావ్, పంట ఎంత

బాగా పండినా పైసలు మాత్రం కనిసిస్తలేవు. మందుల పైసలనీ, విత్తనాల పైసలని తిరిగి ఆడికే ఇస్తున్నావ్. రోజు తినే కూరగాయలు కూడా పిల్లలకు ఒండిపెట్టుకోకుండా పైసల కోసం కక్కుర్తిపడి వాడికే ఇస్తున్నాం. ఎంత కష్టంజేసిన మన బతుకు ఇంతే, షావుకారిని మార్చయ్యా" అని అమ్మ బాధతో నాన్నకు చెప్పింది. "పొలంలో చూస్తే 5 కిలోల బస్తా, వాడు కొలత బెడితే మూడున్నరే తూగుతుంది. సరిగ్గా కొలవమంటే 'ఒరేయ్ ఎవడు ఒక్కమాట ఎదురు మాట్లాడరు, నన్నే తప్పుబడుతావురా' అంటూ నాగుపాములాగా బుసగొడతాడు. వీడికి కాకుండా వేరే వాడికిస్తే వాడితో కొట్లాట, అందరం కలిసి నిలదీద్దామంటే ఎవరికి దమ్ము లేకపాయే. మన మెక్కరం ఏం జెస్తం" నిస్సహాయంతో నాన్న జవాబు. ఏది ఏమైనప్పటికీ ఆదివాసీ గొంతు దాహం తీర్చే జావ (రాగులతో చేసిన అంబలి)మాత్రం ఎప్పుడు ఇంట్లో తగ్గనిచ్చేది కాదు మా అమ్మ. ఏ స్థితిలోనైనా ఒక బోర(చేయి సంచి) సోళ్ళు ఇంట్లో వుండటం పరిపాటి.

ఊరందరిపై పెత్తనం చేసే రామారావు అనే మునసబు మాకు మాత్రమే శత్రువు అనుకునే దాన్ని. కానీ కొద్ది రోజులకే తెలిసింది ఊరందరికీ శత్రువేనని. వర్షాలు పడి పంటలు ఓ కొలిక్కొచ్చాయి. ఒకరోజు అమ్మ నాన్నకి వేడి వేడి జావ పోస్తూ "ఈ ఏడు పంటలు ఏ పురుగు బారిన పడలే, కిందటి ఏటికన్న దిగుబడి ఏక్కువే వస్తాయి. మంచి షావుకారికి పంటలమ్మి, అప్పులు తీర్చి, మరో రెండు గొడ్లు కొందామయ్యా" అనడం నా వయస్సుకి సరిగా అర్థం కాలేదు కానీ, రోజు గొడ్లు కాసే అక్క కేరింత ఆగలే. నిద్ర లేచి తోటి గొడ్ల జతగాళ్ళకి చెప్పాకగానీ మనస్సు స్థిమిత పడలేదు అక్కకి. మునసబు బెదిరింపులు రోజు రోజుకి పెరిగిపోవడంతో, నాన్న ఇంట్లో నిరంతరం వాడి గురించే ఆలోచించేవాడు. గత 2 సంవత్సరాల నుండి వున్న వీడి బెదిరింపులు, ఈ ఏడు ఉధృతమయ్యాయి. కష్టపడి పండించుకునే మా పంట వాడికంటికి యావగింపుకాలే. ఎన్నోసార్లు నాన్నని ఏదో ఒంక పెట్టుకొని బెదిరించేవాడంట. ఈ సారి బెదిరింపుకు వాడు చంపుతాడేమోననీ, నాన్న ఆందోళన పడి, ఈ విషయాన్ని అమ్మతో చెప్పాడు. అమ్మ మాత్రం నాన్నకు ధైర్యం చెప్పడం నాకు గుర్తున్నది. అప్పుడు నాకు 7 సంవత్సరాలనుకుంటా. ఈ విషయాలను వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుంటే వినేదాన్ని, కాని ఏమి అర్థం కాకపోయేది. వాడు మమ్మల్ని ఏడిపిస్తున్నాడని మాత్రం అర్థం అయ్యేది. 'అక్కా! రామారావు వచ్చినప్పుడు నీవు, నేను, తమ్ముళ్ళు అందరం కలిసి కొడదామక్కా' అని తనతో అన్న మాటలను అమ్మతో చెప్పి నవ్వుకునేవాళ్ళం. రోజులు గడుస్తున్న కొద్ది రామారావు బెదిరింపులు ఎక్కువయ్యాయి. పొలం విడిచి పెట్టమని, నాన్నని నిరంతరం ఇంటిదగ్గర, పొలం దగ్గర వేదిస్తూనే ఉన్నాడు. పెద్దనాన్నలిద్దరూ మాత్రం వాడికి భయపడి పొలంకి వెళ్ళడమే మానేశారు. ఓ రోజు అందరం పొలం పనులలో లీనమైవున్నాం. ఎప్పుడొచ్చాడో తెలియదు

కానీ, కత్తితో నాన్న దగ్గరగా వెళ్ళి గొంతుపై కత్తి పెట్టాడు. అమ్మ పరుగెత్తి అడ్డంగా నిలబడింది. దూరం నుండే మేము ఏడుపు లంకించుకున్నాం. "ఒరేయ్ కొద్దిలో బతికిపోయావ్, అయినా నీ అన్నలకు లేని దురుసు నీ కెందుకురా! ఊర్లో వుంటే నీవైనా ఉండాలి, నేనైనా వుండాలి. తేల్చుకో" అని గాంభీరంగా అరిచి వెళ్ళిపోయాడు. ఆ రోజు రాత్రి అమ్మ నాన్నలకు నిద్రలేదు. తమ్ముళ్ళు, చెల్లి నిద్రపోతున్నారు. నేను, అక్క మాత్రం పడుకొని వాళ్ళు చర్చించుకునే విషయాలకు చెవులు రిక్కించి వింటున్నాం. "ఉదయం కొద్ది సేపట్లో ఆ కత్తి వేటు నీ గుండెల్లోకి దూసుకుపోయింటే? మా పరిస్థితి ఏమిటి? పిల్లలు నేను ఏమైపోయేవాళ్ళం, మాకు దిక్కెవరు? ఒద్దయ్యా! ఒక్క క్షణం కూడా ఈ ఊర్లో వుండొద్దు. బతికుంటే మరేచోటుకైనా పోయి బతకొచ్చు. ప్రాణం మీదకొచ్చాక కూడా ఇక్కడుండటం దేనికి. మేమక్కడ లేకుంటే వాడు కచ్చితంగా నిన్ను చంపేసేవాడు. ఊరోళ్ళు ఒక్కరు కూడా వాడికి ఎదురు మాట్లాడరు. వాడు ఆడిందే ఆట, పాడిందే పాట. నీవు మాటకు మాట బదులిస్తావని వాడికి నీపైన ఇంకెక్కువ కోపం. నీవేం ఆలోచించినా మనం ఎల్లిపోవడం ఖాయం" అని అమ్మ తన మనస్సులోని ఘర్షణను, కడుపులోని బాధను నాన్న ముందు కక్కేసింది. మౌనంతో వున్న నాన్న, రెండు గంటల అమ్మ వలపోతకు సమాధానం ఏమి చెప్పలేదు. వారిద్దరి మధ్య కాసేపు మౌనం. "సమయం 12 అవుతుంది పడుకో" అని అక్క నుండి ఆంక్ష జారి. వాళ్ళను చూస్తూ ఎప్పుడు పడుకున్నానో నాకు గుర్తులేదు. తెల్లవారగానే నాన్న ఊళ్ళోకి వెళ్ళి, మధ్యాహ్నానికి ఇల్లు చేరుకున్నాడు. "సామాను అంతా సర్దు, రేపే మన ప్రయాణం" అన్నాడు. అమ్మ మాత్రం ఇప్పటికైనా నాన్న నిర్ణయం మార్చుకున్నందుకు సంతోషపడింది. నాన్న మాటైతే అన్నాడు గానీ, తను పుట్టిన ఊరు, కష్టపడి పంట పండించిన భూమి, వాళ్ళ అమ్మనాన్నలు కట్టిన ఇల్లు వీటన్నింటితో సంబంధం తెంచుకోవడానికి పరిపరి విధాల ఆలోచిస్తుండు. పొద్దుపోయింది, అమ్మ మాకు తిండి పెట్టి పడుకోబెట్టింది. తెల్లారి లేచే సరికీ, అమ్మ సామానంతా సంచుల్లో మూటలు గట్టిపెట్టింది. "పొద్దుపోయే కొద్ది ఎండ పెరుగుతుంది, పిల్లలు నడవలేరు, నీవు జావ తాగితే బయల్దేరుదాం" అని అమ్మ నుండి మాటలు. నాన్నకి తన మాటలేమి పట్టలేదు, తడక దగ్గరికెళ్ళాడు. లోపలవున్న గొడ్లు, మేకలు నాన్నని చూసి, మేపడానికి తీసుకుపోతాడన్నట్లుగా అరవడం ప్రారంభించాయి. తలపై చేతితో వాటిని దువ్వుతూ, తన్నుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకొని, చిన్న మేకపిల్లలను ఎత్తుకొని ముద్దాడి చివరిసారి అన్నట్లుగా, వాటిని విడిచిపెట్టి, వెనుదిరగకుండా కదిలాడు.

పొద్దు దిగుతుండటంతో, చీకటి పడే సమయం అని నాకర్థమైంది. అరగంటలోనే చుక్కలు మాత్రమే కనబడుతున్నాయి. ఎప్పుడో బయల్దేరిన మాకు, నడిచే ఓపిక నశించింది. తమ్ముళ్ళకు,

నాకు నడిచే శక్తి లేదు. మా నడక ఆగిపోయే సరికి అందరం ఆగాం. పక్కనే పారే నీళ్ళ శబ్దం పసిగట్టిన నాన్న నీళ్ళు తీసుకొచ్చాడు. ఆకలితో వున్న మేము కడుపునిండా నీళ్ళు తాగి, నడక కొనసాగించాం. పిట్టల అరుపులు, మా నడక శబ్దం తప్ప ఇంకేమి వినబడటం లేదు. అర్ధరాత్రి 12 గం॥ సమయానికి ఒక ఊరు చేరుకున్నాం. ఓ ఇంటి ముందు ఆగగానే అలసిపోయి ఉండటంతో, క్షణంలోనే నిద్రలోకి జారుకున్నాం.

'చిన్నగొంది' ఊరు మాకు సుపరిచితమే. అది చిన్నమ్మ(అమ్మ చెల్లి) వాళ్ళ ఊరు. మేము ఉన్నది కూడా చిన్నమ్మవాళ్ళ ఇంట్లోనే. అమ్మ, నాన్న, అక్క కూలీ పనులకు వెలుతుండేవారు. ఎప్పటిలాగే నా పని తమ్ముళ్ళు, చెల్లివాళ్ళ కాపలా. అమ్మ తోబుట్టువు కాబట్టి చిన్నమ్మ బాగా చూసుకునేది. తను లేని సమయంలో వాళ్ళ అత్త, మామలు సూటిపోటి మాటలనేవాళ్ళు. ఏమనలేక ఏడ్చేవాళ్ళం. వాళ్ళు పళ్ళెంలో పెడితేనే తిండి. ధైర్యంగా పెట్టుకొని తినే అనుకూలత లేదు. చాలా సార్లు అమ్మ కూలీ పనిదగ్గర నుంచి కాల్చి తెచ్చిన దుంపలతో, ఆకలి తీర్చుకునేవాళ్ళం. అర్ధాకలితో రోజులు కొట్టుమిట్టాడుతున్నాయి. అప్పుడే సంవత్సరం గడిచిపోయింది. చిన్నమ్మవాళ్ళ ఇంట్లో వుండటం కష్టంగా మారింది. ఎదిగే వయస్సులో వున్న మాకు, వాళ్ళ అత్త కొసిరి కొసిరి ఇచ్చే తిండి ఏ మాత్రం సరిపోయేది కాదు. రాత్రి పూటైతే అమ్మకు పెట్టిన తిండిలో నేను, చెల్లి కలిస్తే, నాన్నకు పెట్టిన తిండిలో తమ్ముళ్ళు కలిసేవాళ్ళు. ఎన్ని రోజులని పక్కవాళ్ళ భూమిలో పని చేస్తాం? ఎలాగైనా భూమి సమస్య తీర్చుకోవాలనే ఆలోచన నాన్నలో పట్టుదలను పెంచుతున్నది. అమ్మకు కూడా ఇక్కడుండటం ఏ మాత్రం ఇష్టం లేదు. 'చాలా సంవత్సరాల నుండి ఆ చుట్టపక్కల గ్రామాలన్నీ పార్టీ ప్రభావం వున్న గ్రామాలంట. ఇక్కడి ప్రజల క్షేమం కోరి, అనేక మంది మునసబుల దగ్గర భూములు లాక్కొనీ, భూమిలేని మా లాంటి పేద ప్రజలకు పంచారంట, ప్రతి ఊర్లో సంఘాలున్నాయంట' ఈ విషయాలన్ని నాన్న ఊరోళ్ళని కలిసాక అమ్మతో పంచుకుంటుంటే విన్నాను. ఓ రోజు "ఎదిగే పిల్లలకు కడుపునిండా తిండిపెట్టలేని దరిద్రులం, ఎన్ని రోజులని ఇట్లుందాం, సంఘంమోళ్ళనడిగి, ఓ సొంత గుడిసె వేసుకుందాం" అని అమ్మ చెప్పిన మాటలు నాన్నని ఆలోచింపజేశాయి. ముందు ఇక్కడి నుండి ఎలాగైనా బయటపడాలనే దానితో పక్కనే వున్న ఊరికి వెళ్ళాం.

'సంపెగొంది' ఊరు చిన్నమ్మ వాళ్ళ ఊరికి 2 కి.మీ దూరంలో వుంటుంది. రోడ్డు పాయింట్ గల గ్రామం. పొద్దున లేస్తే ఏ పనికైనా సంపెగొందికి వెళ్ళాల్సిందే. చిన్నమ్మవాల్ల ఊరు వచ్చినప్పటి నుండే, సంపెగొంది గ్రామస్తులతో పరిచయాలతో పాటు, స్నేహ సంబంధాలు

ఏర్పడ్డాయి. నాన్న సంఘంవాళ్ళకు మా పరిస్థితి వివరించి, మొదట ఇల్లు ప్రస్తావన తెచ్చాడు. సంఘంవాళ్లు గ్రామస్తులతో చర్చించి, ఓ చోట స్థలం చూపించారు. మాతో పాటు సంఘసభ్యుల సహకారంతో, వారం తిరక్కుండానే గుడిసె పూర్తయ్యింది. గుడిసెలోకి మకాం మార్చాం. ఇక నుండి అమ్మ, నాన్న ప్రతి రోజు 'భూమి' గురించే వాళ్ళ చర్చంతా. ఎంతో కొంత కూలీ డబ్బులకు తోడు అప్పు చేసి 3 గొడ్లు కొన్నాడు నాన్న. వాటి కాపలా నావంతయ్యింది. నా ఎక్కువ సమయం వాటితోనే గడుస్తుంది. అనుకోకుండా ఒకరోజు 'ఒంద్రె' నుండి కబురొచ్చింది. "మీ చిన్నన్నయ్య చనిపోయాడు" అని వచ్చిన వ్యక్తి చెప్పగానే నాన్న ముఖం ఎర్రబడింది. అమ్మ కళ్ళలో నీళ్లు. వెంటనే అక్కని తీసుకొని పయనమయ్యారు. నడవడానికి ఇబ్బందవుతుందని మమ్మల్ని తీసుకెల్లలేదు. అంత్యక్రియలు ముగించుకొని, మరుసటి రోజు సాయంత్రానికి ఇంటికొచ్చారు. ఇంట్లో అడుగు పెట్టారో లేదో, అక్కని బయటికి తీసుకెళ్ళి, 'అక్క పెదనాన్న ఎలా చనిపోయాడని' అడిగా. "ప్రతి ఏటా మన్యాన్ని పీడించే విష జ్వరం పెదనాన్నను మింగేసింది. గత 4, 5 సం॥రాల నుండి దగ్గు, దమ్ముతో నిరంతరం బాధపడుతుండేవాడు. నెల రోజుల నుండి జ్వరంతోనే వున్నాడంట. దవాఖానాలకు చూపించేంత ఆర్థిక స్తోమత, మనలాగే పెద్దమ్మకు లేదు. పాపం ఆమె మాత్రం ఏం చేయగలదు! పెద్ద పెదనాన్న (గురుమయ్య) చెట్ల మందులు ఇచ్చాడంట. అయినా లాభం లేకపోయింది. పెద్దనాన్న ఒక్కడే కాదు, తనలాంటి ఎంతో మందిని ఈ మాయదారి విష జ్వారాలు గూడేలకు గూడాలనే మింగేస్తాయి" అని అక్క చెప్పగానే నాకు ఈ మధ్య గొడ్ల దగ్గర పరిచయమైన సూరిగాడు చెప్పిన మాట గుర్తొచ్చింది. 'అక్కా! మొన్న సూరిగాడి అమ్మకు జ్వరం వస్తే ఎవరో దళం వాళ్ళంట, ఆమెకు మందులిచ్చి తగ్గించారంట. పెదనాన్నకి కూడా వాళ్ళతో మందులిప్పిస్తే బతికేవాడు కదక్కా!' అని నేననగానే అక్క "కానీ ఒంద్రెకి దళం పోదు. అక్కడ పెదనాన్న ఇచ్చే చెట్ల మందులే అందరికీ అలవాటు" అంది. 'మరీ సూరిగాడు పాడే దళం పాటలు కూడా బాగున్నాయక్కా, అసలు దళం అంటే ఏమిటి? వాడు చెబితే ఏం అర్థం కాలేదు' అన్నాను. నా ప్రశ్నకు చాలా వివరంగా "మనలాంటి పేద జనాల కోసం మాత్రమే పని చేసే మనుషులంట. తల్లితండ్రులు, బంధుమిత్రులు, ఆస్తులు.... సర్వస్వం వదులుకొని, మనలాంటి ప్రజల కోసం పోరాడతారంట. మన సొంతూరు రామారావులాంటి వాళ్ళు ప్రజలను దోపిడీ పీడనలకు గురిచేస్తుంటే, ప్రజల తీర్పుపై ఆధారపడి, వాళ్ళనూ అక్కడనుండి ఎళ్ళగొట్టడమా లేదా అవే అరాచకాలకు పాల్పడితే చంపడమా చేస్తారంట. ఈ ప్రాంతంలో కూడా చాలా మంది మునసబుల భూములు లాక్కొని, భూమిలేని మనలాంటోళ్ళకు పంచారంట. ఈ పనులన్నింటిని ప్రజల చేతనే చేయిస్తారంట. అందుకు ప్రజల్ని సంఘాలుగా పెడతారంట" అంటూ పని దగ్గర తన దోస్తు చెప్పిన విషయాలను పూస

గుచ్చినట్లు చెప్పింది. అంతేకాదు మనకు గుడిసె జాగ ఇచ్చింది కూడా సంఘంవాళ్ళేకదా!" అంటూ తుర్రున అమ్మ కేకతో ఇంట్లోకెళ్ళింది అక్క. అంటే సూరిగాడు చెప్పే దళం, మాకు గుడిసె ఇచ్చిన సంఘం, అందరూ మా లాంటి పేదవాళ్లకోసమే పని చేస్తారన్నమాట.

తోటివాళ్ళందరూ స్కూల్‌కి వెలుతుంటే నేను కూడా వెళ్ళా. స్కూలుకి వచ్చే మాస్టరు మాత్రం 10 రోజులకో, 15 రోజులకో వస్తాడు. దీని కన్న కాఫీతోటల కూలీపనీ, జతగాళ్ళతో గొడ్లకాపు మంచిదనిపించింది. అక్కతో పాటు కూలీ పయనం కొనసాగించాను. అనుకోకుండా తమ్ముడికి జ్వరం రావడంతో మళ్ళీ గొడ్లు కాపు నా వంతయ్యింది. అమావాస్య, పౌర్ణమికి మాస్టరొచ్చి, ఆ గంటసేపు చెప్పే సదువుకన్నా గొడ్లు, మేకలు, మా జట్టులో పాడే దళం పాటలు, బిడింగిలపై గోటీలాట, అన్నింటికన్న ఇష్టమైన దళం ఆట (ఒక జట్టు దళం, ఒక జట్టు పోలీసులు అని పిడకలతో కొట్టుకునే వాళ్ళం, చివరికి దళమే గెరిచిందని కేకలేస్తూ నవ్వుకునేవాళ్ళాం) ....వీటన్నింటితో పొందే సంతోషమే తృప్తిగా అనిపించేది.

ఇప్పటికీ 2, 3 సార్లవుతుంది. అమ్మ నాన్నలతో పాటు అక్క కూడా రాత్రి 12, 1 గంటకు అనగా ఇంటికొస్తుంది, ఏమి అర్థం కాలేదు. మమ్మల్ని చిన్నోళ్ళని వదిలి వెలుతున్నారు. అమ్మనాన్న మాత్రం ఎక్కడికెలుతున్నారో మా చెవిన పడనీయడంలేదు. తెలుసుకోవాలనే ఆరాటం నాలో రోజు రోజుకు పెరిగిపోతుంది. ఓ రోజు అక్కనడిగా. 'మమ్మల్ని వదిలేసి ఎక్కడికెలుతున్నారక్కా' అని. "దళం వాళ్ల మీటింగ్‌కి వెళ్ళాం. కాఫీ తోటలు మన ఊర్లోనే కాదు, చట్టుపక్కల అన్ని ఊర్లలో ఉన్నాయి. నీవు గొడ్ల కాపుకు వెల్లనప్పుడు మనిద్దరం కాఫీ తోటలో పని కెళ్ళాం. గుర్తుందా! ఆ కాఫీ తోటల గురించే మీటింగ్. రెండు రోజుల నుండి ఊర్లో అంతా మీటింగ్ ఎలా జరుగుతుందోననే ముచ్చట్లే. అయితే కాఫీ తోటలన్నింటిని సర్కార్ చూసుకుంటుంది. ఆ భూములన్ని మన లాంటి ప్రజలవేనంట. మన భూముల్లో మనల్నే కూలీ మనుషులుగా చేసి, వందో, యాబయ్యే మొహాన కొట్టి వేలు, లక్షల రూపాయలను సర్కారే తింటుందట. అందుకోసం ప్రజలందరూ కలిసి, కాఫీతోటలను దోపిడీ సర్కార్ నుండి స్వాధీనం చేసుకోవాలనీ, అన్ని ఊర్ల ప్రజలు కదిలి కాఫీ తోటలను దక్కించుకునే వరకు పోరాడాలని చెప్పారు. ఎంత మంది జనాలో తెలుసా! 2, 3 వేలు వుంటారేమో. ఇంకా మనల్ని దోపిడీ సర్కార్ ఏ విధంగా మోసం చేస్తుందో చాలా వివరంగా చెప్పారు" అంటూ వెళ్ళిపోయింది అక్క. ఊరోళ్ళ దగ్గర కూడా ఇవే గుసగుసలు. యధావిధిగా అప్పుడప్పుడు రాత్రుళ్ళు దళం వేసే సమావేశాలకు అమ్మ, నాన్నవాళ్ళు వెళ్ళొస్తున్నారు. మమ్మల్నయితే తీసుకెల్లడం లేదు. బహుశా మేము చిన్నవాళ్ళమని కావచ్చు. గ్రామంలో మాత్రం రోజురోజుకు వాతావరణం వేడెక్కుతూ వచ్చింది.

సంపెగొందికొచ్చి 3 సంవత్సరాలు గడుస్తుంది. భూమి సమస్య మాత్రం తీరలేదు. ఎవరో తనకు తెలిసిన వ్యక్తి దగ్గర కౌలుకు భూమి తీసుకొని పని చేస్తున్నాడు నాన్న. కానీ దానిలో లాభం రాకపోగ మేమే నష్టపోతున్నాం. దాంట్లో పండే పంటకు అప్పు చేయక తప్పలేదు. ఇంటిల్లిపాది అదే పొలంలో కష్టపడ్డప్పటికీ, ఫలితం లేకుండా పోయింది. భూమి లేదనే బాధ ప్రతి రోజు కలవరపెట్టేది అమ్మనాన్నలని. ఇదే విషయం ఇద్దరు రోజూ చర్చించుకుంటున్నారు. "ఇంకెన్ని రోజులు పక్కోళ్ళ దగ్గర పని చేస్తాం, పరాయి పొలంలో పంట పండించినా లాభం వుంటలేదు. ఎలాగైనా మనం సంఘంవాళ్ళని భూమి అడుగుదాం" అనే నాన్న మాటలతో ఇద్దరూ ఊరోళ్ళతో పాటు, సంఘంసభ్యులను కలిశారు. నెల తిరక్కుండానే గ్రామస్తులతో పాటు, పార్టీతో చర్చించి కాఫీ తోటల పక్కనే 3 ఎకరాల భూమి చూపించారు సంఘంవాళ్ళు. అమ్మానాన్నల సంతోషానికి అవదుల్లేవ్. అంతగా సంతోషపడ్డారు భూమిని చూసి.

దళ మీటింగులు ముందుకన్న పెరిగాయని, అమ్మనాన్నల అర్థరాత్రి రాకను బట్టి అర్థమయ్యాయి. గత నెల రోజుల నుండి పోలీసులు ఉదయనే ఊర్లోకొస్తున్నారు. ఇళ్లళ్లోకి చొరబడి, తేరిపారా చూస్తున్నారు. అందరిలాగే మా ఇంట్లోకి రావడం, వెతకడం చేస్తున్నారు. దళం మీటింగులు చేస్తున్నందుకే కావచ్చేమో, మరి ఇంట్లో ఎందుకు వెతుకుతున్నారో అర్థం కాలేదు. జ్వరం రావడంతో వారం రోజుల నుండి ఇంటిదగ్గరే వున్న. నాకు ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసుకోవాలనిపించింది. ఇప్పుడెలా? వెంటనే సేతు గుర్తొచ్చింది. ఆ గ్రామంలో సేతు నాతో బాగా జతయ్యింది. దళం విషయాలు తనకు బాగా తెలుసు. పైగా వాళ్ళ నాన్న సంఘంలో వుంటాడంది. ఇంకేమీ ఆలోచించకుండా సేతు వాళ్ళ ఇంటికెళ్ళా. వాళ్ల ఇంటి ముందు వాకిట్లో వంట పనిలో వున్న సేతు, నన్ను చూడగానే చింతచెట్టు కిందకు పరుగెత్తుకొచ్చింది. వెంటనే సేతుని విషయం అడిగా. 'జ్వరంతో పడుకొని వున్న నన్ను, పోలీసులు లేపి మీ ఇంటికి దళం వాళ్ళు వస్తుంటారా, అని అడిగారు. లేదని చెప్పా. ఇల్లంతా గాలించి ఇనపెట్టెలో వున్న అమ్మ చీరలు, మా ఫోటోలు, నాన్న దాచిన కాగితాలు అన్ని తీసి పడేసి, సర్దుకో అంటూ వెళ్ళిపోయారు. చివరిగా మీ అక్క, నీవు మిలీషియాలో పని చేస్తున్నారా! అని అడిగారు, లేదని చెప్పా. అసలు మిలీషియా అంటే ఏమిటి సేతు?' అని అడిగా. దానికి సమాధానంగా సేతు "మా నాన్న కూడా పది రోజుల నుండి ఇంటికి రావట్లేదు. మనం స్వాధీనం చేసుకున్న కాఫీ తోటలను రక్షించుకునేందుకు, దళం వాళ్లు ప్రతి ఊర్లో మీటింగులు చేస్తున్నారు. ప్రజలకు వ్యతిరేకంగా వున్న వారిని ప్రజాకోర్టులో పెట్టి శిక్షిస్తున్నారు. ఈ చర్యలు ఎక్కువవ్వడంతో పోలీసుల కదలికలు కూడా గ్యాప్ లేకుండా ఉంటున్నాయి. మాటల్లో నీవు అడిగిన విషయమో మర్చిపోయా. మిలీషియా అంటే గ్రామ రక్షక దళాలు. వాళ్ళు ప్రజలకు

అండగా పోలీసులతో లడాయ్ చేస్తారు. దళం వచ్చినప్పుడు వారికి సహకరిస్తారు. మిగతా సమయాల్లో, ఈ పాకెట్‌లోని గ్రామాలలో, ప్రజాసంక్షేమ పనుల్లో పాల్గొంటారు. అంతేకాదు, ముందుండి నిర్వహిస్తారు" అని తను చెప్పిన మాటలు నాలో దళంపైనా, పోరాటంపైనా ఇష్టాన్ని పెంచాయి.

కాఫీ తోటల పోరాటంలో ఈ మధ్య ధర్నాలు, నిరసన కార్యక్రమాలు పెరగడంతో నిత్యం పోలీసుల కదలికలు సాధారణమైపోయాయి. ప్రతి రోజు బూట్ల శబ్దంతోనే ఊర్లు తెల్లారుతున్నాయి. మాది రోడ్డు పాయింట్ గల గ్రామం. కాబట్టి అన్ని బలగాలు మా ఊరికి జీప్‌లలో వచ్చి, బ్యాచీలుగా విడిపోయి, కూంబింగ్‌లు ముగించుకొని, 3,4 రోజుల తర్వాత వాపస్ వచ్చి ఇక్కడే కలుసుకొని క్యాంపులకు వెళ్ళిపోతుండేవాళ్ళు. ఈ కార్యక్రమం నిత్యకృత్యమైంది. దీంతో పోలీసులన్నా, వాళ్ళ బూట్ల చప్పుడన్నా ఎవరికి భయం లేకుండా పోయింది.

ఈ క్రమంలోనే ఊర్లో ఒక అమ్మాయిని హోంగార్డు ఎత్తుకెళ్ళి పెళ్ళి చేసుకున్నాడు. ఇది సాకుగా పెట్టుకొని, హోంగార్డు ఊరికి రావడం పెరిగింది. విషయం పసిగట్టిన మిలీషియా, సంఘం దళానికి సమాచారమిచ్చారు. ఆ కుటుంబంతో మాట్లాడతారనీ, రేపే మీటింగ్ అని ఊరంతా పుకారు. రాత్రి 10 గం॥ అవుతుంది. దళం గురించి వినడమే కానీ, ఎప్పుడూ చూడలేదు. ఎలాగైనా మీటింగ్‌కి వెళ్ళాలనే నిర్ణయించుకున్నా. అమ్మవాళ్ళు వెళ్ళాక, వారికి కనబడకుండా వెళ్ళా. ఎక్కడో జనాల్లో సేతు దగ్గరికెళ్ళి కూర్చొన్నా. అందరు కూర్చున్న 10 ని॥లకి నల్లని బూట్లు, ముదురు ఆకుపచ్చ డ్రస్, తలపై టోపి, పోలీసుల దగ్గర లాంటి తుపాకీ, వాళ్లకేసే చూస్తున్నా. అంతలో "వాళ్ళే దళం" అని సేతు అనడంతో, నాలో మరింత ఉత్సుకత పెరిగింది. ముందుగా ప్రజలందరికీ హోంగార్డు కుటుంబాన్ని ఎలా అర్థం చేసుకోవాలో దళం కమాండర్ వివరించాడు. ఆ కుటుంబం వల్ల ప్రజలకు చేకూరే నష్టాన్ని, రాజకీయంగా ప్రజలకర్థమయ్యే విధంగా తెలియచెప్పాడు. దీంతో ఆ కుటుంబానికి తమ కూతురుతోనూ, అల్లుడుతోనూ (హోంగార్డు)వుండాల్సిన సంబంధాల గురించి ప్రజలలో బాగా చర్చ జరిగింది. చివరికి ప్రజల అభిప్రాయం మేరకు, గ్రామ ఉమ్మడి ప్రయోజనాల కోసం ఆ కుటుంబం కూతురుతోనూ, అల్లుడితోను (హోంగార్డు) ఎటువంటి సంబంధాలు కొనసాగించకూడదనీ, ఒకవేళ సంబంధాలు కొనసాగితే వీరిని కూడా గ్రామం నుండి వెళ్ళగొట్టాలని, మీటింగ్‌లో తీర్మాణించారు. ఈ సందర్భంగా 'రచ్చబండ దగ్గర నాన్నవాళ్ళ చిన్నతనంలో ఊరి మునసబు చెప్పిందే వేదం' అని నాన్న చెప్పిన మాట గుర్తొచ్చింది. పార్టీకి, మునసబులకు ఎంత తేడా. అప్పుడర్థమైంది ప్రజల సరైన నిర్ణయాలకనుగుణంగా పార్టీ

నిర్ణయముంటుదని. ఆ మీటింగ్‌లో పాల్గొన్న దగ్గర నుండి, వాళ్ళని మర్చిపోలేకపోయా. ఇప్పుడింకా నాకు కచ్చితంగా మిలీషియాలో పని చేయాలనే పట్టుదల గట్టిపడింది.

అమ్మనాన్నవాళ్ళు, అక్కపెళ్ళికి తెలిసిన బంధువుల దగ్గర కల్లు తాగి వచ్చారు. కనీసం అక్కతో మాటైనా చెప్పలేదు. మా కువ్వి తెగ సాంప్రదాయం ప్రకారం పెళ్ళి జరిపించారు. అక్కలాగ మాత్రం పెళ్ళి చేసుకోవద్దని నిర్ణయించుకున్నా. ఇంట్లో వంట, తమ్ముళ్ళు, చెల్లి బాగోగులు నాపై పడ్డాయి. అమ్మనాన్నలు పొలం పనుల్లోనే రోజంతా. అక్క పెళ్ళయి సం॥రం తిరక్కుండానే నా పెళ్ళి ముచ్చట్లు. 16 సం॥ వయసొచ్చిందనీ, నా తోటి వాళ్ళకు పెళ్ళిళ్ళు అయ్యాయని, ప్రతి రోజు ఇంట్లో చర్చే. తెలిసినవాళ్ళే, వరుసకి అత్త, మామలు అవుతారు. వాళ్ళ కొడుకుకు నన్ను ఇవ్వాలనీ, వాళ్ళే వచ్చి అడగటంతో ఒప్పేసుకున్నారు అమ్మనాన్నలు. నాకు చెప్పకుండానే వాళ్ళ ఊరు తీసుకెళ్ళారు. పెద్దనాన్న కూతురు కూడా అదే ఊరు. అత్తా వాళ్ళ ఇంట్లో ఉండటం ఇష్టం లేక అక్కదగ్గరికెళ్ళా. వాళ్ళు కూడా ఇవే పాఠాలు. “మంచి కుటుంబం, అత్తామామలు మంచోళ్ళు, అబ్బాయి అంతకన్న మంచోడు, ఒప్పుకో ఇలాంటి వాళ్ళు దొరకరు, నీ ఇష్టం” అంటు రోజు అక్కబావల పోరు. వాళ్ళ మాటలు కోపాన్ని తెప్పించినా, ఏమి అనలేని పరిస్థితి. ఎలాగైనా ఈ ఊర్లో నుండి బయటపడాలనే నా ఆలోచన నిరంతరం వెంటాడేది. అక్క వాళ్ళ ఇంట్లోనే రోజులు గడుస్తున్నాయి. ఓ రోజు దుకాణానికి వెలతానని అక్కతో చెప్పా. నాపై నమ్మకం లేని అక్క, తన కూతురిని నా వెంట పంపింది. అనుకున్నట్లుగానే వెళ్ళా. కానీ పారిపోవాలనే నా ప్రయత్నం, అక్క భర్త అక్కడే వుండటంతో విఫలమయ్యింది. అత్త రోజు అక్క దగ్గరికి వచ్చి, నేను వాళ్లతో వుండటం లేదనే బాధను పంచుకొని ఏడుస్తుండేది. అది విని అక్క నన్ను ఒప్పించే ప్రయత్నం చేసేది. నా నిర్ణయంలో ఏం మార్పు లేదు. ముందులాగే మరోరోజు అక్కతో చెప్పి దుకాణానికి వెళ్ళా. నా వెనక ఎప్పటిలాగే తన కూతురిని పంపింది. దుకాణానికి వెళ్ళగానే పాపకి బిస్కెట్లు ఇప్పించి, ఇదే అదును చూసుకొని ఎదురుగా వచ్చే జీపు ఎక్కా. మా ఊరు చేరుకున్న. పీడ విరగడయ్యిందని సంతోషపడ్డా. రాత్రంతా అమ్మనాన్నలు ఇలా రావడం సరైంది కాదనీ, సర్దుకోవాలనీ, మంచి కుటుంబమని ఏవేవో మాటలు చెప్పారు. నాకవేం పట్టలేదు. కానీ నా సంతోషం కొన్ని గంటలకే పరిమితమైంది. తెల్లరేసరికి అక్కబావలతో పాటు, అత్తమామలు కూడా వచ్చారు. వెళ్ళనన్నప్పటికీ అమ్మవాళ్ళు బలవంతంగా పంపారు. సంవత్సరంన్నర(18 నెలలు) దిన దినం భారంగా గడిచాయి. వీళ్ళు పంపడం, నేను ఏదో ఒక విధంగా పారిపోయి రావడం నాలుగోసారి. ఇంటికెలితే లాభం లేదని, ఈ సారి పాత ఊరు, పెద్దనాన్నవాళ్ళ దగ్గరికెల్లా. ఆకస్మాత్తుగా, ఒంటరిగా వచ్చిన నన్ను చూసి, వాళ్ళు కొంత ఆందోళనకు గురయ్యారు. చూడాలనిపించి వచ్చానని చెప్పా. అక్కడ నేను కనబడకపోయే

సరికి, అత్తమ్మవాళ్ళు ఎప్పటిలాగే నేను అమ్మవాళ్ళ దగ్గరికే వెళ్తానని ఊహించి మా ఊరెళ్ళారు. అక్కడ అమ్మవాళ్లు నేను ఇంటికి రాలేదనీ, ఆందోళన పడుతూ అత్తమ్మవాళ్ళపై కోపడ్డారు. అందరు కలిసి మూడో రోజుకు పెదనాన్న వాళ్ళ ఇంటికొచ్చారు. నాకు ఏడుపాగలేదు, అమ్మ మాత్రం "తనకు ఇష్టం లేకుండా ఎన్నిసార్లని పంపగలం, కొద్దిరోజులు మాతో పెట్టుకొని సర్దిచెప్పి పంపుతాం" అని సమాధానం చెప్పింది. తన మాటల వెనక సంఘం చేయి వుంటుందని అర్థమైంది. మరోసారి బ్రతికిపోయానని ఊపిరి పీల్చుకున్నా.

నేను లేని ఈ రోజుల్లో గ్రామంలో చాలా మార్పులొచ్చాయి. ఊరంతా శుద్ధిచేసినట్లు వుండటం, చువ్వనీళ్ళ దగ్గర సిమెంట్‌తో తొట్టిలా కట్టడం, ఊర్లో మాస్టరు రావడం...కొత్తదనాన్ని సంతరించుకుంది. ఏమిటీ ఈ మార్పు? సేతునడిగా. "విప్లవ సంస్కరణల్లో భాగంగా సంఘం, మిలీషియా నిర్వహించిన కార్యక్రమాల ఫలితమే ఈ కొత్తదనమంది". పార్టీ ఇలాంటి పనులు కూడా చేస్తుందా! ఆశ్చర్యమేసింది. ఇంటి పని అయిపోగానే, కూలీ పనికెళ్ళడం, తోటి వాళ్ళతో దళ కబుర్లు, ఇలా రోజులు గడుస్తున్నాయి. ఎలాగైనా సంఘం వాళ్ళని కలవాలనే ఆతృత నాలో పెరుగుతోంది. సంఘం అధ్యక్షుడు వరుసకి అన్న అవుతాడు, ఒకరోజు ఆయనతో 'సంఘంలో పని చేస్తానని ఎన్నో రోజులుగా, నా మనస్సులో వున్న మాట' సూటిగా చెప్పా. మిలీషియాలో అయితే బాగుంటుదన్నాడు అన్న. అందుకు ఒప్పుకున్న. మొదట్లో, ఇంట్లో ఏదో చెప్పి మిలీషియాలో తిరిగా. రాను రాను అసలు కథ ఇంట్లో తెలిసింది. సాయంత్రానికి రోజు ఇంట్లో కనిపిస్తున్నా కాబట్టి, పెద్దగా పట్టించుకోలేదు.

ఓ రోజు మా సంఘ నాయకుడు పార్టీ పిలుస్తుందని నాకు కబురు పెట్టాడు. ఎగిరి గంతేసా. మూడు గంటలు నడిచినా, దళం కలవలేదు. ఇంకెంత నడవాలని ఓపికలేక కూర్చొని అడిగా. అతనికి నోరు తడబడింది, ఏం మాట్లాడలేదు. నిజం చెప్పమని నిలదీసా. చేయి పట్టుకోబోయాడు. "నీవంటే నాకిష్టం, ఆ విషయం చెప్పడానికే అబద్ధామాడా" అన్నాడు. గుండె వేగం పెరిగింది. తెలియని భయం, వెను దిరిగి నడక ప్రారంభించా. నా వెనకాలే తను. "విషయం ఎవరికి చెప్పొద్దు" అన్నాడు. నోట మాట రాలేదు. చెప్పనన్నట్లుగా తల ఊపా. రాత్రి ఒంటిగంటైనా నిద్రపట్టలేదు. అమ్మవాళ్ళకు చెబితే కచ్చితంగా మిలీషియాలో పని మానేయమని అంటారు, కోప్పడతారు. చెప్పొదనుకున్న. అతనన్న మాటలే గుర్తుకొస్తున్నాయి. ఎవరికి చెప్పాలి? సూరిగాడు, సేతు ఇద్దరు కళ్ళల్లో తిరిగారు. వారం రోజులు ఇవే ఆలోచనలతో గడిచాయి. ఇంతదాకా వచ్చాక దాచడం సరైందికాదనిపించింది. చీకటి పండింది, అమ్మ ఇంటికొచ్చింది. ఎలా మొదలు పెట్టాలో అర్థం కావడం లేదు. మొత్తానికి పడుకునే ముందు అతని నుండి ఎదుర్కొన్న రెండు సంఘటనలు ధైర్యంగా అమ్మకు విప్పి చెప్పా. ఏడుస్తూ కోప్పడింది. అమ్మవాళ్ళు ఈ విషయాన్ని

సంఘం ముందు పెట్టారు. సంఘ సభ్యులు పంచాయితీ నిర్వహించారు. అతను నేను చెప్పిన మాటలను అంగీకరించపోగా, నా తప్పేంలేదని, గట్టిగానే అందరి ముందు బుకాయించాడు. పార్టీ వరకు చేరింది విషయం. నాకు నమ్మకమైన వ్యక్తితో పార్టీ రమ్మని వార్త. వెంటనే వెళ్ళా, అతను ఎప్పుడొచ్చాడో తెలియదు. దళంవాళ్ళతో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాడు. నన్ను చూడగానే ముఖం మారిపోయింది. ఎప్పుడు ప్లాన్ చేశారో ప్రజాకోర్టు. మధ్యాహ్నానికి ప్రజలందరూ వచ్చారు. దళ కమాండర్ అతడిని అడగటం ప్రారంభించాడు. అతని నుండి పాత సమాధానమే వచ్చింది. అయితే అప్పటికే దళ కామ్రేడ్స్ అతని తప్పుడు ప్రవర్తనను గ్రామస్తుల ద్వారా అర్థం చేసుకున్నారు. దీంతో అతన్ని సభలో గట్టిగా నిలదీశాడు. ఎప్పుడైతే దళ కమాండర్ అతన్ని గట్టిగా నిలదీసాడో, అప్పుడు ప్రజల నుండి కూడా అతనిపై మరికొన్ని ఆరోపణలు వచ్చాయి. గతంలో మరో ఇద్దరు అమ్మాయిలను కూడా లైంగికంగా వేధించాడని చెప్పారు. దీంతో అతను తల దించుకున్నాడు. ఏం మాట్లాడకుండా తప్పు ఒప్పుకున్నాడు. "ఇన్నాళ్ళు సంఘ నాయకుడిగా వుంటూ ఇంత ద్రోహం చేస్తావా, నిన్ను క్షమించేదిలేదు" అంటూ ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. ఆవేశంతో కొట్టబోయారు. దళంవాళ్ళు అడ్డు రావడంతో బ్రతికిపోయాడు. 'ఇలాంటి వాళ్ళకు, ప్రజలకు నాయకత్వం వహించే అర్హత లేదని చెప్పి, సంఘనాయకుడి నుండి తొలగించారు. మరోసారి ఇలాంటి తప్పులకు పాల్పడితే చర్యలు తీవ్రంగా వుంటాయని హెచ్చరించారు.

దళంతో వుండాలనే నా కలనీ, ఈ సందర్భంగా మూడు రోజులు ముచ్చటగా గడిపా. అన్ని కొత్త అనుభవాలే. స్త్రీ, పురుషులనే తేడా లేకుండా సోదరభావంతో (కామ్రేడ్లీ సంబంధం)మెలగడం, పనులన్నీ కలిసి చేసుకోవడం, 'మహిళలు చేసే పనులు వేరు–పురుషులు చేసే పనులు వేరు' అనే భిన్నమైన తేడాలు లేకుండా సమానంగా అన్ని పనుల్లో అందరు భాగం కావడం, పనులు ముగియగానే స్కూల్ నేర్చుకోవడం... తదితర పద్ధతులకి, నాకు తెలియకుండానే ఆకర్షితురాలినయ్యా. దళం సలహా మేరకు, పూర్తిగా ఒక సంవత్సరం పాటు మిలీషియాలోనే పని చేయాలని నిర్ణయించుకున్న. నిర్ణయాని కనుగుణంగానే సంవత్సరం పాటు ఇంటికెళ్ళలేదు. ఇంటివాళ్ళు ఏడ్వడం, దళాన్ని వెతకడం, అన్ని జరిగిపోయాయి. నేనెక్కడా వాళ్ల కంటబడలేదు.

ఒక సంవత్సరం గడిచిన తర్వాత మిలీషియా బాధ్యుడైన కామ్రేడ్ జాంబ్రి "మిలీషియాలో నీ పనితీరు, ప్రజలపట్ల నీ బాధ్యత మన కామ్రేడ్స్ ద్వారా అర్థమయింది. అసలు విషయం ఏమిటంటే నీవు దళానికి రిక్రూట్ కావాలనేది పార్టీ ప్రతిపాదన, నీ వైపు నుండి ఏమైనా మాట్లాడాలనుకుంటే చెప్పు" అని ముగించాడు. మాట్లాడాల్సింది ఏమి లేదని తల ఊపుతూ, వస్తానన్నట్లుగా నవ్వుతో సమాధానమిచ్చా.

తెల్లవారే, అమ్మనాన్నలిద్దరూ దేరాకొచ్చారు. హఠాత్తుగా చూసే సరికి నా ముఖం ప్రశ్నర్థకమైంది. "రేపే నీ ప్రయాణం, దళానికి వెలితే వీలుకాదని కబురుపెట్టాం" అని కమాండర్ పక్కకి పిలిచి చెప్పాడు. ఆ రాత్రంతా అమ్మపక్కనే పడుకొని పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నా. అమ్మా, నాన్నలకు పార్టీ, దళం అంటే ఇష్టమున్నా, నన్ను పూర్తిగా ఆ పనికి కేటాయించేందుకు సిద్ధంగా లేరు. దాంతో వాళ్ళు నన్ను కొంత వెనక్కు లాగేందుకు ప్రయత్నించినా, వాళ్ళకు నచ్చచెప్పి, పీడిత ప్రజల విముక్తికి, ముఖ్యంగా భూమి, అధికారం కోసం దృఢంగా అడుగు ముందుకేయాలనుకున్నాను.

ప్రభాతవేల, పక్షులు, పిచ్చుకల అరుపులతో అడివంతా అల్లరి చేస్తున్నట్లుగా ఉంది. సేలయేటి నీటిశబ్దం ఆ అల్లరిలో కలిసిపోయింది. బ్రాక్ట్రెట్ కొండల మధ్యలోంచి సన్నని సూర్యకాంతి వికసిస్తున్నది. కమాండర్ విజిల్ మోగింది. ఆశగా నా వైపు చూస్తున్నారు ఇద్దరు. ఆ ఇద్దరిని ఆలింగనం చేసుకొని, చేతులు కలిపి, పిడికిలెత్తిన చేతితో రోల్‌కాల్ నిర్వహిస్తున్న ఎర్రసేనవైపు పరుగెత్తా. ✵



దండకారణ్యంలో నిర్వహించబడుతున్న జనతనసర్కార్ స్కూల్

# 4

ఊరినంతా తన పచ్చదనంతో చుట్టేసినట్లుగా పనస, మామిడి, చింత చెట్ల అందాలు. ఆ చెట్లకన్న ఎత్తున కనిపించే ఎతైన కొండలు. ఆ కొండలను వదలనన్నట్లుగా ఆ పైనే నీలాకాశం. వీటన్నింటి మధ్యలో మాది ఒక చిన్న గ్రామం. ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా, నారాయణపట్నా బ్లాక్ పరిధిలోని, పీల్‌బరి అనే గ్రామంలో, మెజారిటీ కుయి ఆదివాసీ పేదప్రజల కుటుంబాల్లో మాదొకటి. తాత (సొయి) కష్టపడి సంపాదించిన భూమిని మునసబులు, ఆదివాసేతరులు లాక్కోగా, మిగిలిన భూమిని నాన్న (ఆబ) సాగుచేసేవాడు. వ్యవసాయంపైనే ఆధారపడి బతికేవాళ్ళం. 20 గొడ్లు, 15 మేకలు నాన్న సంపాదించిన ఆస్తి. ధాన్యం, సోళ్ళు కాలువకి పక్కనే వేసే ఆలు, ముల్లంగి, వేరుశనగ, బఠానీ, కూరగాయలతో రోజులు గడిచేవి. నాన్నతోపాటు అమ్మ (ఇయ), మేము ఎప్పుడూ పొలం పనుల్లోనే మెలిగేవాళ్ళం. మా అమ్మ, నాన్నలకి మేము ఐదుగురం. ఇద్దరు అక్కలు, అన్న, తమ్ముడు. నేను బుధవారం పుట్టానని మా ముసలామే (నాన్నమ్మ–బాయి) బుద్రి అని పేరు పెట్టిందంట. ఆ పేరునే అందరు పిలిచేవాళ్ళు. నాన్నకి నలుగురు అక్కలు, ఇద్దరు తమ్ములు, అక్కల పెళ్ళిళ్ళు నాన్నకి ఊహ తెలిసే నాటికే అయిపోయాయంట. ఇక మునసబు బెదిరింపులు తాళలేక ముసలోళ్ళిద్దరు చిన్నాన్నలను ఇద్దరిని తీసుకొని వేరే ఊరు వెళ్ళిపోయారంట. నాన్న మాత్రం వాళ్ళ బెదిరింపులు భరిస్తూనే అక్కడే వుండిపోయాడు.

మునసబు ఆధిపత్యంతో గ్రామస్తులందరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఎవరు కూడా ప్రశ్నించేవారు కాదు. అయితే మా కుటుంబం అప్పటికే ఏడు ఇళ్ళుగా వున్న సంఖ్య అంతా, వీరి బెదిరింపులకు పారిపోవడంతో, చివరకు మా ఒక్క ఇల్లే మిగిలింది. అయినా నాన్న వాళ్ళకి భయపడేవాడు కాదు. ధైర్యంగానే తన పని తాను చేసుకుపోయేవాడు. వున్న మా ఒక్క కుటుంబాన్ని ఎలాగైనా తరిమేయాలని మునసబువాళ్ళ పన్నాగం. చాలాసార్లు నాన్నని "ఊర్లో ఉండి నీ ఒక్కడివి ఏం ఎలగబెడదామని, మీ కుటుంబాలు అన్ని వెళ్ళిపోయాయిగా. మేము ఏం అనకముందే నీవు ఊరు విడిచి వెళ్ళిపోతే మంచిది. ఆ తర్వాత జరిగే పరిణామాలకు బాధ్యత మాది కాదు, సీరియస్‌గా గుర్తుంచుకో" అని వాళ్ళు అన్నారంట.

"వాళ్ళు బెదిరిస్తే మనమెందుకు పారిపోవాలి? ఎలాగైనా ఇక్కడే వుండి మన బతుకేదో మనం బతుకుదాం. వాళ్ళపైన ఆధారపడటం లేదుగా" అమ్మతో చెబుతూ ఆవేశపడుతున్నాడు నాన్న. ఇలా రెండు, మూడు నెలలు గడిచాక గుంపుతో కూడిన ఏడు మంది చీకట్లో మా ఇంటికి వచ్చి నాన్నని "వెళ్ళమంటే నీకెంత పొగరురా! మా మాటంటే లెక్కలేదు. ఇప్పటికైనా మించింది లేదు. వెల్తావా సరే, లేదంటే నీ ప్రాణానికే ప్రమాదం ఆలోచించు" అంటూ నాన్నపై పడి బాగా కొట్టారు. జరిగే సంఘటనను అందరూ చూస్తున్నా, ఆపడానికి మాత్రం ఎవరు ముందుకు రాలేదు. అమ్మ అడ్డుపోతే తన్నుతూ తోసేసారు. ఆ గుంపులో నుండి నాన్న పరుగెత్తుకొని పారిపోయాడు. అయినా వదల్లేదు, ఒకరింట్లో దూరాడు. మనసబు మనుషులు వెళ్ళి ఆ ఇంటి అక్కని అడిగినా, అప్పటికే నాన్న తనని వాళ్ళనుండి కాపాడమని ప్రాధేయపడటంతో, తను నాన్న గురించి చెప్పలేదు. తనను తిట్టి వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆమె నాన్నని రహస్యంగా తన ఇంట్లనుండి బయట పడేసింది. అదే రోజురాత్రి నాన్న గొర్కజాల అనే గ్రామానికి పారిపోయాడని మాకు నెల రోజుల తర్వాతగాని తెలియలేదు. ఇంటినంతా వల్లకాడులా మార్చి పోయారు మునసబు మనుషులు. అమ్మ కూలిన రేకుల్ని, చెదిరిన సామాన్లని అంతాసర్ది ఎప్పటి ఇల్లులా చేసింది. మాకున్న ఆస్తితోపాటు పెరిగిన మేకలు, గొడ్లను కసిగా గొడ్డలితో నరికి చంపారు. మా నాన్న లేకపోవడంతో తర్వాత కూడా అమ్మ వాటి గురించి వాళ్ళను అడగలేదు. మమ్మల్ని బతికుంచినందుకు సంతోషపడింది. నాన్న ఏమైపోయాడోనని ఆ నెల రోజులు అమ్మ పడ్డ వేదన మాటల్లో చెప్పలేను. అంతగా బాధ పడింది. ఇంత జరిగినా కూడా మనసబువాళ్ళు మా ఇంటిని వదల్లేదు. పొలం కెల్లడం పూర్తిగా మానేసింది అమ్మ. మా పొలంలో మునసబు కుటుంబం, వాళ్ళ పనివాళ్ళు తిరుగుతున్నారు. "వాళ్ళతో గొడవ పడి, నేను పొలంలో పని చేస్తే, వాళ్ళు నన్ను బతకనిస్తారా? తండ్రి దూరమైన నా పిల్లలకు నేను కూడా దూరమైతే వాళ్ళ పరిస్థితి ఏంటి?" అని ఆలోచించి వాళ్ళను ఏమి కదిలించలేదు. అటువైపుగా అడవికి వెళ్ళినప్పుడల్లా పొలాన్ని చూసి అమ్మ, నాన్నతో కష్టపడి పని చేసిన రోజులు గుర్తు చేసుకొని బాధపడేది. ఆ సమయంలో తిండి కూడా సంహించేది కాదు అమ్మకి. ఇంటి వెనక వున్న కూరగాయాల తోటకు నిరంతరం సేవ చేసేది. దాని పని లేని సమయాల్లో అడవికి మమ్మల్ని వెంట పెట్టకొని వెళ్ళేది. అడవిలో దొరికే దుంపలు, వెదురు, కర్రలు తెచ్చుకునేవాళ్ళం. ఎప్పటిలాగే ఒకసారి అడవికి వెళ్ళాం. నాన్న వచ్చి ఎంతసేపయ్యిందో తెలియదు. మా కోసం చాలాసార్లు అడవికి వచ్చాడంట కాని మేము, నాన్న ఎప్పుడు కలుసుకోలేదు.

చూడగానే ఒక్కసారిగా అందరం వెళ్ళి నాన్నను గట్టిగా పట్టుకున్నాం. మమ్మల్ని వదిలి ఎక్కడికి వెళ్ళొదని అక్క, అన్న ఏడుస్తున్నారు. అప్పటికి నేను ఎక్కువ సమయాన్ని అమ్మతోనే గడిపేదాన్ని కాబట్టి నాన్న గురించి నాకేం అర్థం కాలేదు. అమ్మ మాత్రం నాన్న వెళ్ళాక జరిగిన పరిణామాల గురించి చెప్తున్నది. మా కోసం తెచ్చిన జావను నాన్నకి పోసి, మిగిలిన దాన్ని మాకు సర్దింది. అప్పుడే పెద్ద మొత్తంలో వున్న మునసబు గొడ్లు, మేకల గుంపు అటువైపుగా రావడంతో “ఇంకోసారి కలుద్దాం” అంటూ నాన్న వెళ్ళిపోయాడు. నాన్న ఊరు విడిచి వెళ్ళాక రెండు, మూడు సార్లు అడవిలోనే కలిసాడు. నాన్న మాతో లేని రోజులల్లో పక్కవాళ్ళు కూడా మునసబు భయానికి మాతో మాట్లాడేవారు కాదు. మా ఐదుగురితోనే గడిపేది అమ్మ. నాన్న వెళ్ళినప్పటికే ఇంట్లో కొన్ని సోళ్ళు, సామబియ్యం వున్నా, మూడు నెలలకల్లా పూర్తిగా అయిపోయాయి. ఆ తర్వాత అమ్మ నిలువ చేసిన మామిడి, పనస పిక్కలు, వెదురు కొమ్ములు ఉడికించి ఇచ్చేది. నెల తిరక్కుండానే ఇవి కూడా ఐపోయాయి. జావ కావాలని మేము ఏడవని రోజంటూ లేదు. మా ఏడుపు భరించలేక అమ్మ ఒక్కతే అడవికి వెళ్ళి రెండు, మూడు రకాల దుంపలు తెచ్చి మా ఆకలి తీర్చేది. మునసబు భయానికి ఎవరు పనికి పిలిచేవారు కాదు. ఉన్న పొలం వాళ్ళ చేతుల్లోనే. ఏమి చేయలేని పరిస్థితి. అడవిపై ఆధారపడటం తప్ప గత్యంతరం లేకపోయేది. కానీ ఆ ఆరు నెలలు మా కోసం అమ్మ పడ్డ కష్టాలు మాత్రం ఇప్పటికీ గతాన్ని గుర్తు చేస్తాయి. కష్టాలు గుర్తుకొస్తే కడుపులో పేగులు మెలిదిరిగినట్లనిపిస్తుంది.

సరిగ్గా అర్థసంవత్సరం గడిచాక నాన్న నుండి కబురు. వచ్చిన వ్యక్తి అమ్మతో ఏం మాట్లాడాడో తెలియదు కానీ, ఆ సాయంత్రానికి మా ప్రయాణం ప్రారంభమైంది. చీకటి పడే సరికి గొర్కజాల ఊర్లో నాన్న కళ్ళముందున్నాం. ఆ ఊర్లో మొత్తం మా కుటుంబానికే చెందిన వాళ్ళని తాత మాకు చెప్పాడు. అప్పుడు తెలిసింది, మునసబు బెదిరింపులకు పారిపోయిన మా ఏడు కుటుంబాలు ఇక్కడికే చేరుకున్నాయని. అమ్మ, నాన్న, మేము ఐదుగురం. మా బతుకుదెరువు గురించి ఆలోచించిన (మా ఏడు కుటుంబాల వారు) ఊరివాళ్ళు పోడు చేసుకోవడానికి భూమి ఇచ్చారు. తోటి మిత్రులతోపాటు తాతవాళ్ళ గొడ్ల వెనక నేను పోయేదాన్ని. చిన్నాన్నలిద్దరికి పెళ్ళి కాకపోవడంతో ఇంట్లో పెద్ద సమస్యలు వచ్చేవి కావు. అన్ని పనులు అమ్మే చేసేది. అమ్మకు అక్కలిద్దరూ సహకరించేవాళ్ళు. మా అందరికన్నా పెద్దవాడైన అన్న జ్వరం బారిన పడటంతో నాటువైద్యం అందించారు తాతవాళ్ళు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే, చెట్ల మందులు ఇవ్వడమే చూసా. అదే మందులు అన్నకి తాత ఇచ్చాడు. 15 రోజులు తిరక్కముందే

అన్న చనిపోయాడు. అన్న ఒక్కడే కాదంట. ఆ చుట్టు పక్కల గ్రామాల్లో అనేక మంది జ్వరాల బారిన పడి మరణిస్తున్నారంట. “ఈ మరణాలకు కారణం సర్కారు మనపై చూపే నిర్లక్ష్యమే కారణం. ఈ సారి ఓట్లకోసం వచ్చే నాయకులను మన గ్రామాల్లో అడుగు పెట్టనిచ్చేది లేదు” అంటూ తన తోటివాళ్ళతో చెబుతున్నాడు చిన్నాన్న (పాబు). చిన్నన్న మాటలు అర్థం కాలేదు కానీ, కోపంగా అనే మాటలను బట్టి రాజకీయ నాయకులు కూడా మునసబులలాంటి వాళ్ళే అనుకున్న.

చిన్నాన్నకి పార్టీ ఎప్పటి నుండి పరిచయమో తెలియదు గానీ, ఇంటికి రాక వారం రోజులవుతుందని నాన్నమ్మ ఇంట్లో అందరిమీద మండిపడుతున్నది. తెలిసినవాళ్ళందరిని అడిగింది. అయినా ఆయన జాడ తెలుసుకోలేకపోయింది. వారం తిరిగాక తనే ఇంటికొచ్చాడు. ఎక్కడికెల్లాడో ఏమి చెప్పలేదు. సాయంత్రం తీరిగ్గా కూర్చొని ఏదో ఆలోచిస్తున్నాడు. నాన్న పలకరిస్తూనే వెళ్ళాడు చిన్నాన్న దగ్గరికి. మాటలు కలుపుతూ అసలు విషయాన్ని అడిగాడు. నాన్నకు మాత్రం నిజం చెప్పాడు. మనలాంటి ఆదివాసీ, పీడిత ప్రజలకోసం పని చేస్తున్న పార్టీవాళ్ళను కలిసాననీ, ఈ వారం రోజులు వాళ్ళతోనే వున్నానని చెప్పాడు. విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు నాన్న. చిన్నాన్న ఎక్కువ సమయాన్ని పార్టీ వాళ్ళతోనే గుడుపుతున్నాడు. వివిధ గ్రామాలలో వాళ్లు నిర్వహించే మీటింగ్‌లకు వెలుతూ, తన తోటివారిని భాగస్వాముల్ని చేస్తున్నాడు.

చిన్నాన్న వెళ్ళడమే కాకుండా, వాళ్ళను మా ఊళ్లోకి తీసుకొని వచ్చి మీటింగ్‌లు నిర్వహిస్తున్నాడనీ కోప్పడుతుంది నాన్నమ్మ. నాన్న మాత్రం చిన్నాన్నను వెనకేసుకొస్తూ, అమ్మతో “వాడు ప్రజలకు భూములు, హక్కులు దక్కాలనీ, భూస్వాములకు ఎదురు నిలిచి ప్రజలకోసం పోరాడుతున్నాడని” చెప్తున్నాడు. నేను అమ్మ పక్కనే వున్నప్పటికీ ఆ విషయాలేవి నా బుర్రకి తట్టలేదు. చిన్నాన్న పార్టీవాళ్ళు పెట్టిన సంఘంలో కూడా పని చేస్తున్నాడంట. చాలా రోజుల తర్వాత మాకు తెలిసింది. చిన్నాన్న ద్వారా నాన్నకు కూడా పార్టీ పరిచయం అయ్యిందని ఇద్దరు అక్కడే వుంటున్నారనీ, ఇంటిపని, పొలంపని తన వంతయ్యిందని అమ్మ గొడవ అమ్మది. పార్టీ మీటింగ్‌లు, చిన్నాన్న, నాన్న పార్టీలో పని చేయడం...వీటి గురించి ఎవరినైనా అడిగి తెలుసుకుంటే బాగుండని మనస్సులో ఘర్షణ. నాన్ననే అడిగితే బాగుంటుదని నిర్ణయించుకున్న. కాని అడగడానికి భయం. నాన్న పేద ప్రజల కోసం పని చేయడం అమ్మకి ఇష్టంలేక కాదనీ, ఎంతో కొంత ఇంటి పని గురించి కూడా పట్టించుకుంటే బాగుంటుదని అమ్మ బాధంత. అదే

విషయాన్ని నాన్నకి అన్నం పెడుతూ చెప్పింది. అమ్మ అనుకున్నట్లుగానే తనకు పొలం పనుల్లో సహకరిస్తూనే, పార్టీపనిలో చురుగ్గా పాల్గొంటున్నాడు నాన్న. ఊర్లో జరిగే మీటింగ్‌లకు నాన్నతో పాటు, అమ్మ కూడా వెళ్ళడం మొదలపెట్టింది. పార్టీ గురించి ఇంట్లోవాళ్ళు, బయటివాళ్ళు చెప్పుకుంటుంటే నాకు ఈ సారి నాన్నని భయపడకుండా కచ్చితంగా అడగాలని మనస్సులో దృఢంగా నిర్ణయించుకున్న.

ఆకాశంలో చుక్కలు మినుగుమినుగుమంటున్నాయి. నాన్న వాటిని లెక్కపెడుతున్నట్లుగా పగుకొని ఏదో ఆలోచిస్తున్నాడు. మెల్లమెల్లగా నాన్న దగ్గరికి వెళ్ళి కూర్చున్న. 'నాన్న పార్టీ అంటే ఎలా వుంటుంది? అసలు అది ఏం పని చేస్తుంది? నీవు, చిన్నాన్న వాళ్ళ దగ్గరికి ఎందుకు వెలుతున్నారు?' అని వెంటవెంటనే నేనడిగిన ప్రశ్నలకు నవ్వుతూ దగ్గర కూర్చోబెట్టుకొని "మన భూములు గుంజుకొని, మనకు తిప్పలు పెట్టిన, మన ఊరి మునసబ్ లాంటి వాళ్ళకు వ్యతిరేకంగా పార్టీ మనలాంటి పేద ప్రజలను కూడగడ్తుంది. సంఘం పెట్టి మునసబ్‌ల పెత్తనాన్ని దెబ్బతీస్తుంది. సంఘం నాయకత్వంలో మనలాంటి పేదవాళ్ళం మునసబ్‌ల నుండి భూములతో పాటు, అధికారాన్ని కూడా గుంజుకుంటాము. మన గ్రామంలో కూడా పోరాటం చేయాలనుకుంటున్నాము" అంటూ అప్పటికే నాన్న కోసం వచ్చిన వ్యక్తిని తీసుకొని ఊర్లోకి వెళ్ళిపోయాడు.

నాన్న పార్టీవాళ్ళతో ఏం మాట్లాడాడో తెలియదుగానీ, వెంటనే ఇంటికొచ్చి అమ్మతో "మనం పాతఊరు పీల్‌బరికి వెలుతున్నాం. రేపే మన ప్రయాణం. అన్ని సర్దిపెట్టు, ఈ రాత్రికి నేను కలవాల్సిన వ్యక్తులను కలిసొస్తా, ఆలస్యం అవుతది, అన్ని సర్ధి పడుకొండి" అంటూ వెళ్ళిపోయాడు. ఎప్పుడొచ్చి పడుకున్నాడో తెలియదు. ఉదయాన్నే మా మధ్యలో నాన్న. అన్ని సర్ది, సడన్‌గా నాన్న ఎందుకు అలా అన్నాడో ఆలోచిస్తూ కూర్చున్నది అమ్మ. నాన్నమ్మ, తాత వెళ్ళొద్దని బాధపడుతున్నారు. వెళ్ళక తప్పదంటూ వాళ్ళకి సర్దిచెప్పి మమ్మల్ని వెలదాం అన్నట్లుగా కనులు సైగ చేసి, ఒక చేతితో తమ్ముడి చేయి, మరో చేతిలో సంచి పట్టుకొని నాన్న ముందు నడవగ, తన వెనకే మేము అడుగులేసాం. మరుసటి రోజుకల్లా మా గమ్యం చేరాం.

ఆశ్చర్యమేమిటంటే పాతఊరు ముందులా లేదు. పార్టీ ప్రభావమే కారణమని నాన్న అమ్మతో చెబుతున్నాడు. దూసుకుపోతున్నట్లుగా దినాలు గడవడం, అప్పుడే 6 నెల్లయ్యింది. క్రమంగా ఊర్లో పార్టీ పెట్టిన సంఘంలో నాన్న చురుగ్గా పని చేస్తున్నాడు. మా పరిస్థితి గురించి అన్ని విషయాలు తెలిసిన పార్టీ, ప్రజల ఆధ్వర్యంలో మునసబు కుటుంబంతో మాట్లాడి, వారిని

నిలదీసి మా భూమిని మాకిప్పించింది. అయితే ఆ రోజు రాత్రి నాన్న పెద్ద కథే చెప్పాడు మా ఐదుగురికి. ''నారాయణపట్నా బ్లాక్‌లోని అనేకమంది ఎక్కడెక్కడినుండో ఇక్కడికొచ్చిన ఆదివాసేతరులు మన ప్రజల భూములను కబ్జా చేసుకున్నారు. భూములను ఆక్రమించుకున్న వారిలో బ్రాహ్మణులు, కోమట్లు, సుండీలు, డోంబాలు వున్నారు. ప్రధానంగా ఎక్కువ భూములను ఆక్రమించుకున్నవాళ్ళు, మనపై ఆధిపత్యం చెలాయించినవాళ్ళు కోమట్లు, సుండీలు. డోంబుల్లో ఎక్కువ శాతం పేదలే. వీరంతా సారా వ్యాపారాన్ని విచ్చలవిడిగా సాగిస్తూ, అనేక మంది ఆదివాసీ ప్రజలను సారాకి బానిసలుగా చేసి, వాళ్ళ భూములను లాగేసుకున్నారు. మరికొందరు ఆదివాసేతరులు తమ పొలాల్లో, ఇంటిలో మన కుయి ప్రజలచేత వెట్టిచాకిరి చేయించుకున్నారు. అయితే వీరి ఆటలు పార్టీ వచ్చాక సాగలేదు. గత రెండున్నర సంవత్సరాల నుండి పార్టీ ఆధ్వర్యంలో నారాయణపట్నా బ్లాక్‌లోని అన్ని గ్రామాల ప్రజలందరిని ఏకం చేసి, ఛసి మూల్యా సంఘం పెట్టి భూస్వాములకు వ్యతిరేకంగా భూపోరాటాన్ని ప్రారంభించింది. ఈ పోరాటంలో ముఖ్యంగా అనేక మంది ఆదివాసేతర, భూస్వాముల దగ్గర వున్న భూములను, భూమిలేని నిరుపేద, స్థానిక ఆదివాసీ ప్రజలకు పంచింది. అనేక మంది ప్రజా వ్యతిరేకులైన తెగ పెద్దలను ప్రజల్లో పెట్టి, వారికున్న పదుల సంఖ్యల్లో భూమిని స్వయంగా వారే ప్రజలకిచ్చేలా చేసింది. అలా ఇవ్వనివారిని ప్రజలే తిరగబడి, పార్టీ సంఘాల నాయకత్వంలో మునసబుల భూముల్లో ఎర్రజెండాలు పాతారు. పార్టీ తీసుకున్న ఈ క్యాంపెయిన్ ప్రజా శత్రువుల్లో భయం పుట్టించడం, కొందరు ప్రజల తిరుగుబాటుకు సరెండర్ అయ్యి, తమ ఆస్తులను ప్రజలకు అప్పజెప్పడం, మరికొందరైతే ప్రజల పోరాట చైతన్యాన్ని జీర్ణించుకోలేక పారిపోవడం.... మొదలైన అనేక రకాల మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటికీ మన బ్లాక్‌లోని ప్రజలు ఈ క్యాంపెయిన్ కొనసాగిస్తున్నారు. ఎర్రజెండాలు పాతిన భూములలో ప్రజలందరూ సమిష్టి వ్యవసాయం చేసి, పండిన పంటను సమిష్టిగా పంచుకోవాలని పార్టీ నిర్ణయించింది. పార్టీ మన ప్రజల క్షేమం కోరి తీసుకున్న ఈ నిర్ణయం అందరికీ ఆమోదయోగ్యం కావడంతో, ఇప్పుడు సమిష్టి వ్యవసాయ క్షేత్రాల్లో పెద్దలు, పిల్లలు అందరు పాల్గొంటున్నారు. సమిష్టి పనుల్లో మన అందరి బాధ్యత వుంది. మనం కూడా పాల్గొనాలి. అయితే పార్టీ మరో విషయాన్ని గుర్తు చేసింది. పార్టీ ఆధ్వర్యంలో భూములైతే ప్రజల పరం అయ్యాయి కానీ, శత్రువు చాలా బలమైనవాడు కదా! వాడి కాపలా కుక్కలైన పోలీసు బలగాలతో మన ప్రజల్ని చంపి, మన పరం అయ్యాయనుకుంటున్న భూములను వాడు వశపరచుకోవచ్చు. అందుకనే డిసెంబర్ 2వ తారీఖున

జరిగిన పి.ఎల్.జి.ఎ వారోత్సవాల్లో భాగంగా పార్టీ ఓ ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేసింది. అదేమిటంటే 'మనం పెద్దాళ్ళ పెత్తనాన్ని ఎదిరించడం, వ్యాపారుల మోసాన్ని అరికట్టడం, భూస్వాముల నుండి భూములు స్వాధీనపర్చుకోడం వంటివి చేశాం. ఇవన్నీ మంచి పరిణామాలే. సాధించుకున్న భూములను నిలబెట్టుకోవాలంటే మనం తుపాకులు పట్టుకోవాలి. పోలీసులతో లడాయి చేయాలి. అందుకు గెనొబాహిని మిలీషియాలోనూ, దళంలోను చేరాలి. పార్టీ ఇచ్చిన పిలుపుకనుగుణంగా మన పాకెట్ నుండి 30 మందిని పంపాల"ని నాన్న చెప్పిన విషయానికి "మన ఇంట్లో ఎవరు?"అని ప్రశ్నించింది అక్క (నాన). "ఊర్లో అందరు పంపుతామన్నారు కానీ పేర్లు ప్రకటించలేదు నేనైతే సంఘ అధ్యక్షుడిగా నానుండే ప్రారంభించాలనుకున్న. మన ఇంట్లో బుద్రిని పంపాలనుకున్నాం. ఇంట్లో ఎవరికి ఇష్టం లేకున్న తను వెలుతుంది" అని అమ్మ ముఖం చూస్తునే చెప్పాడు నాన్న. "ఇప్పటికే పొద్దు పోయింది పండుకోండి. నాకు మీటింగ్‌కు వెళ్ళాల్సిన అవసరం కూడా ఉంది" అంటూ చిన్నాన్నతో మాట్లాడుకుంటూ గుంపుగా కూర్చున్న ప్రజలదగ్గరికెళ్ళాడు. నాన్న సంఘంలో చేరకముందు ఇలాంటి విషయాలు ఎప్పుడు చెప్పలేదు. 14 సంవత్సరాలు పైబడుతున్న నాకు, మొత్తంగా నాన్న చెప్పిన ఇన్ని విషయాల్లో చాలా మేరకు అర్థమయ్యాయి. ఇంతకు ముందులా మునసబుకు భయపడి దొంగచాటుగా మాతో మాట్లాడేవారందరూ ఇప్పుడు ధైర్యంగా, ఏకంగా మా ఇంటికి వచ్చి తమ సమస్యలను నాన్నతో చెప్పుకుంటున్నారు. పార్టీ పెట్టిన సంఘాలు ఊర్లో చురుగ్గా పని చేస్తున్నాయి. వారి కార్యకలాపాలతో మోడుబారిన చెట్టు తొలకరి వర్షాలకు కొత్త చిగుళ్ళతో తన సౌందర్యాన్ని వెదజల్లుతున్నట్లుగా వుంది ఊరి వాతావరణం. ఈ పనులన్నింటిలో నేనెప్పుడు భాగమవుతానని బాగా కుతూహలంగా వుండేది.

ఊర్లో మీటింగులు పెట్టడంతో పాటు, పాటలు కూడా పాడుతున్నారు. ఆ పాటల శబ్దం వినబడితే చాలు వెంటనే మీటింగ్ స్థలానికి చేరుకునేదాన్ని. కాని మొదటిసారి మాత్రం ఎరుపు, తెలుపు రంగులు కలిసిన వాళ్ళ వస్త్రాధరణ, చేతిలో ఎర్రజెండా, కాళ్ళకి మువ్వలు, డప్పు కొడుతూ వందల మందిలో దరువేస్తూ, పాటలు పాడుతున్నారు. వాళ్ళ వేషాధరణ, పాడే పాటలు వింటుంటే వెళ్ళి వారిపక్కన పాడాలనిపించేది. ఆ విధంగా నాలో పడిన ముద్ర వాళ్ళెప్పుడొచ్చినా నన్ను ఆకర్షించేది. నా వయస్సుగల వాళ్ళందరికీ మా ఊరి పరిసర ప్రాంతంలోకి పార్టీ వచ్చినప్పుడు పాటలు నేర్పించే కార్యక్రమం పెట్టుకొని నేర్పిస్తున్నారు. అలా నేర్చుకున్న పాటలను ఇంట్లోవున్నా, పని చేసినా ఎప్పుడు పాడేదాన్ని. నాన్న నా పాటలు చూసి,

పాడించుకొని మురిసిపోయేవాడు. ఓ రోజు పార్టీవాళ్ళు వచ్చారనే వార్త నాన్నకి కబురొచ్చింది. వెంటనే నేను పాటల కోసం పరుగుతీసా. అప్పటికే పాటలు పాడుతూ పార్టీవాళ్ళు మీటింగ్ ప్రారంభించారు. అందులో నుండి ఒక మహిళా నా దగ్గరికి వచ్చి "మొన్న మేము నేర్పించిన పాట ఇప్పుడు మీటింగ్‌లో పాడతావా" అని అడిగింది. సరేనన్నట్లుగా వెంటనే తల ఊపాను. ప్రజలందరొచ్చారు. మీటింగ్ ఊపందుకుంటుంది. రమ్మన్నట్లుగా చేయితో సైగ చేసింది. తననుసరిస్తూ వెళ్ళి చాలా ఉత్సాహంగా పాట పాడాను. మీటింగ్ అయిపోయిన తర్వాత నేను ఇంటికి వెలుతున్న క్రమంలో నా వెనకాలే ఎప్పుడొచ్చిందో తెలియదు. భుజం తట్టి "లాల్‌సలామ్ కామ్రేడ్ బుద్రి చాలా ధైర్యంగా పాడావు తెలుసా, మరీ మనకు పాటలు పాడే సంఘం జి.ఎన్.ఎస్ (గొనొ నాట్య సంఘ్)లో చేరతావా" అంది. అంటే అని అడిగా "జి.ఎన్.ఎస్ అంటే 'గొనొ నాట్య సంఘ్'. పాటల ద్వారా ప్రజలను ఐక్యం చేసి, మన పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవారెవరికైనా సరైన బుద్ధి చెబుతుంది. అంతే కాకుండా నీకిష్టమైన పాటలు నేర్చుకోవచ్చు, పాడొచ్చు, మళ్ళీ మనం కలిసే వరకు ఆలోచించు, వెళ్ళొస్తాం బుద్రి" అంటూ చేతిలో వున్న తుపాకిని భుజానికి తగిలించుకొని, చేయి కలిపి మరోసారి లాల్‌సలామ్' అని చెప్పి వెళ్ళిపోయింది. నవ్వుతూ ప్రేమగా తను మాట్లాడిన విషయం, ఆప్యాయంగా చేయి కలిపి లాల్‌సలామ్ అని చెప్పిన కొత్త మాట మళ్ళీ మళ్ళీ నాకు గుర్తొస్తున్నాయి. సరిగ్గా పదిరోజుల తర్వాత వచ్చిన తనకి మొదట కలవగానే 'నేను పాటల సంఘంలో చేరతాను' అని మనసులో వున్న మాటను తనకు చెప్పా. ఆ రోజు నుండి నా సంతోషం రెట్టింపయింది. విషయం నాన్నకి చెప్పా. "చేరగానే సరిపోదు మరి, వాళ్ళలాగే బాగా నేర్చుకొని పాడాలి" నా నవ్వుతోనే సరేనన్నట్లుగా సమాధానమిచ్చా. వాకిట్లో గొడ్ల పేడ తీస్తున్న అమ్మకి మాత్రం బాగా కోపం వచ్చింది. ఇప్పటికే నాన్న సంఘంలో పని చేయడం, చిన్నాన్న పార్టీ పనులతో ఇంటిని అసలే పట్టించుకోకపోవడం, అక్క, నాన్నతో మీటింగ్‌లకి వెళ్ళడం, మరో చిన్నాన్న మిలీషియా పనుల్లో పాల్గొనడం, ఇప్పుడు మళ్ళీ నేను జి.ఎన్.ఎస్.... ఒక్కసారిగా నాన్నపైకి సింహంలా గర్జించినట్లే అరిచింది. "నా పిల్లల్ని నాకు దూరం చేస్తున్నావ్" అని ఏడ్చింది. అమ్మ మాటలకు, ఏడుపుకు నాన్న ఏం సమాధానం చెప్పలేదు. అందరం ఇంటివెనక వున్న కూరగాయల తోట దగ్గరకి చేరుకున్నాం. నాన్న పాట పాడమన్నాడు. నేను ప్రారంభించా. అక్కలు, నాన్న, తమ్ముడు కోరస్ ఇస్తున్నారు. పేడ చేతులతోనే మా దగ్గరకొచ్చి కోరస్ కలిపింది అమ్మ. నాన్న కళ్ళ సైగతోనే మమ్మల్ని అమ్మ వైపు చూడమన్నాడు. ఒక్కసారిగా తోటంతా మా నవ్వులతో దద్దరిల్లింది.

జి.ఎస్.ఎస్‌లో చేరాక ఆ టీంతో మా ఊరేకాక, మా పాకెట్ గ్రామాలన్నింటిలో తిరుగుతూ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయితే 'గ్రామ మిలీషియా' పాకెట్‌లో చాలా బలంగా పని చేస్తుంది. దానికి కమాండర్ కా॥ పూర్ణో. మిలీషియా, జి.ఎన్.ఎస్ కలిసి అనేక మీటింగ్‌లు నిర్వహిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇలా కొనసాగుతున్న క్రమంలో ఒక రోజు మీటింగ్ ముగియగానే "బుద్రి నీతో మాట్లాడాలి రేపు మీటింగ్ ముగిసాక కూర్చుందాం" అన్నాడు కా॥ పూర్ణో. అనుకునట్లుగానే పక్క గ్రామంలో మీటింగ్ ముగిసాక కూర్చున్నాం. "జి.ఎస్.ఎస్‌లో పని చేస్తూనే, మిలీషియా కార్యక్రమాల్లో భాగమైతే బాగుంటుంది. మన పాకెట్‌లోని చుట్టపక్కల గ్రామాల్లో పార్టీ చేపట్టిన విప్లవ సంస్కరణల్లో భాగంగా భూస్వాముల నుండి స్వాధీనం చేసుకున్న భూములను చదును చేసే కార్యక్రమంలో, సమిష్టి వ్యవసాయంలో... మొదలైన వాటిలో మనవంతు పాత్ర బాధ్యతగా నిర్వహించాల్సి వుంటుంది. వీటిలో పాల్గొంటే నీకు కూడా మంచి అనుభవం వస్తుంది ఆలోచించు, ఇది నా మాట కాదు పార్టీ చెప్పిన మాట. మేము దళాన్ని కలిసే పనుంది చాలా దూరం నడవాలి, మళ్ళీ కలుద్దాం" అని చేతులు కలిపి వెళ్ళిపోయాడు.

పై విషయాలన్నీ పూర్ణో చెప్పడమే కాదు, నేను జి.ఎన్.ఎస్‌లో చేరినప్పటినుండీ "పాటలు పాడటమే కాదు, పార్టీ చేపట్టే పనుల్లో భాగమవ్వాల"ని చాలా సార్లు నాన్న అన్నాడు. ఆ మరుసటి రోజు నుండే మిలీషియా కామ్రేడ్స్‌తో కలిసి వెళ్ళడం ప్రారంభించా. మిలీషియా భాగమయ్యే ప్రజల పొలం పనులు, గ్రామాల్లో పరిశుభ్రత కార్యకలాపాలలో పాల్గొంటున్నా. ఈ పనులేకాక భూపోరాటంలో సాధించుకున్న భూముల్లో భూమి చదును కార్యక్రమాల్లో పాల్గొనడానికి పాకెట్ మిలీషియా నుండి 50 మందిమి పాల్గొన్నాం. మేము కాకుండా ఛసి మూల్య సంఘం, మహిళా సంఘం కార్యకర్తలు, ప్రజలు, పిల్లలు, వృద్ధులు అందరు 200 మంది వరకు పాల్గొన్నారు. ఇంత మందికి భోజనాలు ప్రజలే బాధ్యతపడి వండిపెట్టారు. ఓ రోజు మధ్యాహ్నం భోజనాలు ముగించుకొని నడుం వాల్చాం. భూపోరాటం గురించిన వివరాలు చెబుతోంది మహిళా సంఘం అధ్యక్షురాలు. ఆ విషయాలను వివరిస్తూ "పార్టీ ఆధ్వర్యంలో పెద్ద 'మనోబల్' సభ జరిగింది. ఆ సభకు వేలమంది ప్రజలు హాజరయ్యారు. ఆ సభలో మన నేతలు భూఆక్రమణకు పిలుపునిచ్చారు. ఈ పిలుపునందుకొని వేలాది మంది ప్రజలు కామ్రేడ్ సింగన్న నాయకత్వంలో ఆదివాసేతర, భూస్వాముల, పెత్తందార్ల, ప్రజావ్యతిరేకులైన తెగపెద్దల భూములపై ఉప్పెనలా విరుచుకుపడ్డారు. ఈ ప్రజా దాడితో వాళ్ళంతా భూములనూ, ఇళ్ళను

వదిలి పారిపోయారు. దీంతో భూపోరాటాన్ని అణచివేయడం కోసం ప్రభుత్వం శాంతి కమిటీని ఏర్పాటు చేసింది. ఇది దండకారణ్యంలో కుఖ్యాతిగాంచిన సల్వాజుడుం వంటిది. దీనిలో ప్రజా వ్యతిరేకులైన రాజకీయ నాయకులు, భూస్వాములు, పెత్తందార్లు, రౌడిమూకలు చేరాయి. ఈ ప్రజావ్యతిరేక రౌడిమూకలను కూడా సింగన్న నేతృత్వంలో గెనొబాహిని మిలీషియా సాహసంగా ఎదుర్కొన్నది. కొంత మందిని మట్టు పెట్టింది. పోరాటం ఉధృతమయ్యేసరికి ప్రభుత్వం, పోలీసులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో డుంబగూడ గ్రామంపై ప్రభుత్వ సాయుధ పోలీసులు, పెత్తందార్లు దాడి చేసి, ఆ ఊరిని వల్లకాడులా మార్చేసారు. ఊరి మహిళను పోలీసులు అత్యాచారం చేశారు. గ్రామస్తులు అడ్డుకోవడానికి వెలితే వారిని కొట్టి గాయపర్చారు. లాభం లేదని తెలుసుకున్న ప్రజలు కొమ్ము ఊదడంతో సింగన్నతో సహా, 500 మంది ప్రజలు గుమ్మిగూడారు. గత కొంత కాలంగా గ్రామాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, అదేరోజు సింగన్న ఆధ్వర్యంలో గుమ్మిగూడిన జనమంతా నారాయణపట్నా పోలీస్టేషన్‌ను చుట్టుముట్టారు. "మా గ్రామాలపై దాడులు చేయడానికి గల కారణమేంట"ని నిలదీసారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజల తిరుగుబాటుకు ఖంగుతిన్న పోలీసులు, వెంటనే ఎటువంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ధైర్యశాలి, ప్రజా నాయకుడు కామ్రేడ్ సింగన్న అమరుడయ్యాడు. ఇతనితోపాటు ఛసి మూల్యా సంఘం కార్యకర్త ఆంధ్రు కూడా నేలకొరిగాడు. మొత్తం 19 మంది ఈ ఘటనలో గాయపడ్డారు. అప్పుడు పార్టీ నాయకత్వంలో సింగన్నతో కలిసి ఈ భూముల కోసం ఎంత పోరాడమో వాళ్ళ జ్ఞాపకాలు మరువలేనివి" అంటూ కన్నీరు పెట్టుకుంది. "కామ్రేడ్స్ సమయం రెండున్నర, పనిలోకి వెళ్ళాలి" అంటూ పూర్ణో నుండి మాటలు. వెళ్ళి పని చేస్తుంటే తను చెప్పిన విషయాలే నా కళ్ళముందు తిరుగుతున్నాయి. సింగన్న గురించి ప్రజలు కథలు కథలుగా చెప్పుకొంటుంటే విన్నా, ఆయనకు తుపాకీ తూటాలు తగలవని చెప్పుకొనేవాళ్ళు. ఒకటి రెండుసార్లు చూసా. కానీ, అతని గురించి లోతుగా తెలుసుకోవడం తన ద్వారానే. ప్రజల కోసం పని చేసే పార్టీ, పార్టీ నాయకత్వంలో ప్రజానాయకులు, ఎంతో మంది ప్రజలు ఈ భూములకోసం తమ ప్రాణాలర్పించారు. అలాంటి భూముల్లో పని చేయడం నాకు చాలా గర్వంగా అనిపించింది.

మిలీషియాను కలవడానికి పార్టీ కామ్రేడ్స్ జైరాం, మున్నా దాదాలు తరచు వచ్చిపోయేవారు. మిలీషియా నిర్వహించాల్సిన కార్యక్రమాలను ఏ విధంగా చేపట్టాలనే విషయాలు వివరించేవారు. అయితే మిలీషియాకి మిలటరీ ట్రైనింగ్ ఇవ్వాలనీ, అందుకోసం కమాండర్ పూర్ణోని కలిసి

సరైన తేది కరారు చేశారు. ఈ విషయాన్ని నాన్నతో కబురు పెట్టాడు మా కమాండర్. నాన్న నాకు, అక్కకు విషయం చెప్పాడు. అయితే నాకన్న ముందే అక్క మిలీషయాలో పని చేసేది. ఈ విషయాన్ని విన్న అక్క నేను కచ్చితంగా వెళతానని చెప్పింది. అందుకు సరేనన్నాడు నాన్న. ఆ సమయానికి నేను మలేరియా జ్వరంతో బాధపడుతున్నాను. అందువలన నాకు వెళ్ళాలనే ఇష్టం వున్నప్పటికీ, నాన్న కూడా ఒప్పుకోలేదు. అమ్మకు చెప్పకుండా అక్క ఎప్పుడెళ్ళిందో అర్థం కాలేదు. ఇంట్లో మళ్ళీ అమ్మ, నాన్నలకి గొడవ. ఏరియాలోని మొత్తం 40 మంది ట్రైనింగ్‌కి వెళ్ళారని నాన్న ఎవరితోనో చెబుతుంటే విన్న. ఏడుపాగలేదు, జ్వరం ఎందుకొచ్చిందా! అని నాపై నాకే కోపం వచ్చింది. సరిగ్గా 12 రోజులకు ఇంటికి చేరుకుంది అక్క. నన్ను పంపలేదనే కోపంలో అక్కతో మాట్లాడకపోయేసరికి తానే దగ్గరకొచ్చి, కలగజేసుకొని పదిరోజుల విషయాలు చెప్పడం ప్రారంభించింది. "పార్టీ పద్ధతులు నాకు బాగా నచ్చాయి తెలుసా! ఉదయాన్నే 4గం॥లకు లేచి కాలకృత్యాలు ముగించుకొని, పాంట్, షర్ట్ వేసుకొని 5గం॥లకు గ్రౌండ్‌లో రోల్‌కాల్‌కి హాజరవ్వాలి. అక్కడ వివిధ సెక్షన్‌లుగా 10 మంది చొప్పున విభజిస్తారు. రోల్‌కాల్‌లో ఆ రోజుకు సంబంధించిన డ్రిల్స్ గురించి చెప్తారు. తర్వాత ట్రైనింగ్ ఇచ్చే కామ్రేడ్స్ మున్నా, జైరాంలు ఎక్సర్‌సైజ్‌లతో ప్రారంభిస్తారు. వాళ్ళిద్దరిని యూనిఫాం, బూట్లు, టోపి, వెపన్స్‌తో చూసేసరికి మన మిలీషియా అందరం యూనిఫాం, వెపన్స్.... ఎప్పుడేసుకుంటామోనని బలే ముచ్చటపడేవాళ్ళం. శారీరక ధారుడ్యాన్ని పెంచే విన్యాసాలతో పాటు, శతృవును దెబ్బతీయడానికి సంబంధించిన డ్రిల్స్ నేర్పించారు. సాయుధ శతృవును దెబ్బతీయడం కోసం బూబీట్రాప్స్ పెట్టడం, మైన్స్ పేల్చడం... వంటి అనేక రకాలైన మిలటరీ టెక్నిక్‌లు చెప్పారు. ఇక సమయపాలన, క్రమశిక్షణ నియమాలు ప్రతిఒక్కరు అమలు చేయాల్సిందే. పార్టీ కామ్రేడ్స్‌తో కలిసుండటం, గ్రౌండ్‌కి వెళ్ళడం...పది రోజులు తొందరగా గడిచిపోయాయి. మరోసారి అవకాశం వస్తే కలిసివెళదాం సరేనా" అంటూ కోపంగా వున్న అమ్మ దగ్గరకి వెళ్ళిపోయింది. నేను ఎంతో మిస్సాయానని బాధేసింది.

మిలటరీ క్యాంపు జరిగిన నెల రోజుల తర్వాత మిలిషియాతో మాట్లాడటానికి కామ్రేడ్ మున్నాదాదా గ్రామ పరిసరప్రాంతంలోకి వచ్చాడు. 30 మంది వరకు సమావేశమయ్యాం. మాకు ప్రోగ్రాం చెప్పిన తర్వాత దేవమాలి కొండలకు సంబంధించిన కరపత్రం చదివాడు. దాన్ని వివరిస్తూ "మాలి, దేవమాలి పర్వతాలను బహుళజాతి కంపెనీలైన నాల్కో, ఇండాల్కో కంపనీలు కబలించదలచుకున్నాయి. ఈ పర్వత శ్రేణులు కోరాపుట్ జిల్లా, పొట్టంగి బ్లాక్‌లోని

కొటియా, తురియా, కంటి పంచాయితీలలో 17 కి.మీ వైశాల్యంతో విస్తరించి వున్నాయి. సముద్ర మట్టానికి 4,385 అడుగుల ఎత్తున దేవమాలి పర్వత శ్రేణులు ఒడిశా రాష్ట్రంలోనే ఎత్తుయినవి. ఈ పర్వతాల గర్భంలో 3,000 లక్షల టన్నుల బాక్సైట్ నిల్వలున్నట్లు శాస్త్రవేత్తల అంచనా. వీటిని కొల్లగొట్టడానికి 15 సం॥లకుగాను ఇండాల్కో కంపెనీ లీజుకు తీసుకుంది. అయితే ఈ పర్వత శ్రేణులపై 22 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో 10 వేలకు పైగా ప్రజలు జీవిస్తున్నారు. ఇందులో అత్యధిక మెజారిటీ ప్రజలు మన ఆదివాసీలే. తమ బతుకుదెరువు కోసం ఈ కొండలపైనే ఆధారపడుతున్నారు. అక్కడున్న గ్రామ ప్రజలను ఖాళీ చేయాల్సిందిగా నవీన్‌పట్నాయక్ సర్కార్ నోటీసులు జారీ చేసింది. ఇక్కడ తవ్వకాలు మొదలుపెడితే పెద్ద మొత్తంలో మన ప్రజలు విస్తాపితులు అవ్వడం ఒకటైతే, పెద్దఎత్తున పర్యావరణ కాలుష్యం జరిగి, చుట్టుపక్కల అనేక గ్రామాలపై దీని ప్రభావం పడుతుంది. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఇప్పుడు మనకు ఈ సమస్య జీవన్మరణ సమస్యగా మారింది. గతంలో ఆదివాసీ ఛసి మూల్య సంఘం 12,000 మంది ప్రజలతో బహిరంగ సభను జరిపి, పోరాటానికి పిలుపునిచ్చింది. అప్పుడు మన ప్రజలందరూ పెద్దమొత్తంలో కదిలారు" అంటూ తను మట్లాడటం పూర్తి కాకముందే 'నాల్కో కంపెనీలో ఏం తయారవుతుంది?' అని ప్రశ్నించాను. అందుకు సమాధానంగా మాట్లాడుతూ "దామన్‌జోడి పట్టణానికి 16 కి.మీ దూరంలో నాల్కో కంపెనీ ఉంటుంది. ఇది కోరాపుట్ బ్లాక్‌లోని మతలపుట్ పంచాయితీ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ బాక్సైట్ గనులు వున్నాయి. ఇక్కడ నుండి బాక్సైట్‌ను నాల్కో కంపెనీకి తరలించి, అక్కడ శుద్ధి చేసి, ఫౌడర్ రూపంలోకి మార్చి ఎగుమతి చేస్తారు. ఈ కంపెనీ గనులు ఇక్కడి స్థానికుల మీద వేసిన, వేస్తున్న ప్రభావం అంత ఇంతకాదు... సరే కామ్రేడ్స్ ఆలస్యమవుతుంది. దీని గురించి మరింత లోతుగా మరోసారి కలిసినప్పుడు మ్యాప్ చూపుతూ మాట్లాడుకుందాం" అంటూ ఆ రాత్రి మా నుండి సెలవు తీసుకున్నాడు. దేవమాలి పర్వతాలు, ఇండాల్కో కంపెనీలు వున్నవి అని మాత్రమే తెలుసు. కానీ వాటి గురించి సరైన వివరాలు మాత్రం మున్నాదాదా చెప్పిన తర్వాతే అర్థమయ్యాయి. ఆ కొండల చుట్టుపక్కల వున్న ప్రజల పరిస్థితి గురించి అర్థం చేసుకోగలిగాను కానీ, పర్యావరణం వల్ల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్న విషయాలు అంతగా నా మెదడు ఆలోచించలేకపోయింది. ఈ సారి వచ్చినప్పుడు నేనే స్వయంగా కొన్ని విషయాల గురించి అడిగి తెలుసుకుంటానని మనసులో అనుకున్న. మున్నాదాదవాళ్ళతోనే పార్టీలో వుండిపోతే ఇలాంటి దోపిడీ కంపెనీల

గురించి, ముఖ్యంగా వీటివల్ల గరీబ్ జనతా ఎదుర్కొంటున్న సమస్యల గురించి, రోజురోజుకు బయటి సమాజంలో జరుగుతున్న మార్పుల గురించి.... ఇంకా ఎన్నో, ఎన్నెన్నో విషయాల గురించి తెలుసుకోవచ్చని నాలో నాకే సంతోషం కలిగింది.

అప్పుడే మిలీషియాలో పని చేసి సంవత్సరం గడిచిపోయింది. పార్టీ నుండి పిలుపు రానే వచ్చింది. కమాండర్ పూర్ణో నాన్నకి చెప్పడం, నాన్న ఇంట్లో అమ్మతో చెప్పడం, అమ్మ గొడవ చేయడం ఒక్క రోజులో జరిగిపోయాయి. "నేను బుద్రిని పార్టీకి పంపడానికి గట్టిగా నిర్ణయించుకున్న. నీవు కూడా ఆ విధంగా ఆలోచిస్తే బాగుంటుంది. ఎప్పుడు మన గురించే తప్ప మనలాంటి ప్రజలకోసం పని చేసే పార్టీ గురించి ఆలోచించవా?" అంటూ కోపంగానే అమ్మకు సమాధానమిచ్చాడు నాన్న. "నాకు పార్టీపై కోపం ఏమి లేదు. మిలీషియాలో పని చేస్తుంది కదా! అది సరిపోతదని నా ఉద్ధేశం" అమ్మ నుండి నిదానంగా మాటలు. మరుసటిరోజే తెలిసిన బంధువుల దగ్గరకు వెళ్ళిన నన్ను మా అత్తవాళ్ళు ఎత్తుకుపోయారు. విషయం ఇంట్లో తెలియదు. పార్టీ పనుల్లో ఉన్నాననుకున్నారు ఇంటివాళ్ళు. వారం గడిచాక అక్కడినుండి పారిపోయి ఇంటికొచ్చా. ఇలా రెండు, మూడుసార్లు జరిగాక నాన్న సీరియస్‌గానే అత్తవాళ్ళతో గొడవపడ్డాడు. మరోసారి ఇలా జరిగితే పరిణామాలు సీరియస్‌గా వుంటాయని హెచ్చరించాడు. తెల్లవారే ఊర్లో మీటింగ్ అని నాన్న నాతో అన్నాడు. నాకు అర్థం కాలేదు. రిక్రూట్ అయ్యే మిలీషియా వాళ్ళకు మీటింగ్‌కు రావాలని కబురు పెట్టాడు కమాండర్ పూర్ణో. 12గం॥ సమయానికి అందరం అక్కడకి చేరుకున్నాం. ప్రజల సమక్షంలో మమ్మల్ని మాట్లాడించారు. ఆయా కామ్రేడ్స్‌కి సంబంధించిన తల్లిదండ్రులు కూడా మాట్లాడారు. అమ్మకి విషయం తెలియదు. నా తరపున నాన్న మాట్లాడుతూ "పార్టీ అంటే ప్రజలు, ప్రజలు అంటే పార్టీ. ఎవరికి ద్రోహం చేసినా ప్రజా ద్రోహులుగా మిగులుతారు. సరెండర్ అవడం, పారిపోవడం వంటివి చేస్తే ఇదే ప్రజల ముందు మీకు శిక్ష తప్పదు. జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ కోసం మీరు తీసుకున్న ఈ నిర్ణయానికి చివరి ఊపిరి వరకు కట్టుబడి వుండాలి. శత్రు చేతికి చిక్కినగాని పార్టీ రహస్యాన్ని కాపాడాలి. చిత్రహింతలు పెట్టినా శత్రువుకు లొంగకూడదు. మీ చివరి రక్తపు బొట్టు కూడా ఈ పీడిత ప్రజలకు ఉపయోగపడాలి" అంటూ ముగించాడు నాన్న. అబ్బో నాన్న మాట్లాడిన మాటల్లో పెద్ద అర్థమే దాగి వుంది. అందుకు అందరం పంచాయితీ ప్రజలందరి ముందు పార్టీకి ద్రోహం చేయమని ఒప్పుకున్నాం. ప్రజలందరూ మా పంచాయితీలోని 30 మందికి లాల్‌సలామ్ చెబుతూ ఆనంద బాష్పాలతో చాలా గర్వపడుతూ పిడికిళ్ళెతారు.

మధ్యాహ్న సయమం. అప్పటివరకు కురిసిన కుండపోత వర్షం ఆగిపోవడంతో, నిశబ్దం సంతరించుకుంది. అప్పటికే కురిసిన వర్షాలతో చిగురిస్తున్న ఆకులు, వర్షపు చినుకులతో మెరుస్తున్నాయి. గుంపులు గుంపులుగా పక్షులు నింగిలో విహరిస్తున్నాయి. పార్టీ ఆధ్వర్యంలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న భూముల్లో, ఎర్రజెండాలు స్వేచ్ఛగా ఎగురుతున్నాయి. తిరిగి వెళ్ళాల్సిన ఊరివాళ్ళ నడక ఆగింది. పక్కకి తల తిప్పగానే నాన్న. చివరిసారిగా అన్నట్లు లాల్‌సలామ్ చెప్పా. "పేద పీడిత ప్రజల విముక్తి కోసం ఊపిరున్నంత వరకు ప్రజల పక్షానే నిలబడతా"నని ప్రజల ముందు చేసిన వాగ్దానం, నాన్న చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. అప్పటికే అటువైపొచ్చిన దళం మా కోసం ఎదురు చూస్తోంది, వెళ్ళే సమయం అయ్యిందన్నట్లు. మున్నాదాద దళం నుండి లిప్తపాటి చూపు. వెంటనే నాన్నిచ్చిన కేప్ తుపాకీ భూజాన వేసుకొని, మాలి కొండలవైపు కదులుతున్న దళంలో కలిసిపోయా.



దండకారణ్య బాలల సంఘం

# 5

అప్పుడప్పుడే ఊహ తెలుస్తున్న నాకు, నేను మేపే గొర్లతో అనుబంధం బాగా పెరిగిందని అర్థమవుతున్నది. గొర్ల కాపుకు ఇంట్లోవాళ్ళు చెబితే గానీ వెళ్ళేదాన్నికాదు. ఇప్పుడు మాత్రం పొద్దుఎక్కగానే నా పనులన్నీ ముగించుకొని, గొర్లను తోలుకుపోవడంలో నా తోటివాళ్ళలో నేనే ముందుంటున్న. ఎప్పుడూ ఆలస్యంగా వచ్చే నన్ను చూసి, నా తోటివాళ్ళు ఆటపట్టించేవాళ్ళు. ఇప్పుడు మాత్రం ఆశ్చర్యంగా చూస్తున్నారు. వాళ్ళ చూపులకు అర్థం నేను గమనించా. ఆ మరుసటి రోజు చెల్లికి బాగా జ్వరం. 10 రోజులు ఇంటిదగ్గరే ఉండాల్సివచ్చింది. గొర్లను ఇంటికి కూడా తేవడం లేదు. ఈ క్రమంలో ఇంట్లో వున్న కోళ్ళు, మల్లుపిట్టలు (నెమలిపిల్లలు), వారం రోజులముందు పుట్టిన మేక పిల్లలతో స్నేహం ఏర్పడింది. 10 రోజులు పది సంవత్సరాలుగా గడిచాయి. గొర్లను, తోటివాళ్ళను చూడాలనే ఆశ ఎక్కువైంది. ఆ తెల్లవారు కాపుకు వెళ్ళమని అమ్మ నోటి నుండి మాట రావడమే ఆలస్యం, ఇన్ని రోజులు బందీగా వున్న ఇంట్లో నుంచి గంతులేస్తూ పరుగెత్తా. అందరికన్నా ముందుగానే గొర్లతో కొండను చేరుకున్నా. తోటివాళ్ళు మాత్రం కొంత ఆలస్యంగా వచ్చారు. పూలే వచ్చినప్పటి నుండి దిగులుగా వుండటంతోపాటు, ఏమి మాట్లాడటం లేదు. కారణం అడిగా. “మన గుర్రం కాలుకి సీసం గుచ్చుకుని బాగా గాయమైంది” అని ఏడుస్తున్నట్లే చెప్పింది పూలే. క్షణ కాలంలో నా సంతోషమంతా ఆవిరైపోయింది. సాయంత్రానికి మేమే కాదు, దాని గాయాన్ని చూసి ఊరంతా బాధపడ్డారు. ప్రతిరోజు ఎవరో ఒకరు దానికి చెట్ల మందులతో కట్టుకడుతున్నారు. పూర్తిగా తగ్గడానికి 12 రోజులు పట్టింది. దాని గాయం నయమయ్యాక రంగులతో అలంకరించి, ఊరంతా తిప్పుతూ ‘డాకా’ (ఆదివాసీలు చేసే నృత్యం)తో సందడి చేశాం. అప్పుడప్పుడు పెద్దచెల్లి కోసం స్కూలుకి వెళ్ళి చూసి వస్తున్నా. నాకిష్టమైనప్పుడు నేనే వెళ్ళి మాస్టర్‌వాళ్ళని అడిగి కాసేపు చదువుకుంటున్నా. అయితే మాస్టర్లు రాని రోజులే ఎక్కువ కావడంతో అదే అదునుగా ఆడుకునేవాళ్ళం.

పొద్దుపోయాక పిల్లలందరం ఊరి మధ్యలో ఆడుకుంటుంటే నాకు మాత్రం వెళ్ళాలనిపించలేదు. ఎందుకంటే వెళ్ళిన ప్రతిసారి ఎవరో ఒకరు నేను బాధపడేలా మాట్లాడేవారు. “అది మీ ఇల్లు కాదు, వాళ్ళు మీ అమ్మ, నాన్న కారు” అనేవాళ్ళు. కొన్నిసార్లు ఆటలోకి

రానివ్వకుండా పక్కకుపెట్టేవాళ్ళు. రోజులు గడుస్తున్న కొద్దీ వీళ్ళు నా వాళ్ళు కాదనీ, నేను మేపే గొడ్లు కూడా నావి కావని... ఈ విషయాలన్నీ నా మనస్సును మరింత వేదనకు గురిచేస్తున్నాయి. వీటికి తోడు ఇంట్లో కూడా తేడా గమనించసాగాను. చెల్లివాళ్ళను, నన్ను చూడటంలో బాగా ఆ తేడా కనిపించింది. తినే తిండిలో, కట్టే బట్టలో వ్యత్యాసం. గొడ్ల వెనక వెళ్ళినా కూడా ఈ విషయాలన్నీ వెంబడిస్తున్నాయి. రానన్నా బలవంతంగా ఓసారి ఆడుకోవడానికి తీసుకెళ్ళింది పూలే. నా రాకను గమనించిన మిత్రులు కొందరు జట్టుగా ఏకమై "రావద్దని నీకు ఎన్నిసార్లు చెప్పినా అర్థంకాదా! ఆటలో నీవైనా వుండాలి, మేమైనా వుండాలి" అంటూ కోపంగా మాట్లాడుతుంటే ఒక్క నిమిషం అక్కడ నిలబడలేదు. ఇంటికెళ్ళా, కోళ్ళగూడు దగ్గర ఏడుస్తూ కూర్చొని ఎప్పుడు నిద్రపోయానో, తెల్లావారాక నాపైనుండి కోళ్ళు పరుగెత్తగానే మేల్కొన్నా. ఏం పని చేయలేదు, గొడ్లను తీసుకెళ్ళే సమయం అవుతుంది. అలాగే కూర్చుండిపోయా. ఈ రోజు ఎలాగైనా నా గురించి తెలుసుకోవాల్సిందే అని నిర్ణయించుకున్న. అప్పటికీ 3, 4 సార్లు నా ముందు నుండి తిరుగుతూ "ఏం, పనిలోకి వెల్లడం లేదు, గొడ్లకాపుకు టైం అవుతుంది, తొందరగా వెళ్ళు" అని వారు చెప్పాల్సింది చెబుతూ వెలుతున్నారు. నన్ను మాత్రం సమాధానం అడగటం లేదు. నేను ఏం మాట్లాడలేదు. అమ్మ, నాన్న పనుల్లోకి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. ఎక్కడ పడుకున్నానో అక్కడ నుండి లేచా. వెలుతున్న వాళ్ళకు దగ్గరగా వెళ్ళా. వారి నడక ఆగింది. మాట్లాడటం ప్రారంభించా. 'నేను మీ బిడ్డను కానా, అసలు నేను ఎవరిని? ఊర్లో పిల్లలందరూ నన్నెందుకు మీ బిడ్డ కాదంటున్నారు?' నాకు చెప్పాకే వెళ్ళాలని మొండికేసా. నాన్న నోరు విప్పాడు. "నీకప్పుడు 2 సంవత్సరాలు. పక్కనే వున్న పై విధి మీది. మీ అమ్మ, నాన్న దూరపు బంధువులవుతారు. మాకు పనుల్లో సహకారంగా వుంటావనీ, చిన్నతనంలో అయితే ఇంటివాళ్ళను గుర్తుపెట్టుకోవనీ, నీకు ఊహ తెలియనప్పుడు మీ అమ్మ, నాన్నకు ధాన్యం ఇచ్చి తెచ్చుకున్నాం" అంటూ ముగించాడు. ఇక నాకు అక్కడ ఉండాలనిపించలేదు. 3, 4 అడుగులు వేసానో లేదో చిన్న చెల్లి అప్పుడప్పుడే వేస్తున్న అడుగులతో ఏడుస్తూ ముందుకు రాసాగింది. వెంటనే తనను తీసుకుంది అమ్మ.

ఏడుస్తూ ఊర్లో నడుస్తున్న. నన్ను గుర్తించిన ఓ ముసలాయన మా ఇంటికి తీసుకెళ్ళాడు. ఇంటి ముందు ఉన్న అమ్మను చూపిస్తూ వెనుదిరిగాడు. ఆందోళనతో నా దగ్గరకు వచ్చి వాటేసుకోవడంతో తనే అమ్మ అని అర్థమైంది. ఆకలితో ఎదురుచూస్తున్న నా కడుపుకు అన్నం పెట్టింది. "అక్కడ ఏమైన తప్పు పని చేశావా, వాళ్ళేమైన కొట్టారా" అని ప్రశ్నించింది అమ్మ. అన్నింటికి సమాధానం లేదనే చెప్పా. కాసేపు నన్ను ఒంటరిగా వదిలేసింది. సూర్యుడు అస్తమిమించే సమయానికి ఇంట్లో 5 మంది కనబడేసరికి నాకేం అర్థం కాలేదు. ఇద్దరు చెల్లెళ్ళు,

అక్క, అన్న, నాన్న అని అమ్మ నాకు పరిచయం చేసింది. ఇంట్లోవాళ్ళందరూ నాకు కొత్తగా అనిపిస్తున్నారు కానీ, వాళ్ళకు నేను ముందే పరిచయమని అక్క నాతో అంది. వాళ్ళంతా తరచు నన్ను చూసేవాళ్ళంట. తెల్లవారి అక్కతో కాసేపు ముచ్చడించా. 'అక్కా, మనది పై విధీ అంటున్నారు కదా! మన ఊరుపేరే పైవీధి అంటారా?' అని నేనడిగిన ప్రశ్నకు "మన ఊరు పేరు కొర్రూబు, బొడిగట్ట పంచాయితీ, కలిమెల బ్లాక్, మల్కనగిరి జిల్లా" అని చెప్పింది. ఆ తర్వాత నాకు గుర్తున్నది ఊరు పేరు మాత్రమే. అలా రోజులు గడిచిపోతున్నాయి. జ్ఞాపకాలు మాత్రం నా బుర్రలో తిరుగుతున్నాయి. గొడ్లు, చెల్లెవాళ్ళు, మల్లుపిట్టలు, మేకపిల్లలు, పూలే ... నిరంతరం చూడలని మనసు తహతహలాడుతుంది. "ఇక్కడికి ఎందుకొచ్చావ్, అక్కడకన్నా ఇక్కడ నీకు ఏం దొరకదు, వాళ్ళకన్నా మేము నిన్ను ఏం బాగా చూసుకోలేం, అక్కడే వుండు, అప్పుడప్పుడు మేము వస్తుంటాం సరేనా!" అంటూ అమ్మ, నాన్న రోజుకు ఒక్కసారైనా చెబుతున్నారు. అందుకు నేను ససేమిరా అన్నా. నిజానికి కూడా వాళ్ళు ఆ నలుగురిని బ్రతికించడానికి ఎన్నో ఇబ్బందులు పడేవాళ్ళు. పూట గడవడం కష్టంగా వుండేది. నేనొచ్చి నెలలు గడుస్తున్నా, ఏ రోజు రెండు పూటలు కడుపునిండా తిన్నది లేదు. ఆకలితో చెల్లెళ్ళు బాగా ఏడిచేవాళ్ళు. నాన్న ఊర్లోవాళ్ళకి చెట్ల మందులిస్తే, అందుకు బదులుగా ఊర్లోవాళ్ళు ఇచ్చే కొద్దిపాటి నూక, మిగిలిన అన్నం, కూరలు ఓ పూట మా ఆకలి తీర్చేవి. ఒక్కోసారి అన్ని కలిపిన అన్నం పాచిపోయేది. ఆ రోజు ఉపవాసం ఉండేవాళ్ళం. మా బాధ భరించలేని అమ్మ చుట్టుపక్కల ఇండ్లలో అడిగి ఏదో ఒకటి తెచ్చి పెట్టేది. తను మాత్రం కల్లుచెట్లతో ఆకలి, దాహం తీర్చుకునేది. అనారోగ్యాలతో చెల్లెళ్ళు నిరంతరం బాధపడేవాళ్ళు. అప్పుడర్థమైంది నన్నెందుకు పదే పదే వాళ్ళ ఇంటికెళ్ళమన్నారో. అడపా దడపా ఆకలి చావులతో రోజులు ముందుకెలుతున్నాయి.

గతంలో అక్కడ వున్నప్పుడు గొడ్ల కాపుకు వెళ్ళేదాన్ని కానీ, అలాంటివేవి ఇక్కడ లేవు. కొందరు పిల్లలు స్కూలుకు వెలుతున్నారు. నాకు కూడా వెళ్ళాలని వుంది. చాలాసార్లు నాన్నని అడిగితే "రాసే పలక కూడా లేకుండా ఎలా వెలతావ్" అని కోప్పడేవాడు. కొనిపెట్టమని అడిన ప్రతిసారి తర్వాత అని మాత్రం అనేవాడు. ఈ మాట ఎన్ని సార్లు చెప్పాడో లెక్కేలేదు. ఈ మధ్య నేను నాన్న వెనకాల అడవికి వెళ్ళడం బాగా పెరిగింది. ఈ క్రమంలో రెండు మైన పిట్టలు పట్టుకొచ్చా. వాటితో నాకు చెల్లెలకి బలే సందడిగా వుండేది. ఒక్కోరోజు అన్నం లేకపోయినప్పటికీ, పెద్దగా ఇబ్బంది పడేవాళ్ళు కాదు చెల్లెళ్ళు, అంతగా ఆడేవాళ్ళు మైనపిట్టలతో.

నేను లేచేసరికి అమ్మ, నాన్న ఎప్పుడు లేచారో తెలియదు కానీ, కోపంగా మాట్లాడుకుంటున్నారు. "ఆ ఊర్లో భూమి లేదని ఇక్కడికి వచ్చాం. ఇక్కడ ఆ సంఘమోళ్ళు

ఇచ్చిన భూమి కూడా చేసుకోకుండా అట్లే ఉంచితిమి, ఎలాగైనా అప్పు చేసి రెండు గొడ్లు కొను, తర్వాత అప్పు తీర్చుదాం” అని నాన్నతో అమ్మ చెబుతుంది. “వర్షాకాలం పండిస్తున్నాం కదా, నీళ్ళు లేకుండా మిగతా రోజుల్లో ఎట్ల పని సాగుతుంది? అయినా గొడ్లకు పైసలెవరిస్తారు?” అంటూ మంటదగ్గరికెళ్ళాడు నాన్న. ఈ మాటలన్ని నా చెవిన పడుతూనే వున్నాయి. మాకు కూడా కొంత భూమి ఉందన్న విషయం అప్పుడర్థమైంది. వయసొచ్చిన పిల్లలందరూ పక్కనే ఉన్న బెంగాలీ క్యాంపుకు కూలీ పనులకు వెలుతున్నారు. వాళ్ళతోపాటు నేను వెళ్ళడం ప్రారంభించా. ఈ క్రమంలో ఇంట్లో తిండికి కొంత ఊరట లభించింది. బెంగాలీ క్యాంపులో, బాతులతో వాళ్ళ పిల్లలు బాగా ఆడుకునేవాళ్ళు. నా మనసు వాటిపైకి మళ్ళింది. కూలీ డబ్బులతో ఓసారి రెండు బాతులు కొనితెచ్చా. వాటిని చూసి నాకన్నా ఎక్కువ చెల్లెళ్ళే సంతోషపడ్డారు. అక్క మాత్రం చదువుకుంటోంది. ఇంట్లో ఇబ్బంది అవుతుందని నన్ను పంపడం లేదు. అన్న దళంలో పని చేస్తున్నాడు అని అందరు అంటున్నారు కానీ, అదేమిటో, అక్కడ ఎందుకు పని చేస్తున్నాడో నాకు అర్థం కాలేదు. నేను వచ్చినప్పటి నుండీ నా తోటి వాళ్ళ దగ్గరగానీ, పెద్దవాళ్ళదగ్గర గానీ ఒక విషయం బాగా వింటున్నా. సంఘం దాద రాత్రి వచ్చాడనీ, మీటింగ్ పెట్టి పోయాడని ఒకరికొకరు చెప్పుకుంటున్నారు. ఎవరు ఆ సంఘం దాద, మీటింగ్ అంటే ఏమిటి? మొన్న కూడా రాత్రి అమ్మ, నాన్న మీటింగ్ అని వెళ్ళారు. కూలీకి వెళ్ళిన దగ్గర ఎవరినైనా అడగాలి అని అనుకున్న. ఈ క్రమంలో ఊర్లోకి భీం దాద వస్తున్నాడు, పోతున్నాడు. అప్పుడప్పుడు నాన్నతో కూడా మాట్లాడి వెలుతున్నాడు. ఓరోజు నేను నాన్నతో చదువుకోవడానికి వెలతానని ఏడుస్తుంటే భీం దాద అదే సమయానికి మా ఇంట్లో ప్రత్యక్షమయ్యాడు. నా గోల గమనించిన భీం దాద “మన జనతనసర్కార్ స్కూల్ వుందిగా, అక్కడికి పంపించు, మీకేమి ఇబ్బంది వుండదు. సమయానికి పిల్లలకు అన్నం కూడా పెడతారు. అభ్యంతరం లేకపోతే అక్కడే కూడా తనని వుంచొచ్చు. ఇంకేం ఆలోచించకు తర్వాత నేను గురూజీని కలిసి తన గురించి చెబుతా” అని నాన్నతో అరగంట మాట్లాడి వెళ్ళిపోయాడు. ఆ మరుక్షణమే నాన్న స్కూలుకు తీసుకెళ్ళి చెట్టుకింద పిల్లలకి చదువుచెబుతున్న ఒక వ్యక్తికి ఏదో విషయం చెప్పి వెళ్ళిపోయాడు. అప్పుడప్పుడు ఇంటికి రావడం తప్ప, ఎక్కువ సమయం స్కూల్ దగ్గరే. ఇద్దరు గురూజీలు కూడా మమ్మల్ని బాగా చూసుకుంటున్నారు. పిల్లలందరితో ప్రతిరోజు హుషారే.

అనుకోకుండా ఒకరోజు భీం దాద గురుజీవాళ్ళతో కలిసి ఏదో మాట్లాడుతున్నాడు. సహజంగా భీం దాద ‘పిల్లలు, పెద్దలు, ముసలివాళ్ళు’...అన్ని వయస్సులవారితో మాట్లాడతాడు. దాంతో నాక్కూడా ఎప్పటినుండో భీం దాదను కలవాలని ఆరాటం. తిరిగి వెలుతున్న క్రమంలో తనకు ఎదురు పరుగెత్తా. తనవైపే నా పరుగు అని గమనించి ఆగిపోయాడు. “ఏంటి నందే బాగున్నావా,

చదువు ఎలా కొనసాగుతుంది" అని పలకరించాడు. పలకరింపుకు సమాధానం చెబుతూ చాలా రోజులుగా నా మనస్సులో ఉన్న ప్రశ్నలను అడగడం ప్రారంభించా. 'భీందాద మా అన్న ఎక్కడున్నాడు? అసలు ఎలా వున్నాడు?' అందరూ పార్టీలో వున్నాడు అంటున్నారు. పార్టీ స్కూల్ అంటారు? పార్టీ అంటే ఏమిటి? నాకు వివరంగా చెప్పాలి, నాకేం అర్థం కావడం లేదు భీం దాద' అన్న నా మాటకు నవ్వుతూ స్కూల్‌కి పక్కనే వున్న చింతచెట్టు కిందకు నడిచాడు. తన వెనకాలే నేను. అక్కడ కూర్చున్నాక నా ప్రశ్నకు బదులుగా "ప్రజల సమస్యలు ఎక్కడుంటే వాళ్ళు అక్కడుంటారు. అంటే ప్రజల కోసమే వారి జీవితం. అందుకోసం తమ ప్రాణాలను కూడా లెక్కచేయరు. ప్రజల కోసమే మేమున్నాం అని చెప్పుకుంటున్న బూర్జువా ప్రభుత్వాలు, మసి పూసి మారెడుకాయ చేసినట్లు ప్రజలను నిలువెల్లా మోసం చేస్తూ, వాళ్ళ జీవితాలతో ఆడుకుంటున్నాయి. నీకు ఈ తేడా అర్థం కావాలంటే ఇంతకు ముందు నీవు చదువుకున్న బూర్జువా సర్కార్ స్కూలుకీ, ఇప్పుడు చదువుకుంటున్న జనతనసర్కార్ స్కూలుకు తేడా గమనిస్తే అర్థమైపోతుంది. ఆ స్కూల్లో గురూజీలు ఒక్కరోజు వస్తే, 20 రోజులు రారు. పిల్లలకు చెప్పాల్సిన చదువు చెప్పరు, వాళ్ళకు పెట్టాల్సిన తిండి పెట్టరు. స్కూల్ పేరు మీద వచ్చే డబ్బులన్నీ మధ్యలోనే వాళ్ళే తినేస్తారు. అది ఒక్కటే కాదు, అన్ని విషయాల్లో ప్రభుత్వ పనితీరు అదే. ఇక పార్టీ నిర్మించిన జనతనసర్కార్ స్కూల్‌నే అందరూ పార్టీ స్కూల్ అంటున్నారు. ఇప్పుడు నీకు కొంత అర్థమైందనుకుంటా. అలాంటివాళ్ళతోటే మీ అన్న వుండేది" అని చెబుతున్న క్రమంలోనే దాదను కలవడానికి చాలా మంది వచ్చారు. "నందే నీకు అన్ని విషయాలు మన గురూజీలు చెబుతారు. ఏం భయపడకుండా వాళ్ళను అడుగు, నీకు క్లాస్ టైం కూడా అవుతుంది కదా! ఇంకోసారి కలిసినప్పుడు మాట్లాడుకుందాం" అంటూ వచ్చిన వాళ్ళతో మాటలు కలిపాడు. నిజమే, నేను వేరేవాళ్ళ ఇంట్లో వున్నప్పుడు గవర్నమెంట్ స్కూలుకు వెళ్ళేదాన్ని. అక్కడ దాదా చెప్పినట్లుగానే గురుజీలు రారు, ఎవరు పట్టించుకోరు, అసలు చదువే చెప్పరు. ఈ మాటలు ఆలోచిస్తూ క్లాసులోకి వెళ్ళిపోయా.

అప్పుడే నేనొచ్చి సంవత్సరం అయ్యింది. ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాను. స్కూలు, హాస్టల్ అదే కావడంతో బలేగా వుంది. చదువుతో పాటు చక్కటి క్రమశిక్షణ అలవడింది. ఉదయాన్నే స్కూల్ ఆవరణలో వున్న కూరగాయల మొక్కలకు, క్లాసుల వారిగా నీళ్ళు పోయడం, ఎక్సర్‌సైజులు చేయడం, సమిష్టి పనులు ముగియగానే, వ్యక్తిగత పనులు పూర్తి చేసుకొని టిఫిన్ చేయడం, క్లాస్‌కి వెళ్ళడం, క్లాసులు అయిపోగానే సాయంత్రం ఆటలాడటం, వీలునుబట్టి వంటకోసం అడవికి వెళ్ళి కట్రలు, దుంపలు, అడవిలో దొరికే ఆకుకూరలు తేవడం, రాత్రి

పూట ఏ క్లాసుకి అక్కడే సెంట్రీలు చేయడం...ఇదంతా కొత్త ప్రపంచంలోకి వచ్చినట్లుగా అనిపిస్తోంది.

గురూజీలు తరగతిలో క్లాసు చెప్పిన తర్వాత సాధ్యమైన వాటిని ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. వారం వారం ఒక ఊరికి వెలుతున్నాం. ఆయా ఊర్లలో వుండే మురికి కాలువలనూ, మంచినీటి చువ్వలనూ, ఇండ్లకు దగ్గరలో వున్న చెత్తను ఊరివాళ్ళతో పాటు, మేము కలిసి శుభ్రం చేస్తున్నాం. కొన్ని ఊర్లలో భీం దాద కూడా కనిపిస్తున్నాడు. ఈ క్రమంలో పార్టీ వాళ్ళను కూడా చూసా. రాత్రి పూట ఊర్లలో వున్నప్పుడు వాళ్ళు కూడా పనులలో భాగమవుతున్నారు. వెళ్ళేముందు ప్రజలందరిని సమావేశపరిచి మాట్లాడి, పాటలు కూడా పాడుతున్నారు. వాళ్ళ పాటలు వింటుటే ఎప్పుడెప్పుడు నేను నేర్చుకుంటానా అనే అలోచన మొదలైంది. ఈ జీవితం నాలో కొత్త బలాన్ని, ఉత్సాహాన్ని నింపుతున్నది.

ఎథావిధిగా తరగతులు జరుగుతున్నాయి. అంతలో ఫీల్డ్ పనులకు వెళ్ళాలని కాషన్, అన్ని తరగతులవాళ్ళం బయటకు చేరుకున్నాం. గ్రౌండ్‌లోకి వెళ్ళేసరికి గురూజీ మాటల శబ్దం “10 రోజులు మనం పంటపొలాలకు వెలుతున్నాం. ప్రజల పంటలు కూడా కోతకొచ్చాయ్, మనకు చేతనైనంత మనం పాల్గొందాం. మనకు తెలియని విషయాలను అక్కడి రైతులను అడిగి తెలుసుకుందాం. ఇది మన ప్రోగ్రాం. రేపు ఉదయం మన ప్రయాణం” అని చెప్పి కూరగాయల తోటవైపు వెళ్ళిపోయాడు. అనుకున్నట్లుగానే టిఫిన్ చేసి, ఒక జత బట్టలు, ప్లేటు, షాలువా బ్యాగులో సర్దుకొని, రోల్‌కాల్ కోసం ఎదురుచూస్తున్నాం. రోల్‌కాల్ పూర్తయింది. ఎవరి క్లాసు ఫార్మేషన్‌లో వాళ్ళం నడక ప్రారంభించాం. పంట పొలాల్లో కాపుకు వచ్చిన జొన్నలు, కందులు, రాగులు, వేరుశనగ, నువ్వులు... మొదలైన వాటిని ప్రజలతో పాటు కోస్తున్నాం. గురూజీలు అందరితో పాటు పని చేస్తునే అదనంగా రైతులతో పంటలకైన ఖర్చులు, గతేడాది లాభాలను అడుగుతున్నారు. విరామ సమయంలో మాకు ఆ పంటలతో ఏమేమి తయారవుతాయో, ఏది ఎక్కువ శక్తినిస్తుందో చక్కగా వివరిస్తున్నారు. అప్పుడే 6 రోజుల గడిచిపోయాయి. ఒక ఊరి నుండి మరొక ఊరికి వెలుతున్న క్రమంలో దారిలో అక్కడక్కడ భూములలో ఎర్రజెండాలు, స్థూపాలు, చెరువులు, చెక్ డ్యాంలు... తారాసపడుతున్నాయి. సాయంత్రం 7గం॥లవుతుంది. అడివంతా పున్నమి వెన్నెలతో ప్రకాశిస్తున్నది. చాలా మామిడిచెట్లు వున్న స్థలంలో ఫార్మేషన్ ఆగిపోయింది. “మనం ఈ రాత్రికి ఇక్కడే ఆగుతాం, 8 గం॥ లకు ఊరివాళ్ళు భోజనాలు తెస్తారు. అప్పుడు అందరు వచ్చి అన్నం తినాలి. ప్రస్తుతం కాళ్ళు కడుక్కొని అందరం ఇక్కడే కూర్చుని మాట్లాడుకుందాం” అని ముగించాడు గురూజీ. అరగంటలో కడగడం పూర్తి చేసుకొని, క్లాసుల వారిగా కూర్చొన్నాం. “ఎవరికైనా డౌట్స్ ఉంటే అడగండి

చర్చించుకుందాం" అన్నాడు. ఎప్పుడెప్పుడు అడగాలా అని ఎదురుచూస్తోన్న నేను వెంటనే లేచా. 'భూముల్లో ఎర్రజెండాలు ఎందుకు పాతారు?' అని అడిగా. దీనికి గురూజీ సమాధానంగా "ముఖ్యంగా 'దున్నేవారికే భూమి వుండాలి' అనేది మన పార్టీ నినాదం. ఎందుకుంటే మన దేశంలో నూటికి 70 శాతం మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి బ్రతుకుతున్నారు. మరి వ్యవసాయం చేయాలంటే భూమి ఉండాలిగా. ఆ భూములన్ని పెద్ద పెద్ద భూస్వాముల అక్రమ ఆక్రమణలో వున్నాయి. మన ఆదివాసీ గూడాలలో కూడా అంతే. ఆ జెండాలు పాతిన భూములన్నీ, మన పార్టీ నేతృత్వంలో అభివృద్ధి నిరోధక పెద్దాల్‌ల వద్ద, ఆదివాసేతర భూస్వాముల వద్ద స్వాధీనం చేసుకున్నవి. మన కలిమెల ఏరియాలో, మెజారిటీగా ఇప్పుడు మనం చూస్తున్న భూములన్నీ, పార్టీ నేతృత్వంలో స్వాధీనం చేసుకున్న భూములే. మనం పోరాడి సాధించుకున్నాం కాబట్టి ఆ భూముల్లో మన పార్టీ జెండాలు పాతారు. అయితే ఈ విజయాలు అంత తేలికగా మనకు దక్కలేదు. ఈ పోరాటంలో ప్రభుత్వ సాయుధ బలగాలు దోపిడీ వర్గాల వైపు వుంటే, పార్టీ, పి.ఎల్.జి.ఎలు ప్రజలవైపు నిలబడ్డాయి. ఈ ఘర్షణలో అనేక మంది ప్రజల ముద్దుబిడ్డలు ప్రభుత్వ సాయుధ బలగాలతో వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలను ఫణంగా పెట్టారు. ఈ అమరుల జీవితాలను ఆదర్శప్రాయంగా చేసుకొనేందుకే, మనం ఈ స్థూపాలను నిర్మించుకున్నాం. అవి మనకు గొప్ప పోరాట స్ఫూర్తి. పార్టీ ఈ ప్రాంతంలో ప్రజలను విప్లవంలోకి సంఘటిత పరిచేందుకు విప్లవ సంస్కరణలను కూడా చేపట్టింది. ఈ సంస్కరణలలో భాగంగా అనేక చెక్‌డ్యాంలు, కొత్త చెరువులు, నీటి కుండీలు ... ఇలా ఎన్నింటినో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టింది. భూస్వాముల ఆధీనంలో వున్న చెరువులను కూడా ప్రజలపరం చేశారు. పౌష్టికాహారానిచ్చే పంటలను పరిచయం చేశారు. ఇప్పుడు పొలాల్లో చూసిన వాళ్ళందరూ ఈ చుట్టుపక్కల 5 గ్రామలకు చెందినవారు. అన్ని ఊర్లలో సమిష్టి వ్యవసాయానికి అలవాటయ్యారు. మరోక ముఖ్యమైన విషయమేమిటంటే గతంలో మన గ్రామాలలో పౌష్ఠికాహారలోపం, మలేరియా, టి.బి, శిశు మరణాలు ... మొదలైన రోగాలతో అనేక మంది మరణించేవారు. పార్టీ వచ్చాక ప్రజలకు మందులిచ్చి కాపాడటమే కాకుండా, ఆర్.పి.సి గ్రామాలన్నింటిలో యువతకు డాక్టర్ ట్రైనింగ్ క్యాంపులు నెలకొల్పారు. ఇందులో ప్రావిణ్యత పొందినవారిని పాకెట్, ఏరియా డాక్టర్లుగా నియమించారు. అప్పటినుండే మన దగ్గర 90 శాతం మరణాలు తగ్గాయి. సరే ఊరి దాదలు అన్నం తెచ్చారు. తర్వాత మాట్లాడుకుందాం" అని దాదల దగ్గరకు వెళ్ళాడు గురూజీ. పార్టీకి ఇంతటి చరిత్ర వుందా! అని చాలా ఆశ్చర్యం వేసింది. ఒక పాకెట్ ఊర్లు తిరుగుతుండగానే గిర్రుమని 10 రోజులు గడిచాయి. నాలో వున్న ఒక పెద్ద డౌట్ మాత్రం అలాగే మిగిలి పోయింది. ఈ విషయం తప్పకుండా తర్వాత ఎప్పుడైనా భీందాదనే

అడగాలని నిర్ణయించుకున్నా. ఎందుకంటే భీందాదకు తెలివొచ్చినప్పటినుండి పార్టీతోనే గడిపేవాడని ఊర్లోవాళ్ళందరంటారు. పెద్ద పెద్ద వయస్సు గల ముసలివాళ్ళు కూడా ఏ విషయమైనా భీం దాదానే అడుగుతుంటారు. ఈ క్రమంలో జులైలో ప్రారంభమైన వర్షాలు సెప్టెంబర్‌లో కూడా ఎడతెరిపు లేకుండా కురుస్తున్నాయి. దీంతో ఇండ్లకు వెళ్ళమని సెలవులివ్వడంతో బాతులను, మైన పిట్టలను ఎప్పుడెప్పుడు చూస్తానా అనుకుంటూ ఉత్సాహంతో ఇంటికెళ్ళిపోయా.

పొడిపొడిగా కురిసే సన్నని వర్షానికి గంతులేస్తూ, మా బ్యాచీ వాళ్ళందరం కలిసి స్కూలు విషయాలు మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నాం. భీం దాద ఊర్లోకి రావడం, మీటింగ్ చేయడం అయిపోయాయి. అటువైపుగా వెలుతున్న భీందాదని అందరం చుట్టేసుకున్నాం. 'మాకు ఏదో ఒకటి చెప్పాకే వెళ్ళాలి, లేకుంటే మేం వదలం' అంటూ అందరం పట్టుబట్టాం. "సరే మీలాంటి కొత్తతరం తెలుసుకోవాల్సిన విషయం చెబుతా, ఎందుకుంటే రేపు మన పార్టీని ముందుండి నడింపించాల్సినవాళ్ళు మీరేగా, అందరు శ్రద్ధగా వినాలి" అన్నాడు. అందరం ఒ.కె అన్నాం. "పార్టీ రాకముందు మేము మన అడవిలోకి ధైర్యంగా పోయేవాళ్ళం కాదు. ప్రభుత్వం నియమించిన ఫారెస్టు అధికారులు వుండేవాళ్ళు. అడవిలో దొరికే దేన్నైనా అనుభవించే అవకాశం లేదు. దేన్ని ముట్టుకున్నా వాటికి రుసుం చెల్లించాల్సిందే. బాగా కొట్టేవాళ్ళు. ముఖ్యంగా మహిళల్ని అత్యాచారాలు చేయడానికి హద్దులే లేవు. ఊర్లమీద పడి ప్రజలను హింసించేవాళు ్ళ. కానీ పార్టీ వచ్చాక వాళ్ళ ఆటలు సాగలేదు. వాళ్ళందరిని పార్టీ తన్ని తరిమింది. అప్పుడు మన ఆదివాసీలకు ఫారెస్టు అధికారుల నుండి విముక్తి లభించింది. ఇక నేను కళ్ళారా చూసిన మన కలిమెల పోరాటాల విషయానికొస్తే రోజంతా కష్టపడి వెదురు కర్రలు నరుక్కొని అమ్మడానికి పోతే తక్కువ డబ్బులిచ్చేవాళ్ళు. అవి దేనికి సరిపోయేవి కాదు. తూనికాకు 100 ఆకుల కట్టకు, 5 పైసలిచ్చేవాళ్ళు. పార్టీ ఆధ్వర్యంలో ప్రజలందరం సంఘాలుగా ఏర్పడి, ఐక్యమై పోరాడి వ్యాపారుల మెడలు వంచి, ప్రస్తుతం 50 ఆకుల తూనికాకు కట్టకు రూపాయిన్నర సాధించుకున్నాం. వెదురుకు సరైన ధర వచ్చేంతవరకు పోరాడాము. ప్రభుత్వం రోడ్లు వేయించడానికి ప్రయత్నించినప్పుడు 'మాకు రోడ్లు కాదు, తాగడానికి మంచినీళ్ళు ఇవ్వండి, హస్పిటల్ కట్టించండి, డాక్టర్లను పంపించండి' అని పెద్దమొత్తంలో ధర్నాలు చేశాం. ఇంకా ధాన్యం ధరల పెంపు కోసం, సాగునీటి కోసం, ఐక్యకార్యాచరణ పోరాట కమిటిని ఏర్పాటు చేసి, కొరకటపల్లి నుండి మన్నెంకొండ వరకూ కెనాల్ తవ్వాలని వేలాది మందితో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, అనేక సార్లు ర్యాలీలు, సభలు, ధర్నాలు నిర్వహించాము. ఇలా మౌలిక సమస్యలపై అనేకసార్లు మల్కనగిరి కలక్టర్ ఆఫీసును ముట్టడించాం. ప్రభుత్వ నిర్బంధానికి

వ్యతిరేకంగా బంద్‌కు పిలుపునివ్వడంతో పాటు, సంఘం, మిలీషియా కలిసి పోలీసులపై దాడులు చేపట్టాం. సరే కామ్రేడ్స్ ఈ సారికి ఈ విషయం సరిపోతుంది సరేనా! బాగా చీకటి పడింది కదా! నాక్కూడా పక్క ఊరిలో పనుంది. మళ్ళీ కలిసినప్పుడు మరిన్ని విషయాలు మాట్లాడుకుందాం. ఉంటా మరీ, ముఖ్య విషయం ఏమిటంటే, ఈ నెల 21న పార్టీ పుట్టినరోజు, శత్రు కదలికలవల్ల ఆ తేదీకన్నా ముందుగానే వారోత్సవాలను వారం రోజులు జరుపుకుంటాం. ఈ క్యాంపెయిన్‌లో మీ బ్యాచ్ అందరూ పాల్గొనాలి. క్యాంపెయిన్‌లో కలుద్దాం మరీ" అంటూ భీం దాద చీకట్లోనే వెళ్ళిపోయాడు.

సెప్టెంబర్ 21 పార్టీ దివాస్ సందర్భంగా క్యాంపెయిన్స్ జరుగుతూనే వున్నాయి. ఈ క్యాంపెయిన్‌కి మా బ్యాచీలో 20 మందికి పైగా బయలుదేరాం. వెళ్ళే దారుల్లో మిలీషియా, సంఘం, జి.ఎన్.ఎస్ టీంల ప్రచారం జోరుగా సాగుతున్నది. డప్పుల దరువులు, అమరుల పాటలు వింటుంటే మనసు ఓ పట్టాన ఆగడం లేదు. వెళ్ళి వాళ్ళతో వెంటనే కలవాలనిపిస్తుంది. క్యాంపెయిన్ టీం దగ్గరకు చేరుకున్నాం. ఆ రాత్రికి ఒక ఊర్లో దళం వాళ్ళతో కలిసి ప్రచారంలో పాల్గొన్నాం. శత్రు నిర్బంధం వలన మీటింగ్ ముందుగానే జరుగుతుందని భీందాద చెప్పినట్లు నాలుగు రోజలు ముందుగానే ఏర్పాట్లు జరుగుతున్నాయి. సరిగ్గా నాలుగు రోజుల ముందే మేము ఆ స్థలానికి చేరుకున్నాం. అప్పుడే తెల్లారిపోయింది. సంఘాలు, మిలీషియా, ప్రజలతో పండగ వాతావరణం నెలకొంది. వీచే గాలులకు తోడు, పార్టీ పాటలతో మైకుసెట్‌ల శబ్దానికి చెట్లు నాట్యమాడినట్లు కదులుతున్నాయి. జెండా ఆవిష్కరణ, ఆ తర్వాత 2 నిమిషాలు అమరులకు నివాళి. అందరు కలిసి పాడే పాట. దీన్నే అంతర్జాతీయ గీతం అంటారని పక్కనే వున్న సంఘం దాద మాకు చెబుతున్నాడు. అమరులకు జోహార్లర్పిస్తూ జి.ఎన్.ఎస్ వాళ్ళ పాట ముగిసాక, కె.ఎ.ఎమ్.ఎస్ అధ్యక్షురాలు రాజే మాట్లాడటం మొదలుపెట్టింది. తను మాట్లాడిన విషయాలు నాకు అంత లోతుగా అర్థం కాకపోయినప్పటికీ, ఒకటి మాత్రం బాగా అర్థమైంది. ఒక మహిళ చాలా ధైర్యంగా దాదాపు 8వేల మంది ముందు మాట్లాడటం ఎంతటి గొప్ప చైతన్యం! తను ఆ స్థాయికి ఎదగడానికి పార్టీ అందించిన రాజకీయాలు, ప్రోత్సాహమే కారణం. ఊర్లలో మహిళలు ఇప్పటికీ ఇంట్లో కూడా ధైర్యంగా నోరెత్తరు. నా వయస్సు వాళ్ళయితే తమకు ఇష్టం లేకపోయినప్పటికీ, ఇంట్లోవాళ్ళు కల్లుతాగి నిర్ణయించే బలవంతపు పెళ్ళిళ్ళకు బలౌతున్నారు. ఇలాంటివి గ్రామాలలో లెక్కలేనన్ని. కానీ పార్టీ వచ్చాక వాటన్నింటికి తెర పడిందని మొన్నే భీం దాదా చెప్పాడు. అయితే దీనిని బట్టి "మహిళలు ఏం తక్కువ కాదు, పురుషులతో సమానంగా అన్నిట్లో రాణించాలి" అని గురూజీ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

ఈ మీటింగ్‌లే కాక పార్టీ దివాస్‌ని పురస్కరించుకొని అనేక ప్రతిఘటన కార్యక్రమాలలో, వారోత్సవాలలో మా వంతు పాత్ర నిర్వహించాము. అప్పుడే సంవత్సరం గడిచిపోయింది. మళ్ళీ పార్టీ దివాస్ వచ్చే రోజులు దగ్గరపడుతున్నాయి.

ఆ రోజు 2013, సెప్టెంబర్ 13వ తేదీ. రోజు వారి పనులు పూర్తి చేసుకున్నాం. పాల్గొన్న ప్రతిఘటన కార్యక్రమాల గురించి అందరం మాట్లాడుకుంటుండగానే పొద్దు పోయింది. అడివంతా నలుపురంగు సంతరించుకుంది. మబ్బులు ఆకాశాన్ని చుట్టేస్తున్నాయి. అరగంట తేడాతో వర్షం జోరుగా కురుస్తున్నది. సెంట్రీలు తప్ప ఎక్కడివాళ్ళు అక్కడ తమ తమ టెంట్లలో నిద్రిస్తున్నారు. గ్రామంలోని ఇద్దరు విప్లవ ద్రోహులు నేరుగా పోలీసులకు ఎప్పుడు సమాచారమిచ్చారో తెలియదు. వందలాది మంది పోలీసు బలగాలతో రాత్రికి రాత్రే మకాంను అన్ని వైపులనుండి చుట్టుముట్టారు. సరిగ్గా ఉదయం 5.30 గంIIల సమయంలో అతిసమీపం నుండి టెంట్‌లో నిద్రిస్తున్న మాపైకి పోలీసులు ఆటోమేటిక్ ఆయుధాలతో విచ్చలవిడిగా కాల్పులు జరపడం ప్రారంభించారు. ఆ కాల్పులలో 13 మంది నా సహచర మిత్రులను కోల్పోయాను. పోలీసులు వారివద్ద ఎకె – 47, 9 యమ్.యమ్ పిస్టల్స్, లాంటి ఆయుధాలు పెట్టి, నిజమైన ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించి ప్రచారం చేశారు. వాస్తవాలు బయటకు రాకుండా చేయడానికి ఆదరాబాదరాగా శవాలను గుడ్డల్లో చుట్టి, మూటలు కట్టి జిల్లా కేంద్రానికి తరలించారు. శవాలను కుటుంబ సభ్యులకు కూడా ఇవ్వకుండా పూడ్చిపెట్టారు. ప్రజలు వాస్తవాలను బయట పెట్టడంతో పోలీసు ఉన్నతాధికారులు నోరు మెదపలేదు. ఈ సంఘటనలో అమరులైన నా సహచర కామ్రేడ్స్‌కు పార్టీ, పి.యల్.జి.ఎ, ప్రజానిర్మాణాలు, ప్రజలు వినమ్రంగా తలవంచి జోహార్లు అర్పిస్తూ, వారి ఆశయాలను ముందుకు తీసుకుపోతామని పిడికిళ్ళు బిగించి శపథం చేశారు.

ఆ ఎన్‌కౌంటర్ నుండి నేను ఎలా తప్పించుకున్నానో ఆ విషయం గుర్తొస్తే చాలు నేను నేనేనా? అనే సందేహం కలుగుతుంది. అమరులైన 13 మంది జ్ఞాపకాలు మనసును కలవరపెడుతున్నాయి. అందరికన్నా అతి చిన్న వయస్సుగల గంగిని పోలీసులు పట్టుకొని బాయ్‌నెట్‌తో పొడిచి, హింసించి చంపేసారు. తనది మా ఊరే కావడంతో నాకు సన్నిహితురాలు. గంగివాళ్ళ అమ్మ పార్టీలోనే అమరురాలయ్యిందనీ, అప్పుడు గంగికి 2 సంవత్సరాలని ఊర్లోవాళ్ళు అంటుంటే విన్నాను. గంగిని అందరు కూడా గారాబంగా చూసేవారు. ఎన్‌కౌంటర్ విషయాలన్ని బుర్రలో తిరుగుతున్నాయి. ఇంటికి వెళ్ళాలా? ఉండిపోవాలా? ఒకటే ఘర్షణ, భీం దాద నుండి కబురు రావడంతో తనదగ్గరకు చేరుకున్న. “వచ్చి చాలా రోజులవుతుంది. ఇంట్లోవాళ్ళు ఎదురుచూస్తారు. ఈ రోజు సాయంత్రం మీ ఊరి వాళ్ళు పనిమీద వస్తున్నారు. వాళ్ళ వెనక నీవు వెళ్ళాల్సి ఉంటుంది. జరిగిన సంఘటన పదే పదే ఆలోచించకు. మనం యుద్ధంలో

వున్నాం. పీడిత ప్రజల అధికారం కోసం జరిగే ఈ యుద్ధంలో మరణాలు సహజం. శత్రువు బలమైనవాడు. వాడిని అణిచివేయడానికి మనం మరింత ధైర్యంగా మన పనికి పదును పెట్టాలి. మన సైన్యాన్ని పెంచుకోవాలి. మన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి" అని మనోస్థైర్యాన్ని పెంచే భీం దాద మాటలు నాకు మరింత ఊరటనిచ్చాయి.

వెలుతురు పూర్తిగా తగ్గడంతో చీకటి చిక్కబడుతుంది. మా ఊరివాళ్ళు రానే వచ్చారు. నా ఆలోచనలు, నా మనసు పడే ఘర్షణ మాత్రం నన్ను తేల్చుకోమంటున్నాయి. గురూజీ చెప్పిన పార్టీ అమరుల చరిత్ర, వారిని స్మరిస్తూ ప్రజలు నిర్మించుకున్న స్థూపాలు, అన్నింటికన్నా నా జీవితంలో గుర్తిండిపోయే శీలకోటలో నా సహచరుల త్యాగాలు, వారికి స్ఫూర్తిగా నిర్మించిన స్థూపాలు ... ఇవన్నీ నన్ను ప్రజాయుద్ధంవైపు నడవమని ఆజ్ఞాపిస్తున్నాయి. క్షణం ఆలస్యం చేయకుండా ఊరి మిత్రులతో కలిసి నడక ప్రారంభించా. వారితో ఇంటికి చేరా. కుటుంబ పరివారంతో రెండు రోజులు గడిపి, వారి నుండి వీడ్కోలు తీసుకున్న. అస్తమిస్తున్న సూర్యున్ని చూస్తూ, అనివార్యమైన మరో వేకువకోసం, ఆలీవ్‌గ్రీన్ దుస్తులతో లాంగ్‌మార్చ్ కవాతు చేస్తూ, కదులుతున్న ఎర్రదండులో షరీకయ్యాను.



**ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో అమాయక ఆదివాసీలపై సాగుతున్న వేట**
**గ్రీన్‌హంట్ దాడిలో ధ్వంసమైన ఆదివాసీల ఇళ్ళు [సింగంమడుగు–డీ.కే]**




కటాఫ్ ఏరియా
మిలీషియా కామ్రేడ్స్
[ఏ.ఓ.బి]



జే.ఎన్.ఎస్
[గొనొ నాట్య సంఘ]
కామ్రేడ్స్ ప్రధర్శన
[ఏ.ఓ.బి]



ప్రజా విముక్తి గెరిల్లా
సైనిక యోధులు/
యోధలు




"చూస్తుండగానే రోజులు క్షణాల్లా గడిచిపోయాయి. సరిగ్గా 3 రోజుల్లో నా ప్రయాణం. గంటలు గడిచిపోతున్నా, నా మనసు కుదురుగా లేదు. ఈ క్రమంలో నేను వెళ్ళేరోజు రానే వచ్చింది. నాన్న ఏం ఆలోచించాడో తెలియదు, నవ్వుతూ నా ముందుకొచ్చాడు. పొద్దుపోయే సమయం, వాకిట్లో కూర్చున్నామిద్దరం. పిల్లమేకలు అరుస్తూ, చెంగుచెంగున గెంతుతూ మా మధ్యలో నుండి అటు ఇటు పరుగెడుతున్నాయి. కోళ్ళు గూళ్ళలోకి వెలుతుంటే కోడిపిల్లలు చిన్న గొంతుతో అరుస్తూ వాటి వెనకాలే నడుస్తున్నాయి. నాన్న మాట్లాడటం ప్రారంభించాడు. "పార్టీ మన లాంటి ఎంతో మంది పేదవాళ్ళకోసం పని చేస్తున్నది. అలాంటి పార్టీలో నీవు చాలా ధైర్యంగా, చురుగ్గా పని చేయాలి. మిలటరీ పరంగా బాగా ఎదగాలి. ఏ సయమంలోనైనా శత్రువును ఎదుర్కోవడానికి సిద్ధంగా వుండాలి. ముఖ్య విషయమేమంటే ఎప్పుడు కూడా ఊగిసలాటకు గురి కావద్దు. సమస్యలు వచ్చినప్పుడు మరింత ధైర్యంగా వాటిని తట్టుకొని ముందుకెళ్ళాలి. ఇంటికెళ్ళాలనే ఆలోచన ఎట్టి పరిస్థితుల్లో రానియకూడదు. నీ ప్రాణం వున్నంత వరకు నిన్ను నమ్మిన ప్రజల కోసం పని చేయి. ఇక నేను ఒంటరినవుతానని బాధపడకు. ఎప్పుడూ ప్రజల్లో వుండే నేను ఒంటరి కాను" అంటూ తల నిమిరాడు నాన్న. నాన్న మాట్లాడిన మాటాలకు నాకు కళ్ళు చెమర్చాయి. లేచి నిటారుగా నించున్నాను. తలెత్తి నాన్నను చూస్తే ఎంతో ఉన్నతంగా కన్పించాడు. చేతులు కలిపాను. చేతి సంచి భుజాన తగిలించుకుని నాలుగడుగులు ముందుకు వేసి వెనుదిరిగాను. మా ఇల్లు, నాన్న, కోళ్ళు, మేకలు, గొడ్లు అన్నీ నా కన్నీటిలో మసక మసకగా కన్పిస్తున్నాయి. కానీ మాలాంటి వేలాది గ్రామాల్లో విప్లవ రాజకీయాలను ప్రతిష్టించాలనే నా ఆశయం స్పష్టంగా దారి చూపిస్తుండగా వడివడిగా ముందుకు నడిచాను."